



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 122 శుక్రవారం 19 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




3

## ప్రధాని మోడీకి మరో గౌరవం

### ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం ప్రదానం




## పోలీసింగ్ అంటే
# భయం ఉండాల్సిందే

**అమరావతి :** రాష్ట్రంలో శాంతిభద్రతలే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం అధికారులు కఠినంగా ఉండాల్సిందేనని అన్నారు. పోలీసింగ్ అంటే భయం ఉండాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండోరోజు శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉందని.. మరికొన్ని చోట్ల తక్కువగా ఉందన్నారు. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రాపర్టీ సంబంధిత కేసులు ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటో విశ్లేషించాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని.. కానీ జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా

మిగతా 2 లో

### శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు

### క్రైమ్ రేట్ ఎక్కువగా ఉన్న జిల్లాలను సమీక్షించాలి

### రెండో రోజు కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతలపై చంద్రబాబు



2


## చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

2

### నకిలీ మద్యం కేసు

## జోగి బ్రదర్స్‌కు దక్కని ఊరట





### ఉపాధి హామీ చట్టం స్థానంలో

# ‘వీబీ జీ రామ్ జీ’

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్



3

### మహాత్ముడిని అవమానించారు

రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంకగాంధీ

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

# దేశంలో అతిపెద్ద స్కాం

### కోటి సంతకాల సేకరణ దస్త్రాలు గవర్నర్‌కు అందచేత

- ఈ పోరాటం ఇంతటితో ఆగదని స్పష్టీకరణ
- కోర్టులో కేసు వేస్తామని జగన్ హెచ్చరిక



**విజయవాడ :** రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దేశంలో అతిపెద్ద స్కాం అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను గురువారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందించారు. అనంతరం లోక్‌భవన్ వద్ద వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ’మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కూడా ఆయనకు తెలియజేశాం. ఈరోజు ఒక చారిత్రక ఘట్టం. ఏకంగా 1,04,11,136 సంతకాలు. దేశ చరిత్రలో కూడా ఇలాంటి

మిగతా 2 లో

### ‘ఆపరేషన్ సిందూర్’

# మన సత్తా చాటింది

- వేగంగా, కచ్చితత్వంతో దాడులు చేయగలం: రాజ్ నాథ్ సింగ్
- ఉగ్రశిబిరాల ధ్వంసంలో వాయుసేన వేగం, కచ్చితత్వం అద్భుతమని ప్రశంస
- పాక్ దాడుల యత్నం వేళ ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్న రాజ్ నాథ్
- ఆధునిక యుద్ధాల్లో వైమానిక శక్తిదే నిర్ణయాత్మక పాత్ర అని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** ’ఆపరేషన్ సిందూర్’ సమయంలో.. వేగంగా, అత్యంత ప్రభావ వంతంగా స్వల్పకాలిక సైనిక చర్యలు చేపట్టగల సత్తాను భారత్ స్పష్టంగా నిరూపించుకుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. భారత వైమానిక దళం సాంకేతికంగా, కార్యాచరణ పరంగా అత్యంత పటిష్ఠమైన శక్తిగా

మిగతా 3 లో


మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# పోలీసింగ్ అంటే భయం ఉండాల్సిందే

ఉందని పేర్కొన్నారు. అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఎందుకు నేరాలు అధికమయ్యాయో విశ్లేషించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గతంతో పోలిస్తే 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని వెల్లడించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. అలాగే మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయని.. మిగతా జిల్లాల్లో వేర్వేరు కారణాల వల్ల క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని వివరించారు. అన్నమయ్య లాంటి జిల్లాలో మైగ్రేషన్ లేబర్ కారణంగా నేరాలు జరుగుతున్నాయని ఆయన సోదాహరణగా వివరించారు. కిడ్నాపింగ్ లాంటి కేసులు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. 56 శాతం మేర డిటెక్షన్ రేట్, 55 శాతం మేర రికవరీ రేటు ఉందన్నారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయని చెప్పారు. డీహెచ్ఎంఎస్.. ఆధునిక సాంకేతికత ద్వారా సీసీ కెమెరాల హెల్త్‌ను నమోదు చేస్తున్నామన్న ఈ సమావేశంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు వివరించారు. నగరంలో నిఘా కోసం 10 వేల సీసీ కెమెరాల డ్యాష్ బోర్డును కమ్యూనిటీ సహకారంతో రూపొందించామన్నారు. ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితుల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని సీపీ రాజశేఖర్ బాబు వెల్లడించారు.

## 22ఎ భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత

22ఎ భూముల వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. వచ్చే కలెక్టర్ల భేటీలో 22ఎ భూముల వివాదాల పరిష్కారంపై తొలి ఎజెండాగా చేపడతామని ఆయన తెలిపారు. ఇదే సమయంలో రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. కొందరు ప్రొఫెషనల్స్ కావాలనే భూవివాదాలు సృష్టించే యత్నం చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై అవ-సరమైతే పీడీ యాక్ట్ పెట్టి కఠినంగా వ్యవహరించండని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అలానే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు నేరుగా ఓనర్లకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భూ వివాదాలు, 22ఎ భూములపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. హౌసింగ్‌లో పొజిషన్ సర్టిఫికెట్లు త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు తెలిపారు. 20-30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికేషన్ జారీ చేయాలని సీఎం తెలిపారు. విశాఖ, అనకాపల్లి సహా



ఐదారు జిల్లాల్లో భూ కబ్జాలు నియంత్రించండని, భూకబ్జా ఫిర్యాదులపై తక్షణం కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నిందితుల్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకుండా చర్యలు తీసుకోండని ఎస్పీలకు చంద్రబాబు ఆదేశించారు. అలానే విశాఖలో భూ వివాదాల్లో నేతల జోక్యంపై డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తావించారు. భూ వివాదాల్లో కొందరు రాజకీయ నేతల జోక్యం ఉంటోందని, ఆ అంశంలో తనకు ఫిర్యాదులు అందాయని సీఎం దృష్టికి పవన్ కల్యాణ్ తెచ్చారు. డిప్యూటీ సీఎం తెలిపిన అంశంపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. భూ వివాదాల్లో రాజకీయ నేతల జోక్యాన్ని సహించొద్దని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. భూవివాదాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్నారనే ఫిర్యాదులు రాకూడదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దేశంలో అతిపెద్ద స్కాం



మొదటి పేజీ తరువాయి

ఉద్యమం జరిగి ఉండదేమో?. గత అక్టోబరు 7న ప్రజా ఉద్యమ కార్యాచరణ ప్రకటించాం. ఆ తర్వాత అక్టోబరు 10 నుంచి ఈనెల 10 వరకు ప్రతి గ్రామం, పట్టణం, ప్రతి వార్డులో రచ్చబండ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వారిని ఉద్యమంలోకి తీసుకువచ్చాం. వాళ్ల సంతకాలు తీసుకున్నాం అని అన్నారు. నవంబర్ 12న ఒకసారి, మళ్లీ ఈనెల 10న మరోసారి అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాం. డిసెంబరు 10న ర్యాలీల తర్వాత కోటి సంతకాల పత్రాలను జిల్లా కేంద్రాలకు తరలించాం. అక్కడ డిసెంబరు 15న ర్యాలీలు నిర్వహించి, వాటిని ప్రజలకు చూపాం. ఆ తర్వాత వాటన్నింటినీ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించి, గురువారం గవర్నర్‌కి చూపించాం. ఆ విధంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల నిరసన, వారి మనోభావాలను వివరించామని అన్నారు. ఈరోజు మీ అందరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నాను. మనం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ తరాలకు ఎలాంటి ప్రభావం పడుతుందన్నది ఆలోచన చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్స్ ఎందుకు నడుపుతుంది? దేశంలో అన్ని చోట్ల స్కూళ్లు, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సులను ప్రభుత్వమే ఎందుకు నడుపుతుందో ఆలోచించారా? రాష్ట్ర ప్రభుత్వమే వీటిని నడపకపోతే పేద, మధ్య తరగతి వారు ప్రైవేటును ఆశ్రయించలేక నష్టపోతారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని ఒక బాధ్యతగా భావించి నిర్వహిస్తాయి. ఇలా అన్నీ ప్రైవేటీకరిస్తూ పోతే, దోపిడికి చెక్ పడదు. ప్రజా సేవలు పొందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరాలంటే కనీసం రూ.5 వేలు ఛార్జ్ చేస్తారు. కనీస వసతుల రూమ్ కావాలంటే రోజుకు రూ.10 వేలు, ఐసీయూలో రోజుకు కనీసం రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయం. మా ప్రభుత్వ హయాంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా చేయడంతో పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టాం. ఎక్కడైనా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, అక్కడ టీచింగ్ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది. అప్పుడు ఆ ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సులు అందరూ అందుబాటులో ఉంటారు. దీంతో పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. దాని వల్ల చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టం వచ్చినట్లు ఛార్జ్ చేయలేవు. మేము నాడు తలపెట్టిన 17 మెడికల్ కాలేజీలు ప్రారంభమైతే, మన పిల్లలకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటు లోకి వస్తాయి. దాని వల్ల వైద్య విద్య కోరుకునే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని జగన్ అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ఆ పని చేయకపోగా, కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకర్దిస్తూ, స్కామ్‌లు చేస్తున్నారు. స్కామ్‌ల విషయంలో చంద్రబాబు నాలుగు అడుగులు ఎక్కువ వేస్తున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఒక స్కామ్ అయితే, ఆ తర్వాత రెండేళ్ల పాటు, ఆ కాలేజీల సిబ్బందికి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం మరో స్కామ్. అంటే అక్కడున్న భూమి, భవనాలు, పని చేసే వారంతా ప్రభుత్వ ఉద్యోగులు. కానీ, నిర్వహణ మాత్రం ప్రైవేటువారిది. అంటే ఖర్చు ప్రభుత్వానిది. సంపద ప్రైవేటువారికి. ఒక మెడికల్ కాలేజీలో జీతాలు ఏడాదికి కనీసం రూ.60 కోట్లు. రెండేళ్లకు రూ.120 కోట్లు. అంటే ఆ లెక్కన 10 మెడికల్ కాలేజీల సిబ్బందికి రెండేళ్లపాటు జీతంగా కనీసం రూ.1200 కోట్లు అవుతుంది. ఇలాంటి స్కామ్‌లు దేశంలో ఎక్కడా ఉండవన్నారు. మా హయంలో ప్రతి చోట 50 ఎకరాలు ఉండేలా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. వాటికి నాబార్డ్, ఇతర బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ నిధులు టైఅప్ చేశాం. వాటిలో 7 కాలేజీలు పూర్తి చేశాం. అవి ఇప్పుడు రన్నింగ్‌లో ఉన్నాయి. వాటి ద్వారా 800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన కాలేజీలు పూర్తి చేసేందుకు ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు అవసరం. రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆ మాత్రం నిధులు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. పోనీ మీరు ఖర్చు చేయలేకపోతే వదిలేయండి. మేం వచ్చాక వాటిని పూర్తి చేస్తాం. చంద్రబాబుకు గట్టిగా తగిలేట్టుగా గవర్నర్ దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్లాం. మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తే, మాకు క్రెడిట్ దక్కుతుందన్న అక్కసుతో చంద్రబాబు పేదలకు నష్టం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటీకరణతో స్కామ్‌లు చేస్తున్నారు. నిజానికి ఆ మెడికల్ కాలేజీలన్నీ భవిష్యత్‌లో లక్ష కోట్ల ఆస్తి అవుతాయి. ఇంకా కొన్ని కోట్ల మందికి ఉచిత వైద్యం అందిస్తూ, వెల కట్టలేని సేవలందిస్తూ కోట్లాది మందికి వెలుగులు నింపుతాయన్నారు. మా ఈ పోరాటం ఇంతటితో ఆగదు. గవర్నర్‌కి కోటి సంతకాలు చూపించాం. ఇక్కడి నుంచి రేపు కోర్టులో పిటిషన్ వేస్తాం. అక్కడ కూడా ఈ కోటి సంతకాలు చూపిస్తాం. మనం ఇప్పుడు ఆ పని చేయకపోతే, రేపొద్దున వైద్యం కోసం ఒక్కొక్కరు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. గవర్నర్ కానీ, మనసున్న ఏ వ్యక్తికి కానీ చంద్రబాబు చేసేది తప్పు అని అర్థమవుతుంది. ఇదే గవర్నర్ ఇంట్లో పని చేసే వ్యక్తులు మెడికల్ కాలేజీకి వెళ్తే ఉచితంగా వైద్యం అందుతుంది. గవర్నర్‌ది మంచి మనసు. ఆయన అన్నీ అర్థం చేసుకున్నారు. మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు ప్రతి ద్వారం తొక్కుతాం. కోర్టుల ద్వారా వీటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఇంకా ఉద్యమమూ కొనసాగుతుంది. ఎందుకంటే ఇది కచితంగా స్కామ్. అన్నీ ప్రభుత్వానివే. అప్పగించేది మాత్రం ప్రైవేటు వ్యక్తులకా?. ఎన్నికల ముందు ఏం చెప్పారు? బిర్యానీ పెడతామని నమ్మించారు. కానీ, ఈరోజు అవేవీ లేవు. చదువుకుంటున్న పిల్లలకు ఫీజు రీయింబర్స్ లేదు. దాంతో వారు చదువులు మానేస్తున్నారు. ఆరోగ్యశ్రీ లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు ఇవ్వడం లేదు. విశాఖలో మా హయాంలో రిషికొండపై రూ.230 కోట్లతో బ్రహ్మాండమైన బిల్డింగ్ నిర్మిస్తే, అది ఇప్పుడు నగరానికే తలమానికంగా ఉంది. అయినా దానిపై పిచ్చి విమర్శలు చేస్తున్నారు. విశాఖలో ఒకరోజు నిర్వహించిన యోగా డే కోసం అంత కంటే ఎక్కువే ఖర్చు చేశారు. మ్యాట్లు మొదలు మిగిలిన సామాగ్రి కొనుగోలులోనూ తీవ్ర అవినీతికి పాల్పడ్డారని వైఎస్ జగన్ గుర్తు చేశారు. జగన్ వెంట మాజీమంత్రులు విడుదల రజని తదితరులు ఉన్నారు.

# జోగి బ్రదర్స్‌కు దక్కని ఊరట

**అమరావతి :** నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు ఊరట లభించలేదు. అద్దేపల్లి బ్రదర్స్, జోగి బ్రదర్స్ బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు.. బాదల్ దాస్ (ఎ7), ప్రదీప్ దాస్ ( ఎ8), కళ్యాణ్ ( ఎ12), రవి (ఎ4), శ్రీనివాస్ తిరుమలశెట్టి (ఎ13), శ్రీనివాస్ రెడ్డి (ఎ11), సతీష్ (ఎ17) లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి శ్రీరాములు, అద్దేపల్లి జనార్దన్ రావు (ఎ1)తోపాటు ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావు (ఎ2)తోపాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గురువారం విచారణ జరిపిన కోర్టు ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి.. మిగిలిన ఏడుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టు ఈ నలుగురి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నలుగురికి ఈ రోజుతో రిమాండ్ ముగియనుంది. దాంతో వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు పోలీసులు వీరిని హాజరుపరిచారు. డిసెంబర్ 31వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ.. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. అయితే తమను నెల్లూరు కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు మార్చాలంటూ వీరు కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం విచారిస్తామని ఎక్సైజ్ కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి కోర్టు తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది.

# ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

### ఎకనమిక్ టైమ్స్ అవార్డుపై ఎంపీల హర్షం

### చంద్రబాబును సన్మానించిన టీడీపీ ఎంపీలు

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి అరుదైన గౌరవం దక్కింది. ఎకనామిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ ఎంపీలు ఘనంగా సన్మానించారు. సీఎం చంద్రబాబుకు బొబ్బిలి వీణను విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు బహూకరించారు. సీఎం చంద్రబాబును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శాలువాతో సత్కరించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వ శైలి ఎందరికో స్ఫూర్తినిస్తుందని ఎంపీలు ప్రశంసించారు. రాష్ట్రంలో రాష్ట్రాభివృద్ధితోపాటు పారిశ్రామికవృద్ధికి ఇంకా చాలా చేయాల్సి ఉందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరో వైపు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు జన్మదినం ఈ రోజు కావడంతో సీఎం సన్మాన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉభయ సభల్లోని టీడీపీ ఎంపీలంతా పాల్గొన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం న్యూఢిల్లీ చేరుకున్నారు. అనంతరం ఎంపీలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎంపీలంతా సన్మానించారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో సీఎం సమావేశమయ్యారు. శుక్రవారం సైతం న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజీ బిజీగా గడపనున్నారు. ఏపీకి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్రానికి అవసరమైన కేంద్ర నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అనువ-ంతులతోపాటు ఆమోదం తెలిపే అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రేపటితో అంటే.. డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం



**అమరావతి :** ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, సంస్కరణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నదని లోకేశ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సీఎం చంద్రబాబుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం సంతోషదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను. ఈ పురస్కారం ద్వారా రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ.. 'బిజినెస్ రీ ఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ముఖ్యమంత్రికి అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ అవార్డు తనకు లభించడంపట్ల సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్ల సమష్టి కృషి అని సీఎం చంద్రబాబు అన్నారు.

# జగన్ ఓ విజిటింగ్ పొలిటీషియన్

**అమరావతి :** రాష్ట్రంలో ఒక విజిటింగ్ పొలిటీషియన్ అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ విమర్శించారు. కావాలని బలప్రదర్శనలు చేయడం ఆయనకు రివాజుగా మారిందన్నారు. గవర్నర్‌ని కలిసి కోటి సంతకాల సేకరణ అంటూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్ జగన్‌పై మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. ఈ మేరకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఖరిపై మంత్రి సత్య కుమార్ నిప్పులు చెరిగారు. ఈ రోజు అన్ని పరిధిలు దాటి చింత చచ్చినా పులుపు చావలేదన్న విధంగా ఆయన వ్యవహరించారని విమర్శించారు. మెడికల్ కాలేజిలో ఎవ=ైనా కన్‌స్ట్రక్షన్‌కు తీసుకుంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత జైలుకు పంపుతాననడం అత్యంత హేయమైన వ్యాఖ్యలుగా ఆయన అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలు ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. మీకు ధైర్యం ఉంటే ఈ శాఖను నిర్వహిస్తున్న తనను జైలుకు పంపాలని మాజీ సీఎం జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్ విసిరారు. ఈ విషయంలో ధైర్యం ఉంటే సీబీఐ విచారణ కోరండని సూచించారు. మీకు ధైర్యం ఉంటే తనను న్యాయస్థానాలు ద్వారా జైలుకు పంపాలని మాజీ సీఎం జగన్‌కు స్పష్టం చేశారు. వైద్య కళాశాలల నిర్మాణం కోసం ముందుకు వస్తున్న సంస్థలను బెదిరించడం సరికాదని వైఎస్ జగన్‌కు ఆయన హితవు పలికారు. 30 కేసులకుపైగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి .. ఒక జైలు జీవి ఇలాంటి అసత్య ప్రచారం చేయడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఈ తరహా

ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ఏమైనా లోపభూయిష్ట విధానం ఉంటే దాని గురించి మాట్లాడాలంటూ జగన్‌కు సూచించారు. గతంలో మీరు నడిపిన ఆరోగ్యశ్రీ, క్యాథలాబ్‌లను కూడా పిపిపి అంటారా? అని సందేహం వ్యక్తం చేశారు. ఈ 18 నెలల్లో పేదల వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవల పేరుతో రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. వైఎస్ జగన్ ఈ రకంగా మాట్లాడడం వాస్తవానికి దూరంగా ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ పెద్ద స్కాం చేశారని.. తమ తప్పును కప్పిపుచ్చడానికి ఈ తప్పులు వెతుకుతున్నారన్నారు. 420 పడకల ఆసుపత్రుల నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించారని.. వారు ప్రస్తుతం అవినీతి అని ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రులు మెడికల్ కాలేజిలకు రూ.125 కోట్లు ఖర్చు అవుతుందంటున్నారన్నారు. ఈ రోజు సైతం జగన్ చెప్పిందే చెబుతున్నారని తెలిపారు. స్థాయి సంఘం కూడా ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో పిపిపికి వెళ్లడం తప్పు లేదని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. పిపిపి అనేది ఎన్డీఏ ప్రభుత్వ విధానం..100 మంది జగన్మోహన్ రెడ్డిలు కట్టగట్టుకుని వచ్చినా ఎవర్ని ఏం చేయలేరని స్పష్టం చేశారు. రూ. కోటి 40 లక్షల కుటుంబాలకు రూ. 25 లక్షల వరకూ వైద్యం అందాలని ఎన్డీఏ ప్రయత్నం చేస్తుందని వివరించారు. అందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. జగన్ ఈ పరిస్థితి నుంచి బయటకు రాకుంటే.. వచ్చే ఎన్నికల్లో




జోస్యం చెప్పారు. జగన్ ఏదీ చేయడు తాటాకు చప్పుళ్లు చేస్తాడని వ్యంగ్యంగా అన్నారు. కాలేజిలు నిర్మాణం ఉండకూడదు.. విద్యార్థులకు సీట్లు రాకూడదు... పేదలకు వైద్య అందకూడదనేది వైఎస్ జగన్ నినాదంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. జగన్ మానసిక పరిస్థితి చూస్తే.. ఆత్మనూన్యతా భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారన్నారు. ఇది ఒక రకమైన మానసిక స్థితి అని చెప్పారు. తొందరగా ట్రీట్‌మెంట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. పిపిపి మోడ్‌లో ప్రభుత్వాసుపత్రులు రావడం వల్ల పేద విద్యార్థులకు సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పిపిపి మోడ్‌ను ప్రైవేటైజేషన్ అంటూ ఆయన సేకరిస్తున్నవి కోటి సంతకాలు కావని.. అవి కోడి గీతలంటూ ఎద్దేవా చేశారు. జగన్మోహన రెడ్డి పాలనలో ఐదు సంవత్సరాల్లో ఆయుష్ ప్రతిపాదనలు సైతం కేంద్రానికి పంప లేదని గుర్తు చేశారు. విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాకు రూ. 300 కోట్లు ఖర్చు కాలేదన్నారు. అది కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం అని.. అందుకు నిధులు కేంద్రం నుండి వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# ప్రధాని మోడీకి మరో గౌరవం

## ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం ప్రదానం



**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం. భారత్ – ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్–కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

# 'ఆపరేషన్ సిందూర్' మన సత్తా చాటింది




మొదటి పేజీ తరువాయి

అవతరించిందని ఆయన కొనియాడారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన ఎయిర్ ఫోర్స్ కమాండర్ల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంలో వాయుసేన చూపిన ధైర్యం, వేగం, కచ్చితత్వాన్ని రాజ్ నాథ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. దాడుల అనంతరం పాకిస్థాన్ బాధ్యతారాహిత్యంగా స్పందించిన తీరును కూడా ఐఏఎఫ్ సమర్థవంతంగా ఎదుర్కొందని తెలిపారు. పాక్ దాడులకు ప్రయత్నించినప్పుడు కూడా భారత ప్రజలు ప్రశాంతంగా తమ పనుల్లో నిమగ్నమవడం మన సైనిక సన్నద్ధతపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–హమాస్ వంటి ఇటీవలి అంతర్జాతీయ ఘర్షణలను ప్రస్తావిస్తూ, ఆధునిక యుద్ధాల్లో వాయుసేనదే నిర్ణయాత్మక పాత్ర అని రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. వేగం, కచ్చితత్వంతో ప్రత్యర్థికి స్పష్టమైన వ్యూహాత్మక సందేశం ఇవ్వడానికి వైమానిక శక్తి ఒక కీలక సాధనంగా మారిందని వివరించారు. 21వ శతాబ్దపు యుద్ధాలు సాంకేతికత, ఆలోచనలపై ఆధారపడి ఉంటాయని, సైబర్ వార్‌ఫేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మానవరహిత వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని తెలిపారు. జాతీయ ఆస్తుల పరిరక్షణకు ప్రధాని మోదీ ప్రకటించిన 'సుదర్శన చక్ర' కీలకమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశీయంగా జెట్ ఇంజన్ల అభివృద్ధిని జాతీయ మిషన్‌గా ప్రకటించామని గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్' త్రివిధ దళాల మధ్య సమన్వయానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని రాజ్ నాథ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, వాయుసేన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 171 దేశాల పౌరులకు భారత్ ఈ-వీసా సౌకర్యం

న్యూఢిల్లీ: భారత్‌లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 171 దేశాల పౌరులకు 9 ఉప కేటగిరీల కింద ఈ–వీసా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలోని 31 అంతర్జాతీయ విమానాశ్రయాలు, 6 ప్రధాన ఓడరేవుల ద్వారా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ గురువారం రాజ్యసభకు తెలిపారు. ఒక లిఖితపూర్వక సమాధానంలో ఆయన




మాట్లాడుతూ.. పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "స్వదేశ్ దర్శన్ 2.0" పథకం కింద 53 ప్రాజెక్టుల కోసం రూ. 2,208.27 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, 'ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్' (జదీఱణ) కార్యక్రమం కింద 36 ప్రాజెక్టులకు రూ. 648.11 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ నిధులను కేంద్రం విడుదల చేయగా, సంబంధిత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఏజెన్సీలు ప్రాజెక్టులను అమలు చేస్తాయని తెలిపారు. పర్యాటక ప్రచారం కోసం 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ పోర్టల్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నామని మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్ల కోసం అధిక నాణ్యత గల ఫోటోలు, వీడియోలు, బ్రోచర్లతో 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా కంటెంట్ హబ్'ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు సోషల్ మీడియా, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కూడా భారత పర్యాటకాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో

# 'వీబీ జీ రామ్ జీ'

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం
### లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
### వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
### మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
### గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్



**న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. తొలుత ఉపాధి హామీ పథకానికిఎన్ఆర్‌జిఎ అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ–నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. అనంతరం సభను వాయిదా వేశారు.

# మహాత్ముడిని అవమానించారు

## రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.

## సభలో విపక్షం తీరు దారుణం

### ప్రతులను చించివేయడం సభను అవమానించడమే
### కేంద్రమంత్రులు బఘేల్, చిరాగ్ పాశ్వాన్

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ప్రైవేట్ రంగంలో అణు విద్యుత్

## బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా– శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపగా.. గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదున్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ పీ విల్సన్ విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా.. న్యూక్లియర్ పవర్‌పై అంత ఆసక్తి దేనికని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఇదే భాజపా గతంలో భారత్– అమెరికా అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో అణు ఇంధన రంగం ప్రభుత్వం చేతిలోనే ఉందని, అమెరికాలో మాత్రమే 80 శాతం మేర ప్రైవేటు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. అమెరికా మోడల్ మనలాంటి దేశాలకు ఏమాత్రం సరికాదన్నారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లాఖాన్ డిమాండ్ చేశారు.



సంపాదకీయం

# ఆ పదిమందిని బీఆర్ఎస్ ఆహ్వానించాలి!

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా.. కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.



**కంచర్ల అచ్యుత్ రావు**
ఎడిటర్

# ఈ నెల 21న వజ్రగడలో క్రికెట్ టోర్నమెంట్

## పోస్టర్‌ను ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. దీనిలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించేందుకు యువత నడుం బిగించారు. ఈ మేరకు ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు క్యాంప్ కార్యాలయంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను స్పీకర్ ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 20 వేల రూపాయలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు డిసెంబర్ 21వ తేదీన వజ్రగడ గ్రామంలో ఘనంగా ప్రారంభించేందుకు యువత కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు వజ్రగడ టీడీపీ నాయకులు తమరాన అప్పలనాయుడు స్పాన్సర్ గా వ్యవహరిస్తూ, తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందజేసారు. క్రీడలను ప్రోత్సహించడంలో అప్పలనాయుడు చూపిస్తున్న చొరవను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ లగుడు చంద్రశేఖర్, వజ్రగడ గ్రామ యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించే ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.




# ఈజిప్ట్‌కు 'మేడ్ ఇన్ శ్రీసిటీ' మహా ట్యాంక్

## క్రయోజెనిక్ రంగంలో మరో ఘన విజయగాథ



**శ్రీసిటీ:** క్రయోజెనిక్ ట్యాంకుల తయారీలో అగ్రగామిగా నిలిచిన యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించింది. అత్యాధునిక క్రయోజెనిక్ సాంకేతికతతో తయారైన భారీ లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఈజిప్ట్‌లోని ప్రముఖ సంస్థ ఎయిర్ లిక్విడ్‌కు విజయవంతంగా ఎగుమతి చేసింది. 531 కిలోలీటర్ల సామర్థ్యం, 168 టన్నుల బరువు, సుమారు 39 మీటర్ల పొడవు, 5.45 మీటర్ల వ్యాసం కలిగిన ఈ మహా ట్యాంక్ క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో అత్యున్నత ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ భారీ నిర్మాణాన్ని శ్రీసిటీ నుంచి చెన్నై పోర్ట్‌కు తరలించేందుకు ప్రత్యేక మల్టీ-యాక్సిల్ లాజిస్టిక్స్ వినియోగించడం విశేషం. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఈ ఎగుమతి 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి గొప్ప విజయమని అన్నారు. ప్రపంచ స్థాయి క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో వీఆర్వీ సామర్థ్యాన్ని ఇది మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. శ్రీసిటీలో మొట్టమొదటి సంస్థగా అడుగుపెట్టిన వీఆర్వీ, నేడు ఏరోస్పేస్, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాలకు సేవలందించే గ్లోబల్ కంపెనీగా ఎదిగిందన్నారు. ఇస్రోతో భాగస్వామ్యం, కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలను కాపాడిన ఆక్సిజన్ మౌలిక వసతుల సరఫరా వంటి ఘన చరిత్ర కలిగిన వీఆర్వీ, తాజా ఎగుమతితో క్రయోజెనిక్ టెక్నాలజీలో భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది.

# కాపులూరు జడ్పీ హైస్కూల్‌కు కొత్త ఊపిరి

## మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ



**నాయుడుపేట:** కాపులూరు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. గురువారం ఆమె పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చలం బాబు, ఉపాధ్యాయులు రుద్రకుమార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షానికే రెండడుగుల లోతు వరకు నీరు నిలిచిపోతుందని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణం అత్యవసరమని కోరారు. ఈ అంశాలపై స్పందించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కాపులూరు జడ్పీ హైస్కూల్‌లో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆమె తెలిపారు.

# మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించండి

## ఆకుల శ్రీనివాస్ వినతి



**విజయవాడ:** విజయవాడ నగర ప్రజల, ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ నగరంలో రద్దీని తగ్గించేందుకు వీలుగా మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఏడు కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ ఫ్లైఓవర్ ను నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గట్కరికి సీనియర్ రాజకీయ నాయకుడు, సోషల్ వర్కర్ ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక వినతి పత్రం సమర్పించారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్లో కేంద్రమంత్రిని కలిసిన ఆకుల శ్రీనివాస్ ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. గతంలో సుమారు 700 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఎలివేటెడ్ ఫ్లైఓవర్ ను నిర్మించేందుకు ఎన్హెచ్ఏఐ నిర్ణయించడం జరిగిందన్నారు. అయితే విజయవాడ పశ్చిమ బైపాస్, ఓఆర్ఆర్ నిర్మాణ ప్రతిపాదనల వలన ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఎన్హెచ్ఏఐ నిర్ణయించడం విజయవాడ నగర ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించిందని మంత్రికి తెలిపారు. విజయవాడ నగరంలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య బాగా పెరిగిందని, ఈ ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణం వలన తమ ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. చెన్నై - కోల్ కతా నేషనల్ హైవే (ఎన్.హెచ్ 65)పై ఉదయం, సాయంత్రం వేళల్లో మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుందని ,రద్దీ కారణంగా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతున్నాయని కేంద్రమంత్రికి ఆకుల శ్రీనివాస్ వివరించారు. ముఖ్యంగా మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగ్, ఎనికెపాడు, నిడమానూరు కూడలి ప్రాంతాల్లో రద్దీ విపరీతంగా ఉంటుందని, ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి లభించాలంటే మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణం ఒక్కటే ఏకైక మార్గమని మంత్రికి తెలియచేశారు. విజయవాడ నగరంలో ఉన్న ట్రాఫిక్ రద్దీని, ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో వెంటనే ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. గతంలో హైదరాబాదులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మెహదీపట్నం నుంచి శంషాబాద్ లోని విమానాశ్రయం వరకు సుమారు 11. 6 కిలోమీటర్లు పొడవైన పివి నరసింహారావు ఎక్స్ ప్రెస్ రహదారిని 2009లోనే ప్రారంభించడం జరిగిందని, తద్వారా అత్యంత వేగవంతమైన ప్రయాణానికి మార్గం మార్కం ఏర్పడిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వివరించారు. ఇదే రీతిలో విజయవాడ నగరంలోనూ మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించడం వలన ప్రజలకు, విజయవాడ నగరానికి ఎంతో మేలు కలుగుతుందని ఆకుల శ్రీనివాస్ తెలిపారు. కాగా తమ వినతిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందిస్తూ విజయవాడకు మెట్రో రైలు ప్రాజెక్టు ఉన్నందున ఎలివేటెడ్ కారిడార్, మెట్రో రైల్ ప్రాజెక్టు కలిపి ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే ఆలోచన ఉందని మంత్రి తమకు తెలియజేసినట్లు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అలాగే విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్నిని సైతం పార్లమెంట్ భవన్లో కలిసి ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణ విషయంపై ఆయనకు కూడా ఒక వినతిపత్రం అందజేసినట్లు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. దీనిపై ఎంపీ కేశినేని చిన్ని సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.



### బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు సాధించిన

# సీఎం చంద్రబాబుకి అభినందనలు

### - టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

**మునగపాక, డిసెంబర్ 18, మనసులో మాట..** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్" అనే ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించడం యావత్ తెలుగుజాతికి గర్వకారణమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. పారిశ్రామిక రంగ సంస్కరణలు, పెట్టుబడుల ఆకర్షణలో సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ నాయకత్వానికి ఈ అవార్డు నిదర్శనమని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు, న్యాయవేత్తలతో కూడిన అత్యున్నతస్థాయి జ్యూరీ సీఎం చంద్రబాబు ని ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఆయన పాలనపై దేశవ్యాప్తంగా ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా, దేశంలోనే ఉత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా సీఎం చంద్రబాబు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన రాష్ట్రాన్ని వేగవంతమైన అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయని కర్రి సాయికృష్ణ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతోనే దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంస్కరణలు, అవిశ్రాంత కృషి వల్లే ఈ ఘనత దక్కిందని పేర్కొంటూ, ఈ అవార్డు ఆయన దూరదృష్టి గల నాయకత్వానికి దక్కిన సముచిత గౌరవమని కర్రి సాయికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు

# అభినందనలు



**నర్సీపట్నం ,డిసెంబర్ 18 (మనసులో మాట)..** ప్రముఖ వార్తా సంస్థ 'ఎకనామిక్ టైమ్స్' నుంచి 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ముఖ్యమంత్రి దక్షతకు ఈ అవార్డు నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ముఖ్యమంత్రి గారి పరిపాలనా దక్షతను గుర్తించి ఎకనామిక్ టైమ్స్ ఈ అవార్డును ప్రకటించడం రాష్ట్రానికే గర్వకారణమని, ఆయన దార్శనికతకు, ఆర్థిక సంస్కరణల పట్ల ఆయనకున్న నిబద్ధతకు దక్కిన సరైన గౌరవం ఇదని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతూ, మరిన్ని విజయ శిఖరాలను అధిరోహించాలని స్పీకర్ ఆకాంక్షించారు. తన తరపున, శాసనసభ తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు అయ్యన్నపాత్రుడు వివరించారు.



### సింహాచలం అప్పన్న దర్శించుకున్న

# బీల స్రవంతి

### పూజల్లో పాల్గొన్న శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ స్రవంతి

**మునగపాక, డిసెంబర్ 18, మనసులో మాట..** సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానశ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న శ్రీ కాళహస్తి దేవస్థానం బీలా స్రవంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు బీలా స్రవంతికి ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్రవంతి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# చీడికాడ హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శన



చీడికాడ, డిసెంబర్ 18, (మనసులో మాట) చీడికాడ :గవర్నమెంట్ హై స్కూల్ వైజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించారు మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాల చెందిన 65 విద్యార్థులు పాల్గొన్నారు ప్రాజెక్టులకు సంబంధించి తొమ్మిది విభాగాల్లో నమోనాలను ప్రదర్శించారు గ్రీన్ ఎనర్జీ వాటర్ మేనేజ్మెంట్ వేస్ట్ మేనేజ్మెంట్ సస్టైనబుల్ అగ్రికల్చర్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ హెల్త్ అండ్ హైజానిక్ రిక్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్ మాస్ మోడల్స్ గ్రీన్ టౌనరీ సైక్లింగ్ ప్రాసెస్ .. ఈ ప్రదర్శనను మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు చీడికాడ మండల సబ్ ఇన్స్పెక్టర్ శఆర్. సతీష్ ఈ యొక్క ప్రదర్శన ప్రారంభించారులి థీమ్: గ్రీన్ ఎనర్జీ , ప్రాజెక్ట్ : కోణం పాఠశాల విద్యార్థులు రూపొందించిన నమో నాలో ప్రథమ స్థానం నిలిచారు. ఈ యొక్క కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ చుక్కపల్లి ప్రధాన ఉపాధ్యాయులు బి వెంకట రమణ గారు గోవింద సోమేష్ మోదీనాయుడు ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు

### గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని

# నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

### - క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ను ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్న




**నర్సీపట్నం ,డిసెంబర్ 18 (మనసులో మాట)..** సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామంలో ఈ నెల 21న నిర్వహించ తలపెట్టిన క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో గెలిచిన విజేతలకు భారీ బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్కు వజ్రగడ టీడీపీ నాయకులు తమరాన అప్పలనాయుడు స్పాన్సర్గా వ్యవహరిస్తూ తమ వంతు సహకారాన్ని అందించారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఆయన చూపుతున్న చొరవను స్పీకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ లగుడు చంద్రశేఖర్, వజ్రగడ గ్రామ యువత, క్రీడాకారులు పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించే ఈ టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### స్కిల్ సమగ్ర -2 పథకంపై పట్టు రైతులకు అవగాహన, ఈ పథకం క్రింద

# 12 మందికి రేజింగ్ పనిముట్లు పంపిణి

### జిల్లాలో 400 మంది పట్టు పరిశ్రమ రైతులకు లబ్ది - ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్



**పాడేరు డిసెంబర్ 18, ( మనసులో మాట ):** అల్లూరు జిల్లా పట్టు పరిశ్రమ ప్రధాన కార్యాలయంలో స్కిల్ సమగ్ర-2 పథకంపై పట్టు రైతులకు అవగాహన సదస్సులో పాల్గొన్న ఇంచార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిని తిరుమణి శ్రీపూజా. గురువారం ఉదయం జిల్లా పట్టు పరిశ్రమ కార్యాలయంలో జరిగిన పట్టు పరిశ్రమ రైతుల అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 1954 పాడేరు డివిజన్ లో చింతపల్లి, అరకు పాడేరు లో మొదటి గా పట్టు పరిశ్రమను విరివిగా చేపట్టి రాష్ట్రంలోనే పట్టు ఉత్పత్తిని ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో అధిక పట్టుగుళ్లను సరఫరా చేసామన్నారు. 2014 సంవత్సరం నుండి ఇంతవరకు రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపకుండా పట్టు పరిశ్రమ పంట లో నిమగ్నమై పట్టుగుళ్ల దారం ఉత్పత్తి చేస్తున్నారన్నారు. పట్టు పరిశ్రమ శాఖలో పదవి విరమణ ద్వారా ఉద్యోగుల సంఖ్య తగ్గడం వల్ల పట్టు పరిశ్రమ రైతులకు పట్టుపురుగుల ఉత్పత్తి తగ్గిందని గత మూడు సంవత్సరాల నుండి పట్టు రైతులకు అవగాహన కల్పిస్తూ పట్టు ఉత్పత్తిలో 400 మంది రైతు లతో సుమారుగా 800 ఎకరాలలో పట్టుపురుగుల మలబార్ సాగు చేస్తున్నమన్నారు. సంవత్సరంలో పది పంటలు తీసుకొని ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా చూస్తున్నమన్నారు. ప్రస్తుత పట్టు రైతుల ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పించి పట్టు పరిశ్రమ ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. మల్బరీ ఉత్పత్తి చేసే రైతులకు ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉత్పత్తిలో 90 శాతం రాయితీలు కల్పిస్తూ, ఇతర కులాల రైతులకు రైతులకు 75 శాతం ఇస్తున్నామన్నారు. స్కిల్ సమగ్ర-2 ద్వారా యాంత్రికరణ పథకం క్రింద 5 యూనిట్లను, రోగ నిరోధక మందులను 156 యూనిట్లను, రేసింగ్ పరికరాలు 12 మందికి ఈరోజు పంపిణి చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి కె. అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నందు, రైతులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్లో కొనసాగించడం

# ఎమ్మెల్యే సుందరపు కృషి ఫలించింది

### - మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలిపరుశురాం



**మునగపాక, డిసెంబర్ 18, మనసులో మాట..**ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్చుతాపురం, మునగపాక మండలాలను అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో కొనసాగించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన ఎలమంచిలి శాసనసభ్యులు సుందర్ విజయ్ కుమార్ కృషి ఫలించిందని మునగపాక మండల ప్రజల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మని పరశురాం తెలిపారు. జిల్లాలో ఉన్న కూటమి ఎమ్మెల్యేలు అందరూ సంతకాలు తీసుకొని ఇన్చాజీ మంత్రి కొల్లు రవీంద్ర కు మునగపాక మండలం నక్కపల్లి రెవిన్యూ డివిజన్ లో కలిపితే కలిగే దుష్ప్రయోజనాలను క్షుణంగా వివరించి అనకాపల్లిలో జరిగిన డిడిఆర్సి సమావేశంలో తీర్మానించడం ఎంతో అభినందనీయమని అన్నారు. అయితే మూడు మండలాలను నక్కపల్లి రెవిన్యూ డివిజన్లో విలీనం చేయడానికి అభ్యంతరాలు ఉంటే తెలపమని ప్రభుత్వం స్పష్టంగా తెలిపినప్పటికీ మునగపాక మండల వైఎస్సార్ సీపీ నేతలు రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, తన ఉనికిని చాటుకునేందుకే నిరాహార దీక్షల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించారని పరశురాం ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గం టిడిపి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల చంద్రమోహన్, ఎలమంచిలి రూరల్ పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జి, రాంబిల్లి మండల పార్టీ ప్రెసిడెంట్ దొర, అచ్యుతాపురం మండల పార్టీ అధ్యక్షులు రాందాస్, మహిళ నాయకురాలు ఝాన్సీ, ఆడారి గణేష్ పలువురు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో వరి కుప్ప దగ్ధం

### - ఇద్దరు రైతులకు తీవ్ర నష్టం



**హుకుంపేట డిసెంబర్ 18 (మనసులు మాట)..** హుకుంపేట మండలంలోని మెరికేసింత పంచాయతీ డి. దసరాపల్లి గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన రెండు వరి కుప్ప పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన దూసరి నాగేశ్వరరావు, దూసరి సుబ్బారావు ఈ సంవత్సరం కష్టపడి పండించిన వరి పంటను కోతలు కోసి కుప్పలుగా వేసి ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు లేదా కారణాల వల్ల ఆకస్మికంగా మంటలు చెలరేగి కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, తగిన నీటి సదుపాయం లేకపోవడంతో మంటలు అదుపులోకి రాలేదు. ఎంత ప్రయత్నించినా వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. సంవత్సరం పొడవునా శ్రమించి చేతికొచ్చిన పంట కళ్లముందే నశించడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఈ ఘటనతో తమ జీవనాధారం దెబ్బతిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



### 20న తాళ్ళపాలెం

# స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర

### కార్యక్రమంలో పాల్గొనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

### అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఏర్పాట్లు పరిశీలన

**అనకాపల్లి, డిసెంబర్ 18 (మనసులో మాట):** అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో ఈనెల 20 న నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటున్న సందర్భంలో పరిసరాలను గురువారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు. అలాగే సభా ప్రాంగణం తదితర ఏర్పాట్లు కూడా పరిశీలించడం జరిగింది. అనంతరం అధికారులతో సమీక్ష జరిపి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు రఘు, కశింకోట మండల టిడిపి అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావు, డి.ఎస్.పి శ్రావణి, ఆర్డీఓ ఆయేషా, ఎమ్మార్వోలు, సిఐలు, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**చీడికాడ, డిసెంబర్ 18 (మనసులో మాట)** బాల్య వివాహలు చట్టరీత్యా నేరమని మాడుగుల ఐ సి డి ఎస్ పి ఓ ఎర్రయ్యమ్మ అన్నారు మండలంలో అప్పలరాజు పురం హైస్కూల్లో బాల్య వివాహాలు పై విద్యార్థినులకు అవగాహన సదస్సు గురువారం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండకుండ ఆడపిల్లలకు పెళ్లిలు చేస్తే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి యుక్త వయసు వచ్చిన తర్వాత పెళ్లిళ్లు చేయాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ చిన్నమ్మలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీషు అంగన్వాడి వర్కర్లు బండారు ముత్యంమ్మ శ్యామల గౌరి సచివాలయం మహిళా పోలీసు పి నిర్మల పాల్గొన్నారు

### చిల్డ్రన్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన

### పది రోజుల పాటు జిల్లా అంతటా

# బాలల చలన చిత్ర పదర్శన




**అనకాపల్లి, డిసెంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి జిల్లా లో చిల్డ్రన్స్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలలకు బాలల చలన చిత్ర పదర్శన జరుగుతుంది. జిల్లా అంతటా పది రోజులపాటు విద్యార్థులకు విద్య, మానసిక, సైన్స్ అవగాహన పై జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా విద్య శాఖధికారివారి ఉత్తర్వులతో లీటిల్ స్టార్స్ అను సినిమా అనకాపల్లి జిల్లా థియేటర్లలో సబ్సిడీ రేట్స్ పై గురువారం ప్రదర్శించారు. ఈ సినిమా సారాంశం విద్య,మానసిక,సైన్స్ అవగాహనా పై చైతన్యం పెంపొందించటమే లక్ష్యంగా స్కూల్స్ విద్యార్థులకు సినిమా ప్రదర్శన ఉంటుంది. ఈ కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించిన ఎమ్మార్వో మరియు మండలవిద్యాశాఖ వారికి అన్ని దియేటర్స్ యాజమాన్యం వారికీ పాఠశాల యమన్యాల వారికి చిల్డ్రన్స్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాక ఈ సినిమాల వచ్చే డబ్బును అమరావతి రాజధానికి సీఎం రిలీఫ్ ఫండ్ కి, అనాధ పిల్లలకి ఆహారం,బట్టలు పర్యావరణ పరిరక్షణ కొరకు మట్టివిగ్రహాలు మొక్కలు వితరణ పలు సేవ స్వచ్ఛంద కార్యక్రమంలు చేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో చిల్డ్రన్స్ ఫిలిం అసోసియేషన్ చైర్మన్ యు.వి.సంతోష్, జిల్లాఆర్గనైజర్స్ కె. కన్నబాబు, సినిమా థియేటర్ యాజమాన్యం మళ్ళ వెంకట్రావు, డి.వి.వి గోపాల్ రాజు, తాంటికొండ సన్యాసిరావు శెట్టి, తాకాసి నగేష్, చలమల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



### జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

## విద్యార్థుల విజయ పరంపర

**రోలుగుంట మనసులో మాట డిసెంబర్ - 18..** అనకాపల్లి జిల్లా రోలుగుంటలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిబి పట్టణం విద్యార్థులు ప్రశంసనీయమైన ప్రతిభ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సాడి ఝాన్సీ, కసిరెడ్డి మౌనిక అనే విద్యార్థినులు "చెడు కొలెస్ట్రాల్ వి ఎస్ మంచి కొలెస్ట్రాల్" అనే ప్రాజెక్ట్ గ్రూప్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సమీక్షకులు వారి ప్రాజెక్టు ప్రశంసించి, జిల్లా వారిని స్థాయి సైన్స్ ఫెయిర్కు ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థినుల ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి. చంద్రశేఖరరావు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైన్స్ విభాగ ఉపాధ్యాయులు సి.హెచ్.వి. ప్రభాకర్ మరియు జె. సుగుణ లు విద్యార్థినులను ప్రోత్సహించి, మార్గదర్శకత్వం వహించినందుకు ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ విజయం బిబి పట్టణం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. రాబోయే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్లో మరింత ఘనవిజయం సాధించాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభిలషిస్తున్నారు.

### ఈ రహదారుల్లో ప్రయాణం

## జరభద్రం బ్రదర్



**మునగపాక, డిసెంబర్ 18,మనసులో మాట..** మండలంలోని పలు గ్రామాలు రహదారులు పూర్తిగా మలుపులతో నిర్మాణం చేపట్టడం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండకర్ల జంక్షన్ నుండి ఉప్పవరం, మల్లవరం, జగన్నాధపురం, చూచుకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి 28 మలుపులతో నిర్మాణం జరిగింది. ఈ రహదారుల ద్వారా ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోతే ప్రమాదపు తంచునపడినట్లే, అలాగే మునగపాక నుండి మూలపేట అనకాపల్లికి వెళ్లే రహదారి మలుపులతో నిండి ఉంటుంది. ఈ రహదారిలో ప్రయాణం చేసిన ప్రయాణికులు, వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో పలు ప్రమాదాలు జరిగాయి. అలాగే తిమ్మరాజుపేట నుండి పెదపాడు, కాశీ పాలెం, పురుషోత్తపురం, పల్లపు ఆనందపురం, కుమారపురం, సూచుకొండ గ్రామాలకు వెళ్లే రహదారి అనేక మలుపులతో నిర్మాణం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు వేపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం చేసే వాహనదారులు ఆదమరచివెళ్లకుండా ప్రయాణంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### నర్సింగబిల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి సంకీర్థ్ కు సైన్స్ ఫెయిర్ లో ప్రధమ స్థానం



**కశింకోట, డిసెంబర్ 18 (మనసులో మాట):** కశింకోట గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ లో నర్సింగబిల్లి జెడ్పి హైస్కూల్ విద్యార్థి సంకీర్త్ ప్రధమ స్థాయి లో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సమీకృత వ్యవసాయం- సుస్థిర వ్యవసాయం , చిరుధాన్యాలు- ఆరోగ్యం అనే రెండు ప్రాజెక్ట్ లు జిల్లా స్థాయి కి ఎంపికయ్యాయి. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు పి. సంకీర్త్, టి. హర్ష, ఓ. నికిల్, ఎ. డి. డి తేజ ఎంపికవడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంఇఓ పి. వి. సురేష్, హైస్కూల్ హెచ్. ఎం కె. రవికుమార్, గైడ్ టీచర్ బి. వి లక్ష్మి పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ

# ఎస్ఎఫ్ఐ నిరసన



**ఎస్. రాయవరం, డిశంబర్ 18, (మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డు జంక్షన్లో మెడికల్ కాలేజీలు ప్రవేటీకరణను వ్య తిరేకిస్తూఎస్ ఎఫ్ ఐ అధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత హైవే జంక్షన్ వద్ద మానవహారం గా ఏర్పడి ప్రవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.అనంతరం ఎస్. రాయవరం తహశీల్దారు కార్యలయంలో ఆర్ఐ కి వినతి పత్రం అందచేసారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందని అన్నారు. పేద విద్యార్థులు కు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయకుండా, ప్రభుత్వ రంగంలోనే నడపాలని ఎస్ఎఫ్ఐ నేత డిమాండ్ చేసారు. విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఏడు వేల కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కి సొంతభవనం కేటాయించాలని,రాష్ట్ర హెూం శాఖ మంత్రిసొంత నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కి సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. డిగ్రీ కాళాశాల ప్రారంభించి నాలుగుసంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు సొంత భవనం కేటాయించడంపై ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారినటువంటి జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న, తాతాజీ, మహేష్, లక్ష్మణ్, దివ్య,పుష్ప, భవాని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అటల్ బిమోదీలది సుపరిపాలన యాత్ర

### - మండల బిజెపి అధ్యక్షుడు మల్ల కాళేశ్వరరావు



**మునగపాక, డిసెంబర్ 18, మనసులో మాట..** మునగపాక మండలం నాగులపల్లి గ్రామంలో బిజెపి మండల సమావేశం జరిగినది. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కాలేశ్వ రావుమాట్లాడుతూ ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు అటల్ మోదీ సుపరి పాలన శత జయంతి యాత్రలో భాగంగా ఈనెల 20వ తేదీన శనివారం, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ కార్యాలయం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు అనకాపల్లి మెయిన్ రోడ్డు గుండా ఫ్లేఓవర్ సర్కిల్ వైజాగ్ రోడ్ అనకాపల్లి వరకు జరుగును. తదనంతరం మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కలిసి కీర్తిశేషులు వాజ్పేయి కాంస్య విగ్రహం ఆవిష్కరణ మరియు బహిరంగ సభ ఏర్పాటు చేయడమైనది. పై కార్యక్రమాన్ని కూటమి సభ్యులతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ భాస్కరరావు, మండల మాజీ అధ్యక్షులు ఎల్లపు రాజేశ్వరరావు, సూరిశెట్టి రామకృష్ణ (సూపర్ సర్పంచ్), మొల్లేటి జగదీశ్వరరావు, కాంద్రేగుల గణేష్, సూరిశెట్టి శ్రీను, మల్ల సత్యనారాయణ, ఎల్లపు శ్రీనివాసరావు, మద్దాల వెంకట్ నర్సింగ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్సీపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### భారీ సంఖ్యలో పాల్గొన్న కళాశాలల విద్యార్థిని విద్యార్థులు



**నర్సీపట్నం రూరల్, డిసెంబర్ 18, (మనసులో మాట) :** నర్సీపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా గురువారం స్థానిక ఉజ్వల మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి వివిధ కళాశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చారు. కార్యక్రమాన్ని లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి రాఘవేంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే సతీష్ మాట్లాడుతూ, సుమారు 15 సంవత్సరాల నుండి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రక్తదాతలను యువత ఆదర్శంగా తీసుకుని రక్తదానానికి ముందుకు వచ్చినట్లయితే వారి ఆరోగ్యంతో పాటు, మరో 10 మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, రక్తహీనత, వివిధ శస్త్ర చికిత్సలు బాధితులకు రక్తం ఎంతో అవసరమని, రక్తదానంపై యువతలో మరింత అవగాహన కలిగించేలా మీడియా సహకరించాలని కోరారు. ఈ శిబిరంలో శ్రీవిద్య, శ్రీ సాయి, ఏబీఎన్, ఎమ్మెల్యేస్, కళాశాలల విద్యార్థులు, వాకర్స్ క్లబ్ మెంబర్లు, యోగ సెంటర్ సభ్యులు సుమారు 70 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం లయన్స్ క్లబ్ కార్యదర్శి సిహెచ్ టి రామారావు, కోశాధికారి బి సీతారామ శర్మ, ఉజ్వల దంత వైద్యశాల వైద్యుడు కోసూరి రవికుమార్, ప్రముఖ పాత్రికేయులు యలమంచిలి వేణు, కోసూరి రామకృష్ణ, లయన్స్ సభ్యులు బాబురావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్లాడ గ్రామంలో పేసా చట్టంపై అవగాహనా సభ



**హుకుంపేట డిసెంబర్ 18 (మనసులో మాట)..** హుకుంపేట మండలంలోని శోభకోట పంచాయతీ ఆర్లాడ గ్రామంలో పేసా చట్టంపై అవగాహనా సభ నిర్వహించారు. ఈ సభకు పేసా అధ్యక్షులు, శోభకోట పంచాయతీ సర్పంచ్ శశిభూషణ్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరై పేసా చట్టం అమలు విధానం, గ్రామసభల పాత్ర, గిరిజనుల హక్కులు, సహజ వనరులపై గ్రామసభ అధికారాలు తదితర అంశాలపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పేసా చట్టం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వివరించారు.సభలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పేసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో గ్రామసభలు చురుకుగా పనిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

# పసుపు కిలోకు రూ.200 గిట్టుబాటు ధర కల్పించాలి



**హుకుంపేట డిసెంబర్ 18 (మనసులో మాట)** హుకుంపేట మండలంలో పసుపు రైతులకు కిలోకు రూ.200 గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ఉచితంగా పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు పంపిణీ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపర్చే చర్యలను తీవ్రంగా ఖండించారు.

జీకే మండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో ఆదివాసీలు పండిస్తున్న పసుపు పంటలను ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, హుకుంపేట మండల ఆదివాసీ సంఘం కార్యదర్శి టి. కృష్ణారావు కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో సురేంద్ర మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో పండుతున్న ఏజెన్సీ బంగారం పసుపును కిలోకు రూ.200కి కొనుగోలు చేసినప్పుడే రైతులకు గిట్టుబాటు లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పసుపు బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా పసుపును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పసుపు రైతులకు ప్రాసెసింగ్ యూనిట్లు పంపిణీ చేయాలని, తద్వారా విలువ ఆధారిత ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి దానిని పథకంగా మార్చే ప్రయత్నాలను ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉపాధి హామీ చట్టాన్ని సవరించి, ఒక పథకంగా మార్చడం సరికాదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర వాటాను తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం ద్వారా పథకాన్ని నిర్వీర్యం చేయాలన్న ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టం తొలగితే ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి లేక వలసలు పెరుగుతాయని, దాని వల్ల గంజాయి తదితర మాదక ద్రవ్యాల వ్యాప్తి ప్రమాదం కూడా పెరుగుతుందని హెచ్చరించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు సంబంధించిన జీఓ నంబర్-3 తదితర హక్కులు తొలగిం చడం వల్ల ఆదివాసీ ప్రజలు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావుతో పాటు పసుపు రైతులు పాల్గొన్నారు.



## సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న గెడ్డం బుజ్జి

**పాయకరావుపేట డిసెంబర్ 18 మనసులో మాట..** జనసేన పార్టీ సీనియర్ నాయకులు, పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి జన్మదినం సందర్భంగా సింహాచలం వరాహ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.జన సైనికులు,గెడ్డం బుజ్జి అభిమానులు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## క్రిస్మస్ వేడుకలకు చిన్నారులు గీతలు



**హుకుంపేట డిసెంబర్ 18 (మనసులు మాట)..** మండలంలోని పట్టాం పంచాయతీ కుమ్మరి పుట్టు గ్రామంలో గురువారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక పాస్టర్ కె. యోహాను ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా ముందుగా కేక్ కటింగ్ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రత్యేక క్రిస్మస్ గీతాలు ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ ద్వారా వాటి ఒక ప్రత్యేకతను వివరించారు. అనంతరం ముఖ అతిథిగా పాల్గొన్న పాస్టర్ జాబాబు వాక్యసందేశం అందిస్తూ, క్రిస్మస్ ప్రేమ, శాంతి, దయలకు ప్రతీక అని తెలిపారు. లోక రక్షణకై యేసుక్రీస్తు జన్మించిన ఈ పవిత్ర దినం ప్రతి ఒక్కరి హృదయంలో నూతన ఆశను నింపుతుందని, ఆయన చూపిన ప్రేమ, క్షమ, సేవలను జీవితంలో ఆచరించాలని బోధించారు. అనంతరం హుకుంపేట మండల ఫెలోషిప్ అధ్యక్షులు కే. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, అందరితో ఐక్యతగా జీవించడం ద్వారా నిజమైన క్రిస్మస్ ఆత్మను ప్రతిబింబించవచ్చని అన్నారు. ఈ క్రిస్మస్ ప్రతి కుటుంబానికి ఆనందం, సమాధానం, దేవుని ఆశీర్వాదాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజారావు, పి. సమూయేలు, ఎస్. జాన్ వింకిల్, బి. సమూయేలు, మల్లన్న, డేవిడ్ ప్రసాద్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

### సెయింట్ జోసెఫ్ కళాశాలలో

## సైబర్ నేరాలపై అవగాహన

### - సైబర్ క్రైమ్ సీఐ వెంకటరమణ అరకులోయ సీఐ ఎల్ హిమగిరి



**అరకులోయ డిసెంబర్ 18 (మనసులో మాట ):** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైమ్ సీఐ వెంకటరమణ, అరకులోయ సీఐ ఎల్ హిమగిరి ఎండపల్లి వలస సెయింట్ జోసెఫ్స్ కళాశాల లో సైబర్ నేరాల పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాసిఐలు మాట్లాడుతూ సైబర్ నేరాలకు దూరంగా ఉండి సైబర్ నేరాల గురించి జరుగుతున్న మోసాల గురించి మీ తల్లిదండ్రులకు మరియు గ్రామస్తులకుతెలియజేయాలనివా రు సూచించారు.అలాగే సైబర్ నెరగాళ్లు మీ ఐడి పాస్వర్డ్ ఎలా హ్యాంగ్ చేస్తారో తెలుసుకోవాలని కమిషన్ ఎరాచూపికేసుల్లో ఇరికిస్తారని అలర్ట్ ఏ ఐ తో నయా మోసం వీటిని నమ్మి మోసపోవద్దు సైబర్ క్రైమ్ నేరాల నుండి అప్రమత్తంగా ఉండలన్నారు.ఆన్లైన్ ట్రేడింగ్ గురించి నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు గురించి టెలిగ్రామ్ వాట్సాప్ లో టాస్క్ పేరుతో జరిగే ఇన్వెస్టమెంట్ మోసాలతో జాగ్రత్త మరియు ఇంస్టాగ్రామ్ లో ఫాల్ యూట్యూబ్లో లైకులు కొడితే డబ్బులు ఇస్తాం అంటూ సైబర్ నేరగాళ్లు ఆశ చూపించి మోసాలు చేస్తున్నారని ఆ ఉచ్చులో పడవద్దు అని సిఐలు వెంకటరమణ, హిమగిరిలు సూచించారు. అంతేకాకుండా అధిక మొత్తంతో డబ్బులు పెట్టక మోసగాళ్లు మిమ్మల్ని బ్లాక్ చేస్తారని అధిక లాభాలు అంటే ఆశపడి పెట్టుబడులు పెట్టి మోసపోకండన్నారు.ఎవరైనా సైబర్ మోసలకు మోసపోయిన వెంటనే సైబర్ ఫిర్యాదుల కోసం కాల్ నంబర్ 1930 కు సమాచారం ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ బిందు కరస్పాండెంట్ సిస్టర్ రూబీ సిబ్బంది శ్రీను వెంకట్రావు కృష్ణారావు మరియు లవకుశ అలాగే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న

## కూటమి నాయకులు




**పాయకరావుపేట డిసెంబర్ 18 మనసులో మాట..** పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులను నాయకులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,జిల్లా గ్రంధాలయ సంస్థ మాజి చైర్మన్,జనసేన నాయకులు తోట నగేష్,టిడిపి పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాల బాబు,రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి, బొంది కాశీ విశ్వనాథ్,వేములపూడి అప్పారావు, ఉపాధ్యాయులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# గణపర్తి లో మేలుకొలుపులు సీతారామాంజనేయ విగ్రహాల ఊరేగింపు

**మునగపాక, డిసెంబర్ 18, మనసులో మాట..** మండలంలోని గణపర్తి గ్రామంలో మేలుకొలుపులు కార్యక్రమం ధనుర్మాసం మొదలు ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. వేకు జామునే లేచి స్నానాలు ఆచరించి భక్తులంతా సీతారాముల విగ్రహాలను రామాలయం నుండి గ్రామంలోని ప్రధాన వీధుల్లో భక్తులంతా ప్రతి దేవాలయం దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెల్లవారు 4 గంటలకే భక్తులంతా ఈ ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొంటున్నారు. ఎక్స్ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతి దేవాలయములోనూ దేవుళ్ళను మేలుకొలుపుతున్నారు. సీతారాములకు హారతులు ఇచ్చి అనంతరం వారు తయారు చేసిన ప్రసాదాలను భక్తులంతా స్వీకరించి ప్రసాద్ అన్ని స్వీకరిస్తారు. జనవరి 14వ తేదీ వరకు అనునిత్యం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెంకటరమణ తెలిపారు.

# ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా యుటిఎఫ్ ఆందోళన




**అనకాపల్లి, డిసెంబర్ 18 (మనసులో మాట):** అనకాపల్లి డిఇఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ అధ్వర్యంలో గురువారం ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ 2011 వ సంవత్సరానికి ముందు నియామకమైన టీచర్లను టెట్ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ను అమలు చేసి, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఐచ్చిక సెలవులను పాఠశాలలకు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వంలో అవి వ్యక్తులకు మార్చడం సరికాదన్నారు. పదవ తరగతి యాక్షన్ ప్లాన్ పేరుతో సెలవు దినాల్లో పనిచేయాలి అనే నిబంధనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతిరోజు పదవ తరగతి విద్యార్థులకు స్లిప్ టెస్ట్ పెట్టి, ఆ మార్కులను, ప్రతిరోజు ఆన్లైన్లో అప్లోడ్ చేయమనడం దారుణమన్నారు. జడ్పీ పిఎఫ్ కు సంబంధించి ఆన్లైన్ స్లిప్స్, ఆన్లైన్లో చూపించలేదని వాపోయారు. జీవీఎంసీలో అర్హులైన ఎస్ జి టి లకు ఎస్ఎ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ 2025న బదిలీ అయిన హిందీ ఉపాధ్యాయులను ఇంతవరకు రిలీవ్ చేయకపోవడం అన్యాయమన్నారు, వెంటనే వారిని రిలీవ్ చేసి కొత్త స్థానాలకు పంపించాలన్నారు. ఉపాధ్యాయులను భోధనేతర పనుల నుంచి మినహా యించాలని ఎన్నో రోజులుగా పోరాడుతున్న సరే, ఫలితం శూన్యమని వాపోయారు. ధర్నా అనంతరం డీఈవో కార్యాలయ సూపరిండెంట్ రామలింగేశ్వరరావు కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి, శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావు, కార్యదర్శులు గుత్తుల సూర్య ప్రకాష్, శేషు, చైతన్య శీల, సీనియర్ నాయకులు స్వామి,అలివేలు, శరగడం జగ్గారావు, వేగి సూర్య ప్రకాష్, ఉప్పాడ రాము, మామిడి బాబురావు, ఎల్లయ్య బాబు, రవి, తేజ్ వర్ధన్, జగ్గు బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్యూ కట్టిన వైసీపీ నేతలు- భారిగా టిడిపిలో చేరికలు



**అరకులోయ, డిసెంబర్ 18 (మనసులో మాట):** క్యూ కడుతున్న వైసిపి నేతలు భారీగాటిడిపిలోకి చేరికలు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, కూటమి ప్రభుత్వ పాలనను బలపరుస్తూ ప్రజాసేవలో భాగస్వాములయ్యేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో అరకులోయ నియోజకవర్గం అరకులోయ మండలం చినలబుడు పంచాయతీలో ఓ శుభ పరిణామం చోటుచేసుకుంది. పంచాయతీ పరిధిలో గల గొందివలస,దొర వలస గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి చేరారు. గురువారం టిడిపి సీనియర్ నాయకుడు కిలో శ్యామ్ ఆధ్వర్యంలో టిడిపి పార్టీలో చేరికలు జరిగాయి. విజయనగరం ఆర్టీసీ రీజనల్ చైర్మన్,టిడిపి అరకు అసెంబ్లీ ఇన్చార్జి సియారి దొన్నుదొర సమక్షంలో సుమారు 150 కుటుంబాలు పసుపు కండువాలను కప్పుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి అరకులోయ అసెంబ్లీ ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర పార్టీలో చేరిన వైసీపీ శ్రేణులకు స్వయంగా కండువాలను కప్పి టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలుప్రసంశిస్తున్నారని ఈ అభివృద్ధి పనులను చూసి వైసిపి నాయకులు,కార్యకర్తలు ఆకర్షితులై అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు కోరుకుంటూ టిడిపి పార్టీలో తీర్థం పుచ్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరగాలంటే కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకున్న వారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లకోయి మహదేవ్, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, చినలబుడు టిడిపి నాయకులు మాజీ ఎంపిటిసి గొల్లోరి సుబ్బారావు,మాజీ ఎంపీటీసీ కిల్లో దయ, సీనియర్ నాయకులు గోకుల్ దాస్,పరమానందం, వార్డు మెంబర్లు తామర్ల కన్నయ్య, గొల్లోరి రాజు,మజ్జి నారాయణ, పంచాయతీ కమిటీ అధ్యక్షుడు భగత్ రామ్, కమిటీ మెంబర్లు మధుసూదన్, కిల్లో బసవరావు, లోకో సీతారాం, సింహాద్రి, జగబంధు,కిలో బాబురావు, పొద్దు మోహన్, ముసిరి అప్పన్న, తామర భీమరాజు, గుమ్మడి రామన్న,టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రణాళికా బద్దంతో అభివృద్ధి లో దూసుకుపోతున్న అనకాపల్లి

## శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కు భోగలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మెన్ కాండ్రేగుల అభినందన



**అనకాపల్లి, డిసెంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి అభివృద్ధి లో దూసుకు పోతుందని శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థాన చైర్మెన్ కాండ్రేగుల సత్యనారాయణ ఒక ప్రకటనలో అన్నారు. దీనంతటికీ అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముందు చూపుతో ప్రణాళిక బద్దంగా ప్రయారిటీ తో పనులను చేపట్టడం వల్లే సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. అందుకు ఎమ్మెల్యే రామకృష్ణ కు అన్నివర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయని సత్యనారాయణ పేర్కొన్నారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషి ఫలితంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా మెగా జాబ్ మేళాలు అనకాపల్లి పట్టణంలో మూడు దఫాలుగా నిర్వహించి గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 2000 మందికి ఉద్యోగ నియమికాలు 60 కంపెనీలలో జరిగాయన్నారు. అలాగే అనకాపల్లి నియోజకవర్గంలో ప్రణాళిక బద్ధంగా ప్రయారిటీ ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా చేపడుతున్నారని అయన తెలిపారు. నియోజకవర్గ పరిదిలోని కసింకోట మండలం, అనకాపల్లి మండలం, జీవీఎంసీ ద్వారా సిమెంట్ రోడ్డులు, కాలువలు, ఇరిగేషన్ చానల్స్, కమ్యూనిటీ హాల్, పీహెచ్ఇ ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇదిలావుంటే ఎన్టీఆర్ జిల్లా ఏరియా ఆసుపత్రిలో పేద రోగులకు కావలసిన అన్ని సౌకర్యాలతో పాటు సిటీ స్కాన్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సెంటర్, పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు సంబంధించిన వ్యాధులకు అవసరమైన డాక్టర్ల ను నియమించడం జరిగిందన్నారు. అందువల్లే గతంలో కంటే ఓపి రోజు రోజుకి పెరుగుతుందన్నారు. అన్నిటికి మించి హాస్పటల్ కు అభివృద్ధి కమిటీ సభ్యులను నియమించి రోగులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని డైట్ విషయంలో రాజీ పడకుండా అందిస్తున్నారని, ఎన్టీఆర్ ఏరియా హాస్పిటల్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని సత్యనారాయణ అన్నారు. అభివృద్ధి లో అనకాపల్లి ఆదర్శం గా నిలేపేందుకు ప్రధాన కారకులైన ఎమ్మెల్యే రామకృష్ణ సర్వత్రా ప్రశంసలు అందడం ఆనందదాయకమని సత్యనారాయణ పేర్కొన్నారు.

# తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించండి


## - గని శెట్టి డిమాండ్




**పరవాడ డిసెంబర్ 18, (మనసులో మాట)** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ ఫార్మా కాలుష్యంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని సిఐటియు ఆధ్వర్యంలో తాడి గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తాడి గ్రామం లో ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని తీవ్రమైన జబ్బులతో అల్లాడుతున్నారని వెంటనే గ్రామాన్ని తరలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు నాశనం అయ్యాయని పర్యావరణం దెబ్బతిన్నదని మంచి గాలికి మంచినీరికి మంచి నేల కి ఈ ప్రాంత ప్రజలు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భాలు విచ్చమవుతున్నాయని గాఢమైన వాయువులతో ప్రజలు గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా తాడి గ్రామాన్ని తరలిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. తాడి గ్రామ ప్రజలకు సురక్షమైన ప్రాంతాలకు గ్రామాన్ని తరలించడానికి జీవో విడుదల చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, సిఐటియు నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, కుమారి, పార్వతి, లక్ష్మీ, నాయకత్వంలో ఆందోళన చేశారు ఈ సందర్భంగా తాడి గ్రామాన్ని తరలించాలని, కాలుష్యం నుండి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని, నినాదాలు చేశారు.

# చింత నిప్పుల అగ్రహారం

## జిల్లా కో-ఆపరేటివ్ పి.ఎ.సి.ఎస్ ప్రమాణస్వీకారం



అనకాపల్లి రూరల్, డిసెంబర్ 18 (మనసులో మాట): నిప్పుల అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఏ.సి.ఎస్) ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా ప్రమాణస్వీకారం చేసిన అధ్యక్షులు బంటు రవి, డైరెక్టర్లుగా గనిరెడ్డి రాజు,జెర్రిపోతుల రమణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ రోజు సహకార బ్యాంకు కూడా సుమారు 14.21 కోట్లు టర్న్ అవర్, షేర్ హెూల్డర్లు 3269 మంది , షేర్ ధనం 53.69 లక్షల, 1500 మంది రైతులతో మరింత అభివృద్ధి చేయాలన్నారు. నూతన కమిటీ హయాంలో 30 కోట్ల వరకు తీసుకువెళ్లే అవసరం ఉందని అన్నారు. రైతు మరణిస్తే 50వేల రూపాయలు ఇవ్వాలని, మర ఆరోగ్య బీమా 2 లక్షల నుంచి 5 లక్షల పెంచే విధంగా ఈ నెల 25 నుంచి అమల్లోకి రానుందని అందుకోసం అదేవిధంగా రైతులకు మేలు జరుగుతుందని, సభ్యులుగా చేరే విధంగా ప్రయత్నించాలన్నారు. గ్రామాల్లో మైనింగ్ కార్యక్రమాలు ఎక్కువ జరుగుతున్న కారణంగా భారీ వాహనాలు అధిక బరువుతో వెళ్లడం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 12 కోట్ల నిధులతో ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే కాలుష్యం తగ్గించే విధంగా ఎక్కువ చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అలాగే ఈ ఊర్లో కోనేరును అభివృద్ధి చేసే విధంగా 10 లక్షలు నిధులు మంజూరయ్యా అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం విరవిగా చేపట్టినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, జనసేన, టిడిపి, బిజెపి కూటమి సభ్యులు. నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# తుపాకులతో బెదిరించి కెనరా బ్యాంకులో దోపిడీకి యత్నం




**అనకాపల్లి, డిసెంబర్ 18 (మనసు లో మాట):** అనకాపల్లి రింగ్ రోడ్డు వద్ద ఉన్న కెనరా బ్యాంకులో గురువారం దుండగులు తుపాకులతో బ్యాంకులోకి చొరబడి సిబ్బందిని బెదిరించి దోపిడీకి ప్రయత్నించినట్టు తెలిసింది. ఆ సమయం లో బ్యాంకులో ఉన్న వినియోగదారు లను భయపెట్టి బయటకు రాకుండా అడ్డుకున్నట్లు సమాచారం. అయితే బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై వెంటనే అలారం మోగించడంతో ఆ శబ్దం విని పించడంతో దుండగులు బైకు లపై అక్కడి నుంచి పరారైనట్లు, ఘటన మొత్తం బ్యాంకులోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యినట్టు తెలుస్తోంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# వెల్చూరు ఆలయానికి 66 లక్షల సిజిఎఫ్ నిధులు

**రాంబిల్లి డిసెంబర్ 17 ( మనస్సు లో మాట)** రాంబిల్లి మండలం వెల్చురు శ్రీ ఉమా నాగలింగేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణం కొరకు సర్వ శ్రేయోనిధులు ద్వారా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ గారు ప్రత్యేక చొరవతో కూటమి ప్రభుత్వం నుండి 66 లక్షలు సీజీఫ్ గ్రాంట్ మంజూరు చేయించారు. మ్యాచింగ్ గ్రాండ్ ద్వారా 20 లక్షలు సుదీర్ రాజు, లక్ష్మి ప్రసాద్ రాజు మరియు ఇతర దాతలు సమకుర్చగా దీనికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా నిధులు మంజూరు కాపీని ఎమ్మెల్యే గారు చేతులు మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా వెల్చురు ప్రజలు తరుపున ఎమ్మెల్యే గార్కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లిమండల జనసేన కన్వీనర్ పప్పల నూకన్న దొర, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిదెల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఆర్ ఆనంద్, రవి, అర్చకులు మురళిశర్మ తదితరులు పాల్గొన్నారు..

# వాజ్ పేయి విగ్రహావిష్కరణకు హాజరు కానున్న ముఖ్యమంత్రి

**అనకాపల్లి రూరల్, డిసెంబర్ 18 (మనసులో మాట):** డైట్ కళాశాల కూడలి లో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంగణంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి కాంస్య విగ్రహం ఏర్పాటు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటను విడుదల చేశారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్ పేయి సుపరిపాలన, దార్శనిక అభివృద్ధి విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగిస్తున్న సమ్మిళిత అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర బిజెపి పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అటల్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా ఈ నెల 20 సాయంత్రం అనకాపల్లి ఫ్లైఓవర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వాజ్పేయి కాంక్ష విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకావాలని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ స్వయంగా ఆహ్వానించారు.

హాజరవుతున్నారు. ఈ సందర్భంగా వాజ్పేయి గారి విగ్రహావిష్కరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు హాజరవాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గారు మరియు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ గారు ప్రత్యేకంగా గౌరవ ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కూటమి నేతలు కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటన లో కోరారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే కొణతాల




**అనకాపల్లి రూరల్, డిసెంబర్ 18 (మనసులో మాట):** మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కల్పించారు. మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వస్తున్న 12 గ్రామాల విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా పాఠశాల గుర్తింపు పొందింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో క్రమశిక్షణతో కూడిన విద్య, ఉన్నత అకాడమిక్ ప్రమాణాలు, మెరుగైన ఎస్ఎస్-సీ ఫలితాల ద్వారా ఈ పాఠశాల చుట్టుపక్కల గ్రామాల ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది. గత మూడు సంవత్సరాలుగా అకాడమిక్ ఫలితాలు, ఎన్రోల్మెంట్లో పాఠశాల సాధిస్తున్న నిరంతర పురోగతి గురించి వివరించి సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేయడంతో ఎమ్మెల్యే స్పందించి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు దీంతో తల్లిదండ్రులు గ్రామస్తులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే గారు, గ్రామీణ ప్రాంతంలోని ఈ ఉన్నత పాఠశాల మరింత అభివృద్ధి సాధించాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకూడదన్న ఉద్దేశంతో బడి బస్సు సౌకర్యాన్ని కల్పించారు. బడి బస్సు సౌకర్యాన్ని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, కమిటీ చైర్మన్ మాకవరపు పరమేశ్వరి హర్షం వ్యక్తం చేశారు.

# చింత నిప్పుల అగ్రహారం

## జిల్లా కో-ఆపరేటివ్ పి.ఎ.సి.ఎస్ ప్రమాణస్వీకారం

అనకాపల్లి రూరల్, డిసెంబర్ 18 (మనసులో మాట): నిప్పుల అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏ.సి.ఎస్) ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా ప్రమాణస్వీకారం చేసిన అధ్యక్షులు బంటు రవి, డైరెక్టర్లుగా గనిరెడ్డి రాజు,జెర్రిపోతుల రమణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ రోజు సహకార బ్యాంకు కూడా సుమారు 14.21 కోట్లు టర్న్ అవర్, షేర్ హెూల్డర్లు 3269 మంది , షేర్ ధనం 53.69 లక్షల, 1500 మంది రైతులతో మరింత అభివృద్ధి చేయాలన్నారు.

నూతన కమిటీ హయాంలో

30 కోట్ల వరకు తీసుకువెళ్లే అవసరం ఉందని అన్నారు. రైతు మరణిస్తే 50వేల రూపాయలు ఇవ్వాలని, మర ఆరోగ్య బీమా 2 లక్షల నుంచి 5 లక్షల పెంచే విధంగా ఈ నెల 25 నుంచి అమల్లోకి రానుందని అందుకోసం అదేవిధంగా రైతులకు మేలు జరుగుతుందని, సభ్యులుగా చేరే విధంగా ప్రయత్నించాలన్నారు.


గ్రామాల్లో మైనింగ్ కార్యక్రమాలు ఎక్కువ జరుగుతున్న కారణంగా భారీ వాహనాలు అధిక బరువుతో వెళ్లడం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 12 కోట్ల నిధులతో ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే కాలుష్యం తగ్గించే విధంగా ఎక్కువ చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అలాగే ఈ ఊర్లో కోనేరును అభివృద్ధి చేసే విధంగా 10 లక్షలు నిధులు మంజూరయ్యా అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం విరవిగా చేపట్టినట్టు ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, జనసేన, టిడిపి, బిజెపి కూటమి

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు


# నేడు 'తూర్పు'లో మంత్రి నారా లోకేష్ పర్యటన



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్డీ), ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు (శుక్రవారం) తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 7.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని తన నివాసం నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 8.05 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం 8.10 గంటలకు విమానంలో బయలుదేరి, ఉదయం 8.45 గంటలకు మధురపూడి (రాజమహేంద్రవరం) విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చేరుకుని అక్కడ నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం (రాజానగరం) చేరుకుని అక్కడ నూతన భవనాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట వరకూ కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు నగరంలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్ కు చేరుకుని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్టీ నాయకులతో సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, 5.45 గంటలకు విమానంలో బయలుదేరి, సాయంత్రం 6.15 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తన నివాసానికి చేరుకుంటారు.

## పోలవరంపై శ్వేత పత్రం

# విడుదల చేయాలి

- ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి
- గతంలో డయా ఫ్రమ్ వాల్ ఎందుకు కొట్టుకుపోయింది..ఇప్పుడు అదే ప్రదేశంలో కడుతున్నపుడు గ్యారంటీ ఉందా?
- అధికారుల ద్వారా ప్రజలకు వాస్తవాలు చెప్పించాలి
- పీఓఈ నివేదిక అడిగితే కాపీరైట్ వర్తిస్తుందనడం ఏమిటీ?.. వింతగా ఉంది
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ అరుణ్ కుమార్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** పోలవరం ప్రాజెక్టు పై కూటమి ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకున్న సందేహాలు, అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. గతంలో రూ. 448 కోట్లతో కట్టిన డయా ఫ్రమ్ వాల్ కొట్టుకు పోగా, ఇప్పుడు రూ.990 కోట్లతో మళ్ళీ కడుతున్నారని ఈ సందర్భంగా ఉండవల్లి ప్రస్తావించారు. చంద్రబాబు హయాంలో కట్టిన ఈ నిర్మాణం జగన్ అధికారంలోకి వచ్చాక వరదలకు కొట్టుకుపోయిందని గుర్తుచేశారు. అసలు గతంలో కట్టింది ఎందుకు కొట్టుకుపోయిందో చెప్పాలన్నారు. స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన గల బుక్ బ్యాంకులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబితో కల్సి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడు ఏ కంపెనీ కట్టిందో..ఇప్పుడూ అదే కంపెనీ కడుతోందని, గతంలో ఏ అధికారులు ఉన్నారో వాళ్లే జగన్ హయాంలో కొనసాగరని, ఇప్పుడు కొనసాగుతున్నారని అరుణ్ కుమార్ అన్నారు. మళ్ళీ కడుతున్నందున అసలు ఇది ఎవరి నిర్ణయమని ఆయన ప్రశ్నించారు. ఇంత పెద్ద డామేజి జరిగితే విచారణ జరిపించారా, ఎందుకిలా జరిగింది, మళ్ళీ ఉంటుందా పోతుందా అనే అనుమానం నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖకు చెందిన రమేష్ అనే న్యాయవాది ప్రతి సారి ఆర్టీఐ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతూ ఉంటాడని అరుణ్ కుమార్ ప్రస్తావిస్తూ, వివరాలు ఇవ్వకపోవడంతో అప్పీల్ కి వెళ్లాడని, దాంతో ఇతడు ఇలాగే అడుగుతూ ఉంటాడని వేరే పని లేదని సెంట్రల్ కమిషన్ కి సమాధానం ఇవ్వటంతో అతడికి అదే పని అయినా రిప్లై ఇవ్వడమే మీ పని సెంట్రల్ కమిషన్ స్పష్టం చేసిందని వివరించారు. అతడు అన్నింటిపై ఆర్టీఐ వివరాలు అడగటం, వాటిని తనకు కూడా పంపిస్తూ ఉంటాడని ఆయన తెలిపారు. పోలవరం మీద ప్యానల్ ఆఫ్ ఎక్స్ పర్ట్స్ (పీఓఈ) కమిటీ వేస్తే, ఆ కమిటీ పోలవరం దగ్గర పరిశీలించి అక్టోబరు నెలలో ఒక నివేదిక ఇచ్చింది. కమిటీ వచ్చి వెళ్లినట్లు, ప్రభుత్వానికి రిపోర్ట్ ఇచ్చినట్లు పత్రికల్లో వచ్చినప్పటికీ ఆ నివేదికలో ఏముందో వెల్లడి కాలేదన్నారు. దాంతో ఆ నివేదిక కాపీ ఇప్పించాలని న్యాయవాది రమేష్ సమాచార హక్కు చట్టం కింద అడిగాడని అరుణ్ కుమార్ తెలిపారు. అయితే ఆ నివేదిక ప్రభుత్వానికి ఇచ్చిందని, దాన్ని ఎవరికైనా ఇస్తే కాపీ రైట్ చట్టం కిందకి వస్తుందని రిప్లై ఇచ్చారని ఉండవల్లి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. యండమూరి వీరేంద్ర నాథ్ , యద్దనపూడి సులోచన రాణి వంటివాళ్ళు కథ రాసుకుంటేనే మరొకటో అయితే కాపీ రైట్ అని విన్నాం గానీ కమిటీ నివేదికకు ఇది ఎలా వర్తిస్తుందో ఎక్కడ వినలేదని ఆయన అన్నారు. పీఓఈ కమిటీ వాళ్ళు చెప్పకుండా ఎలా ఇస్తాం అంటూ కాపీరైట్ వర్తిసుందనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నిజానికి ఆ నివేదికలో ఏమీ ఉండదని, సాధారణంగా ప్రభుత్వం చెప్పినట్టే రాస్తారని అయినా ఎందుకు ఇలా అన్నారో అర్ధం కావడం లేదన్నారు. 2019లో పెంటపాటి పుల్లారావు అనే వ్యక్తి గ్రీన్ ట్రిబ్యునల్ లో వేస్తే, పునరావాసం పూర్తి కాకపోవడం వలన కన్నాలు పూడ్చలేకపోయామని, ఇలా పూడ్చకపోవడం అప్పట్లో అవసరం అయిందని ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చిందన్నారు. నిజానికి పూడిస్తే ముంపు ప్రాంతాలు మునిగిపోతాయి. అందుకే మాకు పరిహారం ఇచ్చి మమ్మల్ని ఇక్కడ నుంచి తరలించకుండా పూడ్చడానికి కుదరదని కూడా అక్కడివాళ్లు గొడవ చేశారు' అని ఆయన గుర్తుచేశారు. కాపర్ డాం లో కన్నాల కారణంగానే డయా ఫ్రమ్ వాల్ పోయిందని కేంద్ర జలశక్తి వాళ్ళు ఆర్టీఐ లో దానికి సమాధానం ఇచ్చారని ఆయన తెలిపారు. కాపర్ డాం వలన మునిగిపోదని ధవళేశ్వరం సర్కిల్ వాళ్ళు అప్పట్లో ఇచ్చిన నివేదిక కూడా రమేష్ కి వచ్చిందన్నారు. కన్నాలు పూడిస్తే ముంపు ప్రాంత వాసులు ఊరుకోరని, పూడ్చకపోవడం వలన డయా ఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని తెలుస్తోందని, అయితే ముందు ముందు ఇంకా పెద్ద వరదలు వస్తే ఇలాంటి ప్రమాదం ఉంటుందా అనేది తేల్చాల్సి ఉందని అరుణ్ కుమార్ అన్నారు. నేను ఎంపీగా ఉండగా విశాఖకు చెందిన శివాజీరావు అనే ప్రొఫెసర్ నాకు ఫోన్ చేసి తప్పు చేస్తున్నారు.. పోలవరం కడితే రాజమండ్రి ఏలూరు అన్నీ కొట్టుకుపోతాయి. పూర్తిగా ఇసుక ప్రదేశం అక్కడ కట్టినా ఆగదని హెచ్చరించేవారని ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే అప్పట్లో సీతాపతిరావు లాంటి నిపుణుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తే ఇప్పుడు టెక్నాలజీ మారిపోయిందని, అందుచేత ఇబ్బంది లేదని చెప్పారని ఆయన అన్నారు. వాల్ కొట్టుకుపోవడనికి మానవ తప్పిదమా, సాంకేతిక కారణమా చెప్పాలి కదా అని అరుణ్ కుమార్ అడిగారు. ఇక సీ లెవెల్ కన్నా ఎత్తులో బెడ్ లెవెల్ ఉండాలని, గోదావరి కింద బెడ్ పైన ఇసుక వేసి, ఆ ఎత్తులో డాం కడతారని అరుణ్ కుమార్ చెబుతూ గతంలో 8.32 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేయాలని ఉంటే ఇపుడు 15.5 మీటర్ల ఎత్తులో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డాం (ఈ సి ఆర్) కడుతున్నారని, బెడ్ లెవెల్ కి గ్యాప్ రెట్టింపు అయిందని అన్నారు. పాత వాటిలో 15.5 మీటర్ల ఎత్తు అనేది ఎక్కడా లేదని, ఈ విషయం మొన్న పత్రికల్లో చూశానని అన్నారు. ఇంత మంది ఇంజనీర్లు ఉండికూడా వాల్ ఎందుకు కొట్టుకుపోయిందో చెప్పకుండా రహస్యంగా ఎందుకని అరుణ్ కుమార్ ప్రశ్నించారు. అందుకే రాజమండ్రిలో గానీ, ధవళేశ్వరం లో గానీ ఒక విస్తృత సమావేశం పెట్టి మీడియా సమావేశంలో ఈ ప్రాజెక్టు పై సందేహాలు నివృత్తి చేయాలని ఉండవల్లి కోరారు. ముందుగానే ప్రశ్నలు రాసి ఇమ్మని వాటికీ సమాధానాలు ఇస్తే, అనవసర ప్రశ్నలకు ఆస్కారం ఉండదని ఆయన అన్నారు. గతంలో ఎన్నో శ్వేత పత్రాలు ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తుచేస్తూ పోలవరం ప్రాజెక్టు సందేహాల నేపథ్యంలో శ్వేత పత్రం ప్రకటించాలని అరుణ్ కుమార్ కోరారు.

**పోలవరం నిర్వాసితుల పొలాల షెడ్యూల్ రేటు బహిర్గతం చేయాలి..**

పోలవరం నిర్వాసితుల పొలాలకు ఇచ్చే షెడ్యూల్ రేటు బహిరంగంగా ప్రకటించి, దళారులకు అవకాశం లేకుండా చూడాలని అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు సంబంధిత రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ స్పెషల్ కలెక్టర్ స్పందించి, పోలవరం కోసం సేకరించే పొలాలకు ధర ఇది అని ప్రకటించాలన్నారు. లేదంటే దళారుల ప్రమేయంతో రైతులు ఇబ్బంది పడతారని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు.

## ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా

# కూటమి ప్రభుత్వం కీలక అడుగు



- ▸▸ రూ.3,050 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన
- ▸▸ అధునాతన సాంకేతికతతో గోదావరి జలాలు శుద్ధి చేసి ఇంటింటికీ త్రాగునీరు పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం
- ▸▸ తద్వారా తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ తదితర 5 జిల్లాల్లోని 23 నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు లబ్ధి
- ▸▸ రూ.1,650 కోట్లతో ఉమ్మడి తూర్పుగోదావరి, రూ.1,400 కోట్లతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజల త్రాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం
- ▸▸ జల్ జీన్ మిషన్ నిధులతో రెండు దశల్లో నిర్మాణ పనుల పూర్తికి ప్రణాళిక ▸▸ 2 ఏళ్లలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తికి చర్యలు
- ▸▸ పెరవలిలోని ఎన్ హెచ్ 216ఎ దగ్గర ఆర్ కే రైస్ మిల్ సమీపంలో భారీ ఎత్తున శంకుస్థాపన కార్యక్రమం
- ▸▸ ఉప ముఖ్యమంత్రి పర్యటనను దిగ్విజయం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు

**తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి (మనసులో మాట), డిసెంబరు 18:** ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేస్తోన్న కీలక అడుగుకు శుభ ముహూర్తం ఖరారైంది. రూ.3,050 కోట్లతో చేపట్టే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఈ నెల 20న నిడదవోలు నియోజకవర్గం పెరవలిలోని ఎన్ హెచ్ 216ఏ దగ్గర ఆర్ కే రైస్ మిస్ సమీపంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అధునాతన సాంకేతికతతో సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ధవళేశ్వరం, బొబ్బర్లంక, వేమగిరి సమీపంలో నుండి గోదావరి జలాలు శుద్ధి చేసి తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ తదితర 5 జిల్లాల్లోని 23 నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరనుంది. అందులో భాగంగా రూ.1,650 కోట్లతో ఉమ్మడి తూర్పు గోదావరిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి లోని 11 నియోజకవర్గాలు, 32 మండలలాల్లోని 39.64 లక్షల మంది ప్రజలకు, రూ.1,400 కోట్లతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు, పశ్చిమ గోదావరి, ఈస్ట్ గోదావరి (కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాలు) 12 నియోజకవర్గాలు, 34 మండలాల్లోని 28.18 లక్షల ప్రజలకు త్రాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. జల్ జీవన్ మిషన్ నిధులతో రెండు దశల్లో నిర్మాణ పనుల పూర్తికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఈ నేపథ్యంలో 2 ఏళ్లలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. గోదావరి డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పు నీరుగా మారడం, కలుషితం కావడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. అంతే గాక ధవళేశ్వరం వద్ద అత్యాధునిక సాంకేతికతతో కూడిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మించి గ్రావిటీ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నీటిని శుద్ధిచేసి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించనున్నామన్నారు. ఇన్నేళ్లుగా అఖండ గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ గోదావరి వాసులకు త్రాగునీరు సమస్య వెంటాడేదని, కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ చొరవతో ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందనుందన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు పర్యటనకు తొలి సారిగా విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలకాలని, కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పర్యటనను దిగ్విజయం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# జగన్.. అసత్య ప్రచారాలు మానుకో

- ▸▸ పీపీపీ అంటే కూడా తెలియదా..
- ▸▸ కావాల్సినంత యూరియా ఉన్నా పసరే దుష్ప్రచారమా? ▸▸ పీపీపీ విధానానికి, ప్రయివేటీకరణకూ జగన్ కి అర్ధం తెలీదు
- ▸▸ ధాన్యం కొనుగోళ్లు అద్భుతంగా సాగుతుంటే విమర్శలా? ▸▸ మీడియా సమావేశంలో అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** జగన్..నువ్వు ముఖ్యమంత్రి గా చేశావు..ఆ మాత్రం పీపీపీ అర్ధం తెలియకపోతే ఎలా?, ప్రజలను భయపెట్టడానికా..లేక నిజంగా పీపీపీ గురించి తెలియకనే అలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు జగన్ మోహన్ రెడ్డి తెరతీశారని, అసత్య ప్రచారాలు చేయడంలో ఆయనిది అందవేసిన చేయి అని ఎమ్మెల్యే నల్లమిల్లి వ్యాఖ్యానించారు. గతంలో వివేకానంద రెడ్డిని హత్య చేయించి ఆ నేరాన్ని చంద్రబాబుపై నెట్టిన వైనం చూస్తే అబద్ధాలు చెప్పడంలో జగన్మోహన్ రెడ్డి దిట్ట అని మనకు అర్ధమవుతుందన్నారు. ఇప్పుడు మూడు అంశాలలో ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎటువంటి కొరత ఉండదని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. తూర్పు గోదావరి జిల్లా విషయానికొస్తే ఈ రబీ సీజన్ కు కావలసిన యూరియా 58,950 మెట్రిక్ టన్నులని, మూడు విడతలుగా ఒక్కో రైతుకు ఎకరానికి మూడు బస్తాలు చొప్పున అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. మొదటి విడతలో 20వేల మెట్రిక్ టన్నులు రైతులకు అందజేయవలసి ఉండగా ఈ రోజు ప్రభుత్వం 18,662 మెట్రిక్ టన్నులు సేకరించి అందులో 13,840 మెట్రిక్ టన్నుల యూరియాను ఇప్పటికే రైతులకు విక్రయించిందని, మిగిలింది వ్యవసాయ శాఖ దగ్గర సంసిద్ధంగా ఉందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. మొత్తంగా కావలసిన 58,950 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రోక్యూర్ చేయడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. అదనంగా నిల్వలు ఉన్నప్పటికీ యూరియా దొరకదు, దొరకదు అంటూ జగన్మోహన్ రెడ్డి అండ్ కో ఒక ఆందోళనకర వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. డీఏపీ 8564 టన్నులు ఈ సీజన్ కి అవసరం ఉంటే 5,530 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ యంత్రాంగం దగ్గర నిల్వ ఉందని, అందులో 3199 టన్నులు రైతులకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఎరువులకు సంబంధించి పెద్ద ఎత్తున సబ్సిడీ అందిస్తోందని, 45 కేజీల యూరియా బస్తా రూ. 2503లు తయారీ ధర అయితే రైతుకు రూ.267 లకే ఇస్తోందని, ఒక్కొక్క బస్తాకి రూ.2,230లు కేంద్రం సబ్సిడీ ఇస్తోందని, 50 కేజీల డీఏపీ బస్తా రూ.3,771లు అయితే రూ.1,311లకే రైతులకు ఇస్తోందంటే, దీనిపై సబ్సిడీ రూ.2,422ల సబ్సిడీని కేంద్రం భరిస్తుందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇంత చక్కగా ప్రభుత్వం యూరియాను సరఫరా చేస్తూ ఉంటే యూరియా దొరకట్లేదు అంటూ జగన్మోహన్ రెడ్డి అండ్ కో తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ రైతులలో ఆందోళన సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి విమర్శించారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు జరుగుతోందని, మంగళవారం నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొనుగోలు చేసి, 3.79 కోట్ల మంది రైతులకు రూ.5683 కోట్లు చెల్లించినట్లు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చెప్పారు. 50 లక్షల టన్నులు కొనుగోలు చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ఉందన్నారు. సీఎంఆర్ కు అమ్మిన ధాన్యానికి నాలుగు గంటల లోపే రైతులు ఖాతాలో డబ్బు జమవుతోందన్నారు. ఈ క్రాఫ్ చేయించుకోని రైతులు సీఎంఆర్ కు కాకుండా బయట మార్కెట్లో అమ్ముకోవడాన్ని బూచిగా చూపించి ధాన్యానికి మద్దతు ధర లభించడం లేదంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మిన తర్వాత ఎన్ని నెలలకు రైతులకు డబ్బు జమ అయ్యేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండు చేసారు. దాదాపు ఆరేడు నెలలకు కూడా డబ్బు అందని పరిస్థితి ఉండేది. వైసీపీ ప్రభుత్వం దిగేనాటికి 1654 కోట్ల రూపాయలు బకాయిలు పెట్టి పోయిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు విడతలుగా ఆ బకాయిలను చెల్లించిందని ఆయన గుర్తు చేశారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ అని ప్రచారం చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి పీపీపీ మోడల్ కి ప్రైవేటీకరణకి తేడా తెలియదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ రోజు పీపీపీ మోడల్ అనేది కొత్త కాదు.. వాజపేయి హయాంలో నేషనల్ హైవే లను ఈ మోడల్ లోనే అభివృద్ధి చేశారని, పోర్టులు హార్బర్లు అనేకం ఈ మోడల్ లోనే అభివృద్ధి చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాం నుండి వైద్య ఆరోగ్య శాఖలోని మందుల సరఫరా నుండి అనేక అంశాలు పీపీపీ మోడల్ లోనే జరుగుతున్నాయని, పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్, పబ్లిక్ పార్ట్నర్షిప్ ఆ విషయం తెలియకుండా ప్రైవేటీకరణ అంటూ ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కోటి సంతకాల సేకరణను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేస్తూ, కుడి చేత్తో, ఎడమ చేత్తో సంతకాలు పెట్టలేక ఛస్తున్నామంటూ వైసీపీ నాయకులే విసుక్కుంటున్నారని అన్నారు. ప్రజలు సంతకాలు చేయలేదని, కేవలం వైసీపీ కార్యకర్తల చేతనే సంతకాలు చేయించుకుంటూ కోటి మంది వ్యతిరేకించారని ప్రకటనలు గుప్పిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలకు కనీసం 5 వేల కోట్లు అవసరమని, అంత మొత్తం సేకరించడం సాధ్యం కాకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వం పిపిపి మోడల్ లో ముందుకు వెళ్లాలని నిర్ణయించిందన్నారు. అలాగే యాన్యువల్ మెయింటైనెన్స్ ఒక్కొక్క దానికి 100 కోట్లు చొప్పున 1700 కోట్లు అవసరం అవుతుందని, అందుకే ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని నిర్ణయించుకుందని, 33 సంవత్సరాలు వాళ్ళు పెట్టిన మొత్తాన్ని రికవరీ చేసుకుని తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారని ఆయన తెలిపారు. అలాగే ఇప్పుడు నిర్వహిస్తున్న అనేక మెడికల్ కాలేజీలో సీట్ల భర్తీ అంశం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేతుల్లోనే ఉంది తప్ప ప్రైవేట్ చేతుల్లో లేదని చెబుతూ వీటికి అదే విధానం ఉంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు.



## నగరంలో దేవాలయాల అభివృద్ధికి

# రూ.10 కోట్లు మంజూరు

- దేవదాయ ధర్మదాయ శాఖకు కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** నగరంలోని ఆయా దేవాలయాల అభివృద్ధికి రూ. 10 కోట్లు మంజూరైంది. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సిఫార్సులు, నిరంతర పర్యవేక్షణ, ప్రతిపాదనలు ఈ నిధులు మంజూరుకు ప్రధాన కారణంగా నిలుస్తాయి. ఈ కారణంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ. 10 కోట్లు నగరంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలోని 6 దేవాలయాలు, వాటి అనుబంధ సంస్థ అభివృద్ధి కోసం ఈ నిధులు మంజూరయ్యాయి. కాగా దేవదాయ ధర్మదాయ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తలిపారు. రాజమహేంద్రవరం నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం, సదుపాయాల విస్తరణ కొరకు ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు మంజూరు చేసిన విషయం సంతోషంగా తెలియజేస్తున్నామని తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తుల కోసం మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా, నగరంలోని పలు దేవాలయాలకు, ఆయా సత్రాల పనులకు పరిపాలనా మంజూరులు లభించాయని తెలిపారు. ఈ మొత్తం పనులు 2027 పుష్కరాల నాటికి పూర్తయ్యే విధంగా ప్రణాళిక రూపొందించబడుతున్నాయని, ఆయా శాఖాధికారులకు వేగవంతమైన టెండర్ ప్రక్రియ, నిర్మాణ పనుల ప్రారంభించాలని సూచించినట్టు తెలిపారు. ఈ చర్యలతో రాజమండ్రి ప్రాంతంలోని ఆలయాలు ఆధునిక సౌకర్యాలతో మెరుగుపడి భక్తులకు, సందర్శకులకు మరింత అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే వాసు తెలిపారు. నగరంలోని చంద సత్రం భవనాల అభివృద్ధి కోసం రూ. 75 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే స్థానిక ఆర్యాపురం శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవాలయం ముఖ మండపం పునర్నిర్మాణం కోసం రూ. 1 కోటి మంజూరైందన్నారు. గంటాలమ్మ గుడి వీధిలోని శ్రీ నూనె వర్తకుల అన్నదాన సమాజం 'అన్నదాన భవనం' పునర్నిర్మాణం కోసం రూ. 70 లక్షలు, పందిరి మహాదేవుడు సత్రంలో పిండ ప్రదానాల హాల్ నిర్మాణం (జీం2) రూ. 3 కోట్లు, శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘం సత్రం పునర్నిర్మాణం (జీం2), వంట గది బ్లాక్ నిర్మాణం (జీం1) కోసం రూ. 2.8 కోట్లు, లక్ష్మీవారపు పేటలోని రామలింగేశ్వర చౌడేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారం పునర్నిర్మాణం, ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠకు, ఆలయ అభివృద్ధి కోసం రూ. 55 లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# నేడు 'నన్నయ'లో నూతన భవనాలను ప్రారంభించనున్న మంత్రి లోకేష్

## - ఏర్పాట్లు పరిశీలించిన వీసీ, జేసీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన భవనాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి (హెచ్.ఆర్.డి.), ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. గురువారం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలను వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలు వీసీ ప్రసన్నశ్రీ తెలియజేస్తూ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా విశ్వ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన భవనాలు ప్రారంభిస్తారని చెప్పారు. విశ్వ విద్యాలయం నిధులలో నుండి రూ. 20.05 కోట్లతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనం, రూ. 8.25 కోట్లుతో ఎగ్జామినేషన్స్ భవనం, రూ. 5.5 కోట్లుతో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ భవనాలను నిర్మించామని చెప్పారు. తరువాత మంత్రి లోకేష్ సమక్షంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్.టీ.ఐ.హెచ్.) రాజమహేంద్రవరంతో మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంవోఏ) కుదుర్చుకుంటూ పత్రాలు మార్చుకుంటామని తెలిపారు. ఆవిష్కరణలు, వ్యవస్థాపక సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం వాణిజ్యీకరణను ముందుకు తీసుకెళ్ళడం ఎంఓఏ ముఖ్య ఉద్దేశమన్నారు. పూర్తి అకడమిక్ గా ఈ కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, విశ్వ విద్యాలయ అధికారులు, యూనివర్సిటీ ఇంజనీర్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**నన్నయ వర్సిటీలో మంత్రి లోకేష్ పర్యటన వివరాలు..**

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయానికి చేరుకుంటారు. నూతనంగా నిర్మించిన ఇంజనీరింగ్ కాలేజ్ భవనాన్ని ప్రారంభించి, ఇంజనీరింగ్ కాలేజ్, ఎగ్జామినేషన్స్, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవనాల శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. తరువాత రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో ఎంఓఏ కార్యక్రమం, విశ్వ విద్యాలయ అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు విశ్వ విద్యాలయం నుండి బయలుదేరతారు.

# సిటీలో మహిళలకు రక్షణ ఏది?..

- పోలీసు వ్యవస్థ అసలు ఉందా?
- మొన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక బాలింత ప్రాణాలు తీసిన ప్రభుత్వ వైద్య సిబ్బంది..
- నిన్న ఒక మైనర్ బాలిక పైన అత్యాచారం..
- అంతకు మునుపు తండ్రి కొడుకుల మీద బ్లేడ్ బ్యాచ్ హత్యాయత్నం
- ఇలా సిటీలో రోజుకొక అసాంఘిక ఘటనలు
- రేపు మంత్రి లోకేష్ వచ్చేది దేని కోసం?
- ప్రజల సంక్షేమం, మహిళలకు బాలికలకు రక్షణ ఏది?
- పాలనా వ్యవస్త నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వం
- పాత్రికేయ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ మహిళా విభాగం ప్రతినిధుల ఆవేదన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తి అవుతోందని, పాలనా వ్యవస్థ అస్తవ్యస్తం.. ప్రజల మహిళల ప్రాణ మాన రక్షణ కరువు, రోజుకో ఘటన.. వారంలో రెండు ఘటనలు.. ఒకటి ప్రభుత్వ ఆసుపత్రిలో 20 సంవత్సరాల బాలింత వైద్యుల నిర్లక్ష్యం వలన ప్రాణం కోల్పోతే, నిన్న బీసీ హాస్టల్ మైనర్ బాలికపై అత్యాచారం..ఇదేనా కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ విభాగం మహిళా ప్రతినిధులు సూటిగా ప్రశ్నించారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నిన్నటి ఘటనలో అసలు ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ నుండి ఆ బాలిక బయటకు ఎలా వెళ్లింది? వార్డెన్, సిబ్బంది ఏమి చేస్తునట్టు అని ప్రశ్నించారు. అసలు ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తిస్తున్నారా లేక నిద్రపోతున్నారా అని నిలదీశారు. రాజమండ్రి సిటీ లో శాంతి భద్రతలు అసలు ఉన్నాయా?..లేక యంత్రాంగం చోద్యం చూస్తోందా అన్నారు. మహిళల భద్రత కరువయ్యిందని, ఈ కూటమి ప్రభుత్వ పాలనలో..ప్రతీ రోజూ పేపర్లలో మహిళలపై జరుగుతున్న దారుణాలు, చైన్ స్నాచింగ్, కిడ్నాప్, మానభంగాలు, హత్యలు..వీటన్నిటికీ పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. శుక్రవారం మంత్రి లోకేష్ పర్యటన రాజమండ్రి సిటీలో ఉందట.. దేనికి వస్తున్నట్టు?, ఇక్కడ రాక్షస పాలన చూడటానికా?, అసమర్ధ శాసనసభ్యుని పరిపాలన చూడటానికా?, మందు మాఫియా, ఇసుక మాఫియా, సెటిల్మెంట్లు, బ్లేడ్ బ్యాచ్లు, గంజాయి బ్యాచ్లు, అసలు పట్టించుకునే నాధుడు లేడన్నారు. ప్రశ్నిస్తే కేసులు, అడిగితే అరెస్టులు, నిరంకుశ పరిపాలన అసలు సిటీ శాసన సభ్యుడు పరిపాలన కోసం ఎంత చెప్పినా తక్కువే అని విమర్శించారు. ఈ సమావేశంలో సిటీ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి వట్టికుటి కృష్ణవేణి, మాజీ గాండ్ల తెలికుల కార్పొరేషన్ చైర్మన్ సంకీస భవానీ ప్రియ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్టార్ కంపెనీ వాలంటరీ వింగ్ అధ్యక్షురాలు అనంత లక్ష్మి, కే అను, మాజీ కార్పొరేటర్ కాటం ప్రియాంక, కుమారి, విజయ కుమారి పాల్గొన్నారు.

# నిడదవోలులో డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దుర్గేష్



**తూర్పు గోదావరి (మనసులో మాట), డిసెంబరు 18:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నిడదవోలు నియోజకవర్గంలో చేపట్టనున్న పర్యటనను దృష్టిలో ఉంచుకుని, క్షేత్ర స్థాయిలో చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం విస్తృత స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, దిశానిర్దేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో తొలి సారిగా నిడదవోలు నియోజకవర్గాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటనను అత్యంత వేడుకగా, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా నియంత్రణ, పారిశుధ్య నిర్వహణ, వైద్య సదుపాయాలు, తాగునీటి సరఫరా, విద్యుత్తు ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెరవలి– తణుకు జాతీయ రహదారి మార్గంలో సభా ప్రాంగణం ఏర్పాటు చేయడం జరిగిందని, సభా వేదిక, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, మీడియా గ్యాలరీ, ప్రజల ప్రవేశం – నిష్క్రమణ మార్గాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశమున్న నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మంత్రి వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా ఈ పర్యటన ఉపయోగపడుతుందని మంత్రి దుర్గేష్ అన్నారు.



## కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** అమరావతిలో రెండవ రోజు గురువారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తూర్పు గోదావరి జిల్లా నుంచి కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర స్థాయి అభివృద్ధి కార్యక్రమాల అమలు, వివిధ శాఖల సమన్వయం, ప్రజా సేవల సమర్ధవంతమైన నిర్వహణ, చట్టం – శాంతి పరిరక్షణ, అలాగే జిల్లా పరిపాలనలో తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయాలని, ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు హాజరయ్యారు.

## యూటీఎఫ్ రాజమహేంద్రవరం నగర శాఖ ఎన్నిక ఏకగ్రీవం




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** స్థానిక యూటీఎఫ్ హోం లో రాజమహేంద్రవరం నగర శాఖ నూతన కౌన్సిల్ ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఇటీవల జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఎన్నికల అధికారిగా ప్రసాద్, పరిశీలకులుగా రమేష్ బాబు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ హాజరయ్యారు. సభ్యులు, కార్యకర్తలు కలిసి ఏకగ్రీవంగా యూటీఎఫ్ నగర శాఖ ప్రతినిధులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వీ సుబ్బారెడ్డి, అధ్యక్షుడిగా జీవీవీ అప్పారావు, సహాధ్యక్షునిగా మహమ్మద్ అలీమ్ బేగ్, సహాధ్యక్షురాలిగా ఎంఎన్ వీ లక్ష్మి, జనరల్ సెక్రటరీగా ఎస్ తేజ విజయ కుమార్, కోశాధికారిగా ఎస్ వీ రాజగోపాల్, కార్యదర్శులుగా ఎం శివాజీ, జేవీవీ సుబ్బారావు (పత్రికా బాధ్యులు), సీహెచ్ వీ గంగాధర్ (ఆడిటర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.?

## కొవ్వూరు డివిజన్ డీవైఈఓ గా దిలీప్ కుమార్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** కొవ్వూరు డివిజన్ ఉప విద్యా శాఖాధికారి (ఎఫ్ఏసీ)గా బీ దిలీప్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డీఐ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీవైఈఓ గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్ ను జిల్లా విద్యా శాఖాధికారి కే వాసుదేవరావు, డీఈఓ కార్యాలయ ఏడీ వెంకట్రాజు, కొయ్యలగూడెం డీవైఈఓ రామన్న దొర, కొవ్వూరు ఎంఈఓ శ్రీదేవి, హెచ్ఎం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీ రామానుజం, సహాధ్యక్షులు కోలా సత్య నారాయణ, మంగిన శ్రీరామారావు, ఎయిడెడ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు బీ చిట్టి బాబు, డివిజన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## 21న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

### - తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** ఈ నెల 21న తూర్పు గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బురిడి త్రిమూర్తులు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి స్థానిక ఎస్ కేవీటీ డిగ్రీ కాలేజీలో ఈ ఎంపిక జరుగుతుందని, తూర్పు గోదావరి జిల్లాలోని 19 మండలాల్లో ఉన్న కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. కబడ్డీ క్రీడాకారులు 85 కేజీలలోపు ఉండాలని, తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని ఆయన తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వ తేదీ వరకు కర్నూలు జిల్లా పంచలింగం గ్రామంలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని బురిడి త్రిమూర్తులు తెలియజేశారు. ఇతర వివరాలకు 98487 35152 నెంబరులో తనను సంప్రదించవచ్చని ఆయన కోరారు.



## మంత్రి లోకేష్ పర్యటనా ఏర్పాట్లు పరిశీలించిన జేసీ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** స్థానిక ప్రభుత్వ కళాశాల (అటానమస్) లో శుక్రవారం ఐటీ, హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రావు , తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని, భద్రత, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యార్థుల సమన్వయం, కార్యక్రమ స్థలాల నిర్వహణ వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కళాశాల ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ ప్రారంభోత్సవాలు, విద్యార్థులతో పరస్పర చర్యలు, ఇన్నోవేషన్– ఇన్క్యుబేషన్ హబ్, లెర్నింగ్ రిసోర్స్ సెంటర్, సీవీ రమణ్ అంతర్జాతీయ అధ్యయన కేంద్రం తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆయన సూచించారు. అధికారులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, మంత్రి పర్యటనను ఆదర్శవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. జేసీ వెంట ప్రభుత్వ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ఆర్ రామచంద్ర రావు, కళాశాల అధికారులు, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫైళ్లు అన్నీ ఆన్ లైన్ చేయాలి

### - కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** నగరంలో చేపట్టే ప్రతి ప్రగతి పని ఆన్‌లైన్ అవ్వాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో ఇంజనీరింగ్ విభాగ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి ప్రగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. వివిధ దశలలో ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు వెబ్ సైట్ లో పొందుపరచాలన్నారు. లెటర్ ఆఫ్ యాక్సప్టెన్స్ వచ్చిన వారం రోజులలో పనులు ఎట్టి పరిస్థితుల్లో అయినా ప్రారంభం కావాలని.. ఒక వేళ ఎక్కడైనా జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. లాలా చెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో రూ. కోటి 57 లక్షలతో చేపట్టిన రోడ్డుతో పాటు 50వ డివిజన్లో రూ. కోటి 50 లక్షలతో చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. రహదారుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. ఎక్కడా గుంతలు కనపడకూడదని స్పష్టం చేశారు. పార్కులకు సంబంధించి ప్యాకేజి-3 పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే ఫిబ్రవరి నెలాఖరు నాటికి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ), మార్చి నెలాఖరు నాటికి రివర్ ఫ్రంట్ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావలసిందిగా ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఎస్ఈ (ఇంఛార్జి) రీటా, ఈఈ మదర్సా అలీ, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన సంసద్ ఖేల్ మహోత్సవ్ ఆటల పోటీలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** స్థానిక ఎస్కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 17న బుధవారం ప్రారంభమైన 'సంసద్ కేల్ మహోత్సవ్' రాజమహేంద్రవరం అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీ, కోకో, బాస్కెట్ బాల్, యోగ, వాలీబాల్, ఫుట్ బాల్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో కబడ్డీలో లూథరన్ హై స్కూల్ జాంపేట, ఖో ఖోలో సిటీ మున్సిపల్ హైస్కూల్, వాలీబాల్ లో ఆనంద నగర్ మున్సిపల్ హై స్కూల్, ఫుట్ బాల్ లో ఎస్ కేవీటీ హైస్కూల్, బాస్కెట్ బాల్ లో ఎస్ కేవీటీ హైస్కూల్ విజేతలు గా నిలిచారు. యోగాలో ఎస్ కేవీటీ హైస్కూల్ మొదటి స్థానం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల రెండవ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కబడ్డీలో లూథరన్ ఎయిడెడ్ హై స్కూల్ జాంపేట, ఖో ఖోలో సిటీ మున్సిపల్ హై స్కూల్, వాలీబాల్ లో లూథరన్ ఎయిడెడ్ హై స్కూల్ (జాంపేట), బాస్కెట్ బాల్ లో ఎస్ కేవీటీ ప్రభుత్వ హైస్కూల్, ఫుట్బాల్ లో నెహ్రూ నగర్ మున్సిపల్ హై స్కూల్, యోగాలో శ్రీనివాస రామానుజమ్ మున్సిపల్ హై స్కూల్ మొదటి స్థానం, ఎస్ కేవీటీ ప్రభుత్వ హైస్కూల్ రెండవ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి, వీ వెంకటేశ్వరరావు, ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాల పీడీలు పీఏ కృష్ణకుమార్, బీ కల్పన, పీడీ డీ విజయ విక్టర్, ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మీడియా అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు

**కాకినాడ ( మనసులో మాట )డిసెంబర్ 18..** రాష్ట్రస్థాయిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు 2026-27 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియల నిమిత్తం రాష్ట్రస్థాయి మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి చైర్మన్ గా సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కమిషనర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) ఏపీ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) ఏపీ జర్నలిస్ట్స్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్ – కెప్ట్ ఇన్ అబేయాన్స్ ) స్మాల్ అండ్ మీడియా డెయిలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎస్ఎండీఎన్ఏ) స్మాల్ అండ్ మీడియా న్యూస్ పేపర్స్ షన్ (ఎస్ఎంఎస్ఏపీ) ఏపీ అసోసియేషన్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఈఎంజేఏ) ఏపీ బ్రాడ్కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీబీజేఏ), ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నుంచి ఒక్కొక్కరు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తారు. మెంబర్ కన్వీనర్ గా సమాచార పౌర సంబం ధాల శాఖ అదనపు డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ వ్యవహరిస్తారు. అలాగే జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు నిమిత్తం ఈనెల 20వ తేదీలోపు ప్రతిపాదనలు సమర్పించాలని సమాచార డైరక్టర్ కె. ఎస్. విశ్వనాధన్ జిల్లా సమాచార పౌర సంబంధ అధికారులనుఆదేశించారు.కావున రాష్ట్ర స్థాయా అక్రిడిటేషన్ కమిటీ కూర్పులో చేర్చిన జర్నలిస్ట్ యూనియన్లు/అసోసియేషన్ లు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యత్వానికి తమ ప్రతినిధులను నామినేట్ చేస్తూ తమ ప్రతిపాదన లేఖలను ఈ నెల 19 తేదీలోపున తమ కార్యాలయంలో అందజేయాలని డిఐపిఆర్ఓ, కాకినాడ డి. నాగార్జున కోరారు.



## విశేషంగా లక్ష పత్రి పూజ

**ఐ పోలవరం, (మనసులో మాట) డిసెంబర్ 18.** మురమళ్లలో నిత్యకళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారికి మార్గశిర మాస శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకుని లక్ష పత్రి పూజ గురువారం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి, అర్చకులు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ , మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం బిల్వార్చన కార్యక్రమం జరిపారు. ప్రతి మాస శివరాత్రికి ఆలయంలో భక్తుల గోత్రణామాలతో దేవస్థానం తరపున లక్ష పత్రి పూజ జరుపుతారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, సహాయ కమీషనర్ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాగాభట్ల శ్రీరామ్ శర్మ , కిషోర్ శర్మ, శశి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మల్లి సాలలో పరిశుద్ధ నూతన ప్రార్థన మందిరం

### జ్యోతుల నవీన్ చే ప్రారంభోత్సవం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 18..** జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో తెలుగుదేశం సీనియర్ కార్యకర్త ఆకుమర్తి గణేష్ 20 లక్షల రూపాయలతో నిర్మించిన పరిశుద్ధ నూతన ప్రార్థన మందిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ ప్రార్థన మందిరం నిర్మాణ కర్త ఆకుమర్తి గణేష్ మాట్లాడుతూ 2021 వ సంవత్సరంలో మా ప్రియతమ నాయకుడు, మా ఆరాధ్య దైవం జ్యోతుల నెహ్రూ కి గుండెపోటు రావడంతో ఆరోజు ప్రభువును ప్రార్థించి మా నాయకుడికి ఏ అనారోగ్య సమస్య లేకుండా జగ్గంపేట ఎమ్మెల్యే గా విజయం సాధిస్తే మీకు పరిశుద్ధ ప్రార్థన మందిరం నిర్మిస్తానని ప్రభువుని కోరుకున్నానని ఆయన నా కోరిక నెరవేర్చడంతో 20 లక్షల రూపాయల సొంత నిధులతో ఈరోజు ఈ పరిశుద్ధ నూతన ప్రార్థన మందిరం మా ప్రియతమ యువనేత కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేతులమీదుగాప్రారంభించుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, అత్తులూరి నాగబాబు, ముండ్రు కృష్ణారావు (ఎర్రబాబు) సర్పంచ్ సర్వసిది నూక రత్నం లక్ష్మణరావు, పైడిపాల సత్తిబాబు, పల్లికొండ భద్రం, సియాధుల పెద్దకాపు, తొట్టిపూడి నాగేశ్వరరావు, పాస్టర్స్ ఆకుమర్తి సతీష్, గోరంట్ల కుమార్ పాల్, మిరియాల సత్యనారాయణ, తోగరు యేసు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పలువురికి తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 18..** జగ్గంపేట మండలం జగ్గంపేట గ్రామం లో దొడ్డ సత్యనారాయణ ఇటీవల స్వర్గస్తులైనారు.ఈరోజు వారి స్వగృహం లో నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అలాగే పల్లా అప్పారావు అబ్బాయి పల్లా గోపి ఇటీవల స్వర్గస్తులైనారు.ఈరోజు వారి స్వగృహం లో నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన వారి చిత్ర పటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, కురుమళ్ళ నాగేశ్వరరావు,సత్తి సోమరాజు, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, గంధం వంశి పాల్గొన్నారు.

# ఆర్డీవో కార్యాలయాన్ని కొనసాగించాలి

### ముస్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మాణం - సింగ్ టెండర్లు రద్దుకు ఆమోదం



**రామచంద్రపురం(మనసులో మాట) డిశంబరు 18..** ఇప్పటివరకు ఉన్న రామచంద్రపురం రెవిన్యూ డివిజన్‌ను యధాతధంగా కొనసాగించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్‌లు ఏకగ్రీవ తీర్మాణానికి ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ నందు గురువారం కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. తొలుత అత్యవసర సమావేశంలోని మొత్తం 38అంశాలను కౌన్సిల్ సభ్యులను చదివి వినిపించారు. అయితే వీటిలోని 36 అంశాలైన వివిధ రకాల పనులకు సంబందించిన టెండర్లపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ. 80లక్షల విలువగల పనులకు సంబందించిన 36 టెండర్లను కాంట్రాక్టర్లు కుమ్మక్కు అయ్యి సింగిల్ టెండర్లు వేయటంతో మున్సిపాలిటీకి భారీ ఎత్తున ఆదాయానికి గండి పడుతుందని కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగిల్ టెండర్లు వేయటంతో మున్సిపాలిటీకీ భారీ న ష్టం వాటిల్లుతుందుని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది స్వార్ధం కోసం ఈ టెండర్లును సింగిల్ టెండర్లు వేయించి ఆమోదం పొందాలనే ప్రయత్నం చేశారని,. దీనిని గమనించిన కౌన్సిల్ సభ్యులు రూ. 80 లక్షల విలువైన 36 పనుల టెండర్లు రద్దు చేస్తూ తీర్మాణం చేశారు. మొత్తం 36 పనులకు సంబందించి సింగిల్ టెండర్లు వేయటంతో వాటని రద్దు చేయాలని కౌన్సిలర్‌లు కోరారు. దీంతో రీటెండర్లు కాల్‌ఫర్ చేయాలని చైర్ పర్సన్‌శ్రీదేవి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మిగిలిన రెండు అంశాలను కౌన్సిలర్‌లు ఆమోదం తెలిపారు. ఆర్డీవో కార్యాలయం కొనసాగించాలని కౌన్సిల్‌తీర్మానం అనంతరం ఆర్డీవో కార్యాలయం యధాతధంగా ఉంచాలనే డిమాండ్‌ను టేబుల్ ఎజెండాగా తీసుకురావాలని చైర్ పర్సన్ శ్రీదేవి, కమీషనర్ కెవీవీఆర్‌కే రాజులకు వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్‌లు వినతి పత అందజేశారు. దీంతో టేబుల్ అంశంగా తీసుకువచ్చి మరొక ప్రత్యేక సమావేశం ద్వారా ఆర్డీవో కార్యాలయం ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ముందుకు తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం ఉన్న రామచంద్రపురం రెవిన్యూ డివిజన్‌ను ఎప్పటిలాగే కొనసాగించాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీంవగా ఆమోదంతెలిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో పలువురు కౌన్సిలర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో మండలాలు, జిల్లాలు పునర్విభజనలో భాగంగా ఏమైనా అభ్యంతరాలు ఉంటే నెల రోజులు లోగా వారియొక్క హెూదాతో కూడిన అభ్యంతరాలు తెలియజేయాలని కోనసీమ జిల్లా కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ లో తెలియజేశారన్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు ఈ ఆర్డీవో కార్యాలయం కొనసాగించాలనే తీర్మాణానికి ఆమోద తెలిపారు. కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 6 క్రికెట్ పోటీలు ప్రారంభం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 18..** స్థానిక గుర్రంపాలెం రోడ్ లోని బాలాజీ రైస్ మిల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ లో జగ్గంపేట ప్రీమియర్ లీగ్ (జె పి ఎల్) సీజన్ 6 క్రికెట్ పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ పోటీలను జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీనుమణి బాబు ప్రారంభించి క్రీడాకారులతో కాసేపు క్రికెట్ ఆడి అలరించారు. జగ్గంపేట టౌన్ నుండి ఆరు టీములు ఈ పోటీలలో పాల్గొంటారని వారం రోజులపాటు ఈ పోటీలు కొనసాగుతాయని ప్రథమ బహుమతి 10,000 రూపాయలు జీను మణిబాబు, రెండో బహుమతి 8000 రూపాయలు దేవరపల్లి మూర్తి, మూడో బహుమతి 7000 పాలచర్ల నాగేంద్ర చౌదరి, విన్నర్స్ కప్పు ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ కేఎస్ రాజు, రన్నర్స్ కప్పు ముక్క సింగరయ్య అందిస్తున్నారని క్రీడాకారులకు భోజన వసతి పాలిక వెంకటరమణ, కాళహస్తి అంజని వరప్రసాద్, గట్టి అయ్యప్ప, గట్టి సాయిరాం సమకూరుస్తున్నారని, టోర్నమెంట్ అంతటికీ బాల్స్ గద్దె కిషోర్, పిలా మణికంఠ అందిస్తున్నారని, వాటర్ మీసేవ శ్రీను అందిస్తున్నారని మెమెంటోస్ స్పాన్సర్ లావేటి నాయుడు, ఫ్రూట్స్ స్పాన్సర్ మహేష్ జ్యూస్ జ్యూస్ షాప్ వారు అందిస్తున్నారని నిర్వాహకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు, రాయి సాయి, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, నలమాటి ఆనంద్, బండారు నాని, హరి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుడికి అక్కడికక్కడే ఇండ్ల స్థలం

### మంజూరు చేసిన తహశీల్దారు విద్యాపతిని మెచ్చుకున్న ఎమ్మెల్యే గిడ్డి



**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 18 :** వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమంలో ఒక వికలాంగుడికి అక్కడికక్కడే ఇండ్ల స్థలం మంజూరు చేసి ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆ పట్టాను బాధితునికి అందించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , తాహసిల్దార్ విద్యాపతిని అయినవిల్లి మండల ప్రజలు అభినందనలతో ముంచెత్తారు.అయినవిల్లి మండలం లో వెలుగులపల్లి, చింతలలంక, మడిపల్లి గ్రామాలలో గురువారం వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను చింతనలంక గ్రామ ప్రజలు గుర్రంపై ఎక్కించి ఊరేగింపుగా సభ స్థలానికి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పలువురు వినతులను స్వీకరించగా గ్రామానికి చెందిన పాలూరి మరియమ్మ కుమారుడు పాలూరు అశోక్ మెదడుకు సంబంధించిన వ్యాధి వలన అతనికి మెదడు ఆపరేషన్ వైద్యులు చేయగా అతను రెండు కళ్ళు (చూపు) పాడైందని ఆమె తల్లి కన్నీరు మున్నూరు అయింది. వారిది అతినిరుపేద కుటుంబం కనీసం ఉండటానికి ఇంటి స్థలం కూడా లేని పేదరికంలో ఉన్న వారి పరిస్థితి చూసిన అయినవిల్లి మండలం తాహశీల్దార్ విద్యాపతి అక్కడకక్కడే ఆ బాధితుడికి మూడు సెంటు స్థలాన్ని పట్టాను ఎమ్మెల్యే చేతుల మీదుగా వారికి అందజేశారు. దీంతో సభ ప్రాంగణంలో ఉన్న మూడు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను తాసిల్దార్ విద్యాప్రతిని అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను నేరుగా వెళ్లి పరిష్కరించే కార్యక్రమం వాడవాడకు మన ఎమ్మెల్యే గిడ్డి కార్యక్రమం అని ఈ కార్యక్రమంలో అనేకమందికి ఇండ్ల స్థలాలు మంజూరు, పెన్షన్లు రోడ్లు డ్రైన్లు నిర్మాణాలకు పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. ఈ క్రమంలో చింతనలంక గ్రామానికి చెందిన అతి నిరుపేద పాలూరి మరియమ్మ తన కుమారుడికి బ్రెయిన్ ఆపరేషన్ చేయగా అతనికి రెండు కళ్ళు చూపు పోవడంతో తీవ్ర ఆవేదనతో తన ముందు సమస్య ఉంచగా తహసిల్దార్ విద్యాపతి తక్షణమే మూడు సెంట్లు ఇండ్ల స్థలం పట్టాను నా చేతుల మీదుగా వారికి అందజేయడం నాకు ఎంతో ఆనందకరంగా ఉందని ఆయన తెలిపారు. నా నియోజకవర్గంలో ఇలాంటి అధికారి ఉండటం నాకు ఎంతో గర్వకారణం అని ఇలాంటి అధికారుల వల్ల నిజమైన నిరుపేదలకు న్యాయం చేయడానికి ఏ ఆటంకం ఉండదని ఆయన సమావేశంలో స్పష్టం చేశారు. అనంతరం మూడు గ్రామాల నుండి వచ్చిన లబ్ధిదారుల వినతులను ఎమ్మెల్యే తీసుకుని వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో కూట నాయకులు మూడు గ్రామాల ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వల్లే రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి..

### - చంద్రబాబు అంటే ముందు చూపు ముందు చూపు అంటే చంద్రబాబు

### - సీబీఎన్ బ్రాండ్ తో ఏపీలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 18:** ప్రముఖ దినపత్రిక ది ఎకనామిక్ టైమ్స్ అందించే అవార్డు ఈసారి సీఎం చంద్రబాబు నాయుడును వరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఠాపురంలో ఎస్ వి ఎస్ ఎన్ వర్మ పత్రికా సమావేశం గురువారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ మాట్లాడుతూ విజన్ 2047 కి అనుగుణంగా స్నేహపూర్వక వ్యాపార అనుకూల విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, భారీ ఇన్సెంటివ్ లు తదితర పారిశ్రామిక సంస్కరణలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూసుకుపోతున్నారన్నారు. ఏపీపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతోందనడానికి వెల్లువలా వస్తున్న పెట్టుబడులే నిదర్శనమన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపుతో కూడిన అవార్డు చంద్రబాబు నాయుడుకి రావడం ఆయన సమర్థతకు చిహ్నమన్నారు. గడిచిన 5 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ అంటే దోపిడీలు దౌర్జన్యాలు అరాచకాలు అక్రమాలకు కుంభకోణాలకు నిలయంగా మారిందన్నారు. గత సీఎం జగన్ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చి భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ను అత్యంత హీనస్థితికి తీసుకుపోయాన్నారు. కానీ నేడు చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్ర ప్రతిష్ట పెంచి దేశంలోనే నెంబర్ వన్ గా నిలబెట్టడానికి చేస్తున్న కృషిలో భాగంగా ఈ అవార్డు వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సిబిఎన్ నాయకత్వం,ఆధునాతన సాంకేతికత ను అనుసంధానం చేస్తూ ప్రవేశ పెట్టిన పాలనా సంస్కరణలు కీలకంగా మారాయన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న గణనీయమైన ప్రగతి ఈ అవార్డును తెచ్చిపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి విజన్‌ను దేశం గుర్తించిందని చెప్పడానికి ఎకనామిక్ టైమ్స్ ప్రకటించిన "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్" అవార్డు నిదర్శనం. రాష్ట్రంలో మందగించిన పారిశ్రామిక ప్రగతిని ఎప్పటికప్పుడు నూతన పారిశ్రామిక విధానాలు, ఆవిష్కరణలు, సంస్కరణలతో నేడు పరుగులు పెట్టిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఐటీ పరిశ్రమల నుంచి, చిన్న తరహా పరిశ్రమల వరకు నేడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి అంటే, అది వారి పాలనపై ఉంచిన నమ్మకమేనన్నారు. పెట్టుబడులు రావాలంటే మౌలిక సదుపాయాలు, శాంతి భద్రతలు ఉండాలి అంటూ ఏడు పదుల వయసులో కూడా అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఈ అవార్డు రావడం రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు గర్వకారణంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### అక్షర కళాశాలలో సైబర్ నేరాలపై

# విద్యార్థులకు అవగాహన

**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 18..** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జగ్గంపేట అక్షర కాలేజీలో ఎస్.డి.పి.ఓ శ్రీహరి రాజు, సీఐ వై అర్ కే అవేర్నెస్ కాంపెయిన్ నిర్వహించి సైబర్ క్రైమ్ గురించి వివరించడం జరిగింది.డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో ఎక్కడా లేనేలేదు.అత్యాశ, అశ్రద్ధ సైబర్ నేరాలకు కారణం.సోషల్ మీడియాలో వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయవద్దు.మీ బ్యాంకు ఖాతాలు డెబిట్ క్రెడిట్ కార్డు వివరాలు ఎవరికీ తెలియ జేయకండి.పార్ట్ టైం జాబ్ ఆఫర్ తో వచ్చే ప్రకటనల పట్ల జాగ్రత్త వహించండి.లింకు వస్తుంది మోసం మొదలవుతుంది.అపరిచిత వ్యక్తులు నుండి వచ్చే వీడియో కాల్స్ ను లిఫ్ట్ చేయకండి.సైబర్ క్రైమ్ గురించి, నేరగాళ్ల పై ఫిర్యాదు కొరకు 1930 ఉపయోగించండి.అసభ్యకర, అసత్య అభ్యంతర పోస్టులను సోషల్ మీడియాలో పెట్టవద్దు. క్రికెట్ బెట్టింగులు, ఆన్లైన్ గేమ్స్ జోలికి వెళ్ళవద్దు.

**డ్రగ్స్ వద్దు బ్రో**

కళాశాలలు, పాఠశాలలు , ఉన్నత విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్బులు (ఈగల్ క్లబ్బులు) ఏ యాక్టివ్ గా పని చేయాలి.యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా విద్యార్థులు కదలికలపై తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు నిఘా పెట్టటం అవసరం.ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ స్కూలు, విద్యా సంస్థల చుట్టుపక్కల 100 గజాల దూరంలో సిగరెట్లు ,ఇతర పొగాకు ఉత్పత్తులు, గంజాయి డ్రగ్స్ లాంటి అమ్మకాలు, కొనుగోలు, రవాణా, లేకుండా చూడాలి.ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972.

**శక్తి యాప్**

మహిళల మరియు చైల్డ్ ల భద్రత, భరోసా ధైర్యం, రక్షణ ఆప్షన్ పై క్లిక్ చేస్తే చాలు నిమిషాల్లో పోలీసు రక్షణ.భద్రత తో కూడిన ప్రయాణానికి సేఫ్ ట్రావెల్ ఆప్షన్.శక్తి యాప్ ద్వారా గివ్ ఎ కంప్లైంట్ ఆప్షన్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ,నైట్ షెల్టర్లు సమాచారం పొందవచ్చు.శక్తి యాప్ లో మీ ఆపద సమాచారం మీరు నమోదు చేసుకున్న ఐదుగురు వ్యక్తులకు పంపే ఆప్షన్ ఉంది. విద్యార్థినీలు లవ్ ట్రాప్ లో పడవద్దు.

**రోడ్డు ప్రమాద నివారణకు**

ద్విచక్ర వాహనదారులు రైడర్ మరియు పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించవలెను.త్రాగి వాహనాలు నడపరాదు.మొబైల్ సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదు.అతివేగం, మానవ నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణం.మైనర్స్ వాహనాలు నడపరాదు.హైవే క్రాస్ చేసినప్పుడు నిర్దేశిత ప్రాంతాల్లోనే క్రాస్ చేయవలెను.

**దొంగతనాల నివారణ కు**

ఇంట్లో ఎవరూ లేకుండా అందరూ పగలైనా రాత్రేనా బయటకు వెళ్లేటప్పుడు ఎటువంటి విలువైన ఆభరణాలు, వస్తువులు ,నగదు ఉంచరాదు.ఆటోలోనూ బస్సుల్లోనూ ప్రయాణించేటప్పుడు బ్యాగ్ మహిళా దొంగలు ఉంటారు జాగ్రత్త.

## కామ్రేడ్ వినోద్ మిశ్రా ఆశయాలు కొనసాగిద్దాం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 18..** కామ్రేడ్ వినోద్ మిశ్రా ఆశయాలను కొనసాగించాలని సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు ఏగుపాటి అర్జునరావు అన్నారు. బుధవారం జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో కామ్రేడ్ వినోద్ మిశ్రా 27వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ వినోద్ మిశ్రా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వినోద్ మిస్రాకు జోహార్లు పలుకుతూ ఆయన ఆశయాలు సిద్ధాంతాలను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ కామ్రేడ్ వినోద్ మిశ్రా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో పోరాటం చేశారన్నారు. గోవిందపురం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి రమణ, జగ్గంపూడి రాజా, కోరుకొండ మరిడమ్మ, నాగులపల్లి బుజ్జమ్మ, గుమ్మిడి రాంబాబు, మన్నేపల్లి రమణా తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరత రాకుండా కృషి

### కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం(మనసులో మాట)డిశంబరు18..** పంట సాగులో రైతులకు యూరియా కొరత రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల వ్యాపారులు, సహకార సంఘాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గురువారం రామచంద్రపురంలోని ప్రసన్న విగ్నేశ్వర ఫంక్షన్ హాలులో రామచంద్రపురం సబ్-డివిజన్ పరిధిలోని ఎరువులు వ్యాపారులు, సహకార సంఘాల సమన్వయ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు ఆయన తండ్రి, సీనియర్ నాయకుడు సత్యం పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు దాళ్వా పంటకు అవసరమైన యూరియా రైతులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఎవరూ యూరియా కోసం అధైర్య పడవద్దని విడతల వారీగా పంటకు అవసరం మేర సరఫరా జరుగుతుందన్నారు. ముందుగానే పంట విస్తీర్ణం మొత్తానికి కావాల్సిన యూరియా ఒకేసారి తీసుకుని నిల్వ ఉంచుకోవద్ధని, దాని వల్ల అవసరమైన రైతులకు తగిన సమయంలో ఎరువులు అందని పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. అలాగే ప్రైవేటు రిటైల్ ఎరువుల డీలర్ల సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రామచంద్రపురం ఏవో మణిదీప్ మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి ప్రతి రైతుకు యూరియా సరైన సమయానికి చేరేలా పనిచేద్దామని కోరారు. కంపెనీ ప్రతినిధులు అమ్రుత్, కె గంగవరం ఏవో సద్గురు మూర్తి, రామచంద్రపురం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకా సురేష్, ప్రసన్న విఘ్నేశ్వర సంస్థల అధినేత సత్తి వెంకటరెడ్డి, కె గంగవరం డీలర్, సెక్రటరీ పెదబాబు, పట్టణ టీడీసీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, సొసైటీ సిఈవో లు పాల్గొన్నారు.



వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా

## ఎఫ్ఐఆర్ డౌన్‌లోడ్ సౌకర్యం

- పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎఫ్ ఐ ఆర్ ప్రతిని పొందండి
- జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ మేరకు సూచనలు జారీ
- పారదర్శకతతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడానికి మనమిత్ర సేవలు ఉపయోగపడుతాయి
- జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** ప్రజలకు మరింత సులభమైన, వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు.ప్రతి ఎఫ్ ఐ ఆర్ నమోదు అనంతరం ఫిర్యాదుదారులు తమ ఎఫ్ ఐ ఆర్ ప్రతిని పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఎఫ్ ఐ ఆర్ డౌన్‌లోడ్ విధానం గూర్చి తెలుపుతూ ఫిర్యాదుదారు 95523 00009 నంబర్‌ను తన మొబైల్‌లో సేవ్ చేసి వాట్సాప్‌లో హాయ్ పంపాలి. మెనూ నుండి పోలీస్ సర్వీసెస్ డౌన్లోడ్ ఎఫ్ ఐ ఆర్ ఎంపిక చేసుకోవాలన్నారు. అవసరమైన వివరాలను నమోదు చేసి ఎఫ్ ఐ ఆర్ ప్రతిని వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఈ సేవల ద్వారా ప్రజలకు సమయం ఆదా కావడంతో పాటు, పోలీస్ సేవల్లో మరింత పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు అందరూ ఈ సేవపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ అవకాశాన్ని ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ కోరారు.

## నలుపు తెలుపు కాలం నాటి.. సీనియర్ ఫోటోగ్రాఫర్

### అల్లూరి కృష్ణంరాజు ఇక లేరు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** సీనియర్ ఫోటోగ్రాఫర్, రాజా ఫోటో స్టూడియో అధినేత అల్లూరి కృష్ణంరాజు (86) ఇక లేరు. 1940లో ఈయన జన్మించారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు పేరాజు ఫోటో గ్రఫీలోనే కొనసాగుతు న్నారు. స్థానిక కోటగుమ్మం సెంటర్ లోని రాజా స్టూడియో అంటే ఉభయ గోదావరి జిల్లాల్లో తెలియనివారు ఉండరు. నలుపు తెలుపు కాలం నుంచి..ఫీల్డ్ కెమెరా కార్డు నుంచి నేటి తరం డిజిటల్ యుగం వరకు సుమారు ఐదు శతాబ్దాల ఫోటోగ్రఫీ చరిత్ర ఆయన సొంతం. 1978లో రాజమండ్రి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా, 1992లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా సేవలందించారు. ఆయన మరణం బాధాకరమని రాజమండ్రి గోదావరి జిల్లా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబి సంతాపం వ్యక్తం చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు రావ్ అండ్ రావ్, సభ్యులు, వానపల్లి బాబి, లీలా, నాగు, రత్నం గోపి, బుడ్డిగా సంతోష్. రాంబాబు, సతీష్, ధర్మవీర్ రాజు, రాజశేఖర్ లక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ ద్వారా పార్వతీ సుందరి తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం సాయంత్రం కోటిలింగాల రోటరీ కైలాస భూమిలో అంత్యక్రియలు జరిగాయి.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తానని

# ఎన్నికల ముందు చెప్పావా చంద్రబాబు?

- పీపీపీ విధానాన్ని వెనక్కి తీసుకో..లేకుంటే ప్రజా గుణపాఠం తప్పదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు
- ప్రజల సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెడతావా ?
- సీపిఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాజమహేంద్రవరంలో సీపూఐ ధర్నా




**రాజమహేంద్రవరం (మనసులో మాట) డిసెంబరు 18:** గత ఎన్నికల ముందే నేను అధికారంలోకి వస్తే 10 ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీరణ చేస్తానని చెప్పి ఉంటే.. నీ పార్టీకి డిపాజిట్లు కూడా వచ్చి ఉండేవి కాదంటూ సీఎం చంద్రబాబు పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిరసన ధర్నా నిర్వహించారు.

ఈ ధర్మాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య రంగాన్ని పీపీపీ పేరుతో ఖూనీ చేయడం దారుణం అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ప్రజల ఆగ్రహానికి గురవుతారని మధు హెచ్చరించారు. ప్రజా వైద్యాన్ని ప్రైవేటీకరణ చేస్తే సామాజిక న్యాయం విద్యార్థుల హక్కులు, ఉపాధి, భద్రత, పేద మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నెంబరు 590 ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని, ఇది కేవలం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని దెబ్బతీస్తుందని మధు వ్యాఖ్యానించారు. ఈ ఏడాది సెప్టెంబరు 9న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబరు 590 విడుదల చేసి మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గం అన్నారు. మెడికల్ కాలేజీలు పీపీపీ విధానం వల్ల ప్రభుత్వ భూములు, భవనాలు, కాలేజీలు, ఆసుపత్రులు దాదాపు 60 ఏళ్ల పాటు ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతాయని మధు తెలిపారు. మొత్తం 1500 సీట్లు త్వరగా అందుబాటులోకి వస్తాయని అందులో 70 శాతం సీట్లు కన్వీనర్ కోట కింద పేదలకు లభిస్తాయని ప్రభుత్వం చెబుతున్న 25 శాతం యాజమాన్య కోట సీట్లను 375 సీట్లు ఒక్కొక్కటి 50 లక్షలు నుంచి 60 లక్షల వరకు విక్రయించే అవకాశం ఉందని దీంతో పేద మధ్యతరగతి వర్గాలకి వైద్య విద్య దూరం అవుతుందని మధు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 70 శాతం పడకలు ఉచితంగా వైద్య సేవలు కోసం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతున్న మిగిలిన 30 శాతం చెల్లింపు పడకల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో పేదలకు వైద్యం అందక అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవ లోపిస్తుందని, పేద రిజర్వేషన్ వర్గాలకు వైద్య విద్య సీట్లు అందకుండా పోతాయని, ఇది ప్రభుత్వ ఉద్యోగ భద్రతను రిజర్వేషన్ హక్కులను బలహీనపరచడమేనని మధు నిరసన వ్యక్తం చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు, సహాయ కార్యదర్శి కే రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీఓ నెంబరు 590 తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు సీపీఐ దశల వారీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు 107, 108 లను రద్దు చేయాలని, నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి నిర్వహించాలని వారు కోరారు. పీపీపీ విధానాన్ని వెనక్కు తీసుకునే వరకు కార్మిక విద్యార్థి యువజన సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని రేఖ భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, పీ లావణ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్, పీ త్రిమూర్తులు, పంతం నాగేశ్వరావు, ఎం ప్రసాద్,

జట్ల సంఘం అధికార బాడీ ప్రతినిధులు పీ దేవుడు బాబు, నల్ల రామారావు, రెడ్డి వెంకట్రావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు, నిడదవోలు పార్టీ నాయకులు, విద్యార్థులు, జట్లసంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు బాధ్యతాయుతమైన

# సేవలు అందించడానికి ఈ ఆఫీస్ కీలకం - జెసి నిశాంతి





**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 18:** ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు సేవలు అందించే ముఖ్యమైన విభాగాలలో సమర్థవంతమైన, పారద ర్శకమైన బాధ్యతాయుతమైన పాలన కోసం ఇ బి ఆఫీ స్ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు సిబ్బందికి ఇ బిఆఫీస్ నిర్వహణ అంశాల పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించి కార్యాలయంలో అమలు చేయాల్సిన ఇ బిఆఫీస్ నిర్వహణ అంశాలు వాటికి సంబంధించిన విధి విధానాలపై శిక్షణను ఇచ్చారు. రెవెన్యూ సిబ్బందికి ఈ ఆఫీస్ ద్వారా ఫైల్స్ ఎలా నిర్వహించాలి తదితర అంశాలపై జె సి ట్రైనింగ్ క్లాసులు నిర్వహించగా ఎన్ ఐ సి టెక్నికల్ అసోసియేట్ గౌతమ్ సిబ్బంది సందేహాలు నివృత్తి చేశారు. అదేవిధంగా ఈ ఆఫీసులో పాటించాల్సినటువంటి ఖచ్చితమైన ప్రొసీజర్ ని తెలియజేసారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ఫైల్స్ ను ఇ- ఆఫీస్ ద్వారా ప్రాసెస్ చేయమని, అదేవిధంగా కలెక్టరేట్లో గాని కార్యాలయాల్లో ఇ బిఆఫీస్ వాడవలసినటువంటి ఆవశ్యకత గురించి విశదీకరించారు. కార్యాలయ పనులు సక్రమంగా, సమయాను కూలంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వల్ల ఉద్యోగు ల పనితీరు మెరుగవుతుం దన్నారు ప్రజలకు సుపరిపాలన చేరువ కావడం తో పాటుగా సిబ్బందిలో పారదర్శకత, బాధ్యత, క్రమశిక్షణను పెంపొంది స్తుందన్నారు. ఫైల్ నిర్వహణ ద్వారా ఫైళ్లను నమోదు చేయడం, వర్గీకరించడం, సంఖ్య కేటాయించడం,ఫైల్ మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహించడం,పాత ఫైళ్లను రికార్డ్ రూమ్‌లో భద్రపరచ డం,గోప్యమైన ఫైళ్లకు ప్రత్యేక భద్రత కల్పించడం చేయాలన్నారు.ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ రిజిస్టర్లు నిర్వ హణ వచ్చిన లేఖలను సంబంధిత విభాగాలకు తక్షణమే పంపించాల న్నారు.సమాధానాలు నిర్ణీత గడువులో సమర్పించాల న్నారు.సేవా రికార్డులు, ఖాతా రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. రికార్డుల సంరక్షణలో కాలపరిమితి పాటిం చాలన్నారు.అవసరం లేని రికార్డులను నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్ నిర్వహించడం,విధుల కేటాయింపు స్పష్టంగా చేయడం,సెలవులు, సేవా నిబంధనలు పాటించడం శిక్షణ మరియు పనితీరు సమీక్షలు బడ్జెట్ ప్రకారం ఖర్చులు చేయడం క్యాష్ బుక్, బిల్లులు, వోచర్లు నిర్వహించడం ఆడిట్ నిబంధనలతో ఆర్థిక పారదర్శకతను చేప ట్టాలన్నారు. కార్యాలయ క్రమ శిక్షణ ప్రవర్తన కార్యాలయ సమయాలు కచ్చితంగా పాటించడం, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఉద్యోగ నియమావళిని పాటించాల న్నారు. సమాచార సాంకేతికత వినియోగంతో కంప్యూటర్లు,ఆన్ లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారాఈ-ఆఫీస్, డిజిటల్ ఫైల్ సిస్టమ్ అమలు చేస్తూడేటా భద్రత గోప్యత పాటించాలన్నారు. కార్యా లయంలో ఆఫీస్ నిర్వహణ విధి విధానాలు సక్రమంగా అమలైతే పని తీరు మెరుగుపడి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించవచ్చున న్నారు అందువల్ల ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతతో నిర్వ హించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం డిగ్రీ కళాశాల లో కృత్రిమ మేధస్సు పై

# మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శిభిరం ప్రారంభం




**ఏలేశ్వరం(మనసులో మాట) డిసెంబర్ 18..** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏలేశ్వరం నందు పిఎం ఉషా స్కీమ్ లో భాగంగా కృత్రిమ మేధస్సు పై మూడు రోజుల శిక్షణ శిభిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.డి సునీత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న నేటి సాంకేతిక పరిజ్ఞానంనకు అనుగుణంగా అధ్యాపకు లందరూ శిక్షణ పొంది ఉండాలనే ఉద్దేశ్యంతో డిసెంబర్ 18 తేది నుంచి 20 తేదీ మద్య మూడు రోజుల శిక్షణ శిభిరం ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిభిరం లో జెనెరటివే ఏఐ టూల్స్ ఫర్ ఎడ్యుకేటర్స్ అనే ప్రదాన అంశంతో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం లో మొత్తం 50 మంది అద్యాపకులు వివిద కళాశాలల నుండి హాజరైయ్యారని తెలిపారు. . ఈ శిభిరం నందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కి వాడే పాఠ్య ప్రణాళిక, కంటెంట్ సృష్టి, మూల్యాంకనం, పరిశోధన మద్దతుల గూర్చి వ్యక్తికతీకరించిన అభ్యాసం కోసం ఎ1 సాధనాలు ఎలా వాడ వచ్చో హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్ ద్వారా నేర్పిస్తారని తెలిపారు . ఈ కార్యక్రమానికి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డా.సి. హెచ్. కృష్ణ ముఖ్యఅతిదిగా ఆన్లైన్ లో హాజరై డిజిటల్ యుగంలో ప్రతి అధ్యాపకులు కృత్రిమ మేధ పై శిక్షణ పొందాలని కోరారు.ప్రత్యేక అతిధిగా డా.డి.చెన్నారావు,ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగ్గంపేట హాజరై మానవ సేవలకై కృత్రిమ మేధస్సు ఒక అద్భుతమైన వనరని దాన్ని సవ్యంగా ఉపయోగించుకొని ముందుకు సాగాలని తెలియ జేశారు. మరో అతిధి బసవరాజు అసోసియేట్ డైరెక్టర్ బ్లాక్ బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ మాట్లాడుతూ ఏఐ సాంకేతిక జ్ఞానం ప్రతి ఒక్కరికీ నేడు ఆవశ్యకంగా మారిందని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్స్ గా డా.ప్రయాగ మూర్తి ప్రగడ మరియు కె సురేశ్ వ్యవహరిస్తున్నారు. నారాయణ స్వామి, బ్లాక్ బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వేంకటేశ్వర రావు, అధ్యాపకులు వి.రామా రావు, డా.మదీనా, డా.శివ ప్రసాద్, శ్రీలక్ష్మి, వీరభద్ర రావు, డా.బంగార్రాజు, సతీశ్, మేరీ రోజలీనా, పుష్పా, రాజేష్ సత్యనారాయణ, ధర్మ రాజు,దివ్య, రామలక్ష్మి, కమల,కళావతి వివిద కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ

# ప్రధాన లక్ష్యం

**పల్నాడు, డిసెంబర్ 18, (మనసులో మాట):** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు.అచ్చంపేట మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించా రు.రైతులు తెచ్చిన ధాన్యం నాణ్యతను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసారు.రైతులు పండించిన ప్రతి ధాన్య గింజను ప్రభుత్వం న్యాయమైన మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని భరోసా రైతులకు ఇచ్చారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకం, తేమ శాతం, చెల్లింపుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## సిబిఈటి కి రెండు వాటర్ డిస్పెన్సర్స్ బహూకరణ



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 18:** కోరంగి అభయారణ్యంలోని కోరింగా ఎకో టూరిజం సిబ్బంది, పర్యాటకుల సౌకర్యార్థం చొల్లంగి యూనియన్ బ్యాంకు ప్రతినిధులు రెండు వాటర్ డిస్పెన్సర్స్ ను బహూకరించారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ సూచనలతో యూనియన్ బ్యాంకు చొల్లంగి బ్రాంచి మేనేజర్ డి. శ్రీనివాస్ వీటిని గురువారం కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సీబీఈటీ) సిబ్బందికి అందజేసారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ బిజిఆర్ నాయుడు, డిప్యూటీ రీజనల్ హెడ్ వి.కృష్ణమాచారి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులు రూ.18 వేలతో వీటిని కొనుగోలు చేసి ఫారెస్ట్ బీట్ అధికారులు సంధ్యారాణి, ధనలక్ష్మిలకు అందించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సిబ్బంది బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీ సోమును కలిసిన యెనిమిరెడ్డి

- ఈ నెల 23న రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేయనున్న యెనిమిరెడ్డి
- తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోమును ఆహ్వానించిన యెనిమిరెడ్డి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** యెనిమిరెడ్డి మలకొండయ్య ఎమ్మెల్సీ సోము వీర్రాజుని గురువారం మర్యాద పూర్వకంగా కలసి ఆశీర్వాదాలు పొందారు. ఇటీవలే ఆయనను రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించగా, ఈ నెల 23న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఆయన అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజుని మలకొండయ్య ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ “రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా యెనిమిరెడ్డి మలకొండయ్య నియామకం సంతోషకరమైన విషయం. గతంలో ఆయన ప్రజా సేవలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ ప్రశంసనీయం. ఈ బాధ్యతలో కూడా రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తూ సమర్థవంతంగా సేవలు అందిస్తారని నమ్మకం ఉంది. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నా ఆశీర్వాదాలు అందజేస్తాను” అని తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా యెనిమిరెడ్డి మలకొండయ్య మాట్లాడుతూ “నాపై విశ్వాసం ఉంచి ఆశీర్వదించిన సోము వీర్రాజుకి హృదయపూర్వక కృతజ్ఞతలు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రభుత్వం, పార్టీ ఆశయాలకు అనుగుణంగా, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిజాయితీతో సేవలు అందిస్తాను” అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు దిలీప్ కుమార్ సధనని, స్టేట్ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయినవిల్లి ఎస్ఐగా జ్యోతి



**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 18 :** అయినవిల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా కే జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా చెందిన జ్యోతి 2024 బ్యాచ్ లో ట్రైనింగ్ పొంది అయినవిల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన హరికోట శాస్త్రిని జిల్లా అధికారులు వి ఆర్ కు పంపారు. అయినవిల్లి మండలంలో ట్రాఫిక్ నియంత్రణ ,అవాంఛనీయ సంఘటనకు తావు లేకుండా పూర్తిస్థాయిలో కంట్రోల్ చేస్తానని ఆమె తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు..

**- హర్షం వ్యక్తం చేసిన మండపాక సుబ్బు**

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించడం పట్ల నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి గురువారం పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఆంధ్రప్రదేశ్‌కు కూడా గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్కరణలు, పాలనా వేగంపై ఉన్న నమ్మకానికి ఈ అవార్డు ఒక నిదర్శనమని అన్నారు. చంద్రబాబు దార్శనికతకు, ఆయన అమలు చేసిన సంస్కరణలకు జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు.

# అంగర లో వైజ్ఞానిక ప్రదర్శన





**కపిలేశ్వరపురం (మనసులో మాట) డిసెంబర్ 18..** కపిలేశ్వరపురం మండలం అంగర జడ్పీ ఉన్నత పాఠశాల లో గురువారం మండల స్థాయి లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యా శాఖాఅధికారి కే. తాతారావు ప్రారంభించారు. మండల స్థాయి లో పలు పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన పలు పలు ప్రయోగాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఈ ప్రయోగాల్లో 7 అంశాలులో మొదటి బహుమతి పొందినవారు. వాటిలో ముఖ్యం గా ఎమర్జింగ్ టెక్నాలజీ ప్రయోగాన్ని, గ్రీన్ ఎనర్జీ, హెల్త్ అండ్ ఐజిన్ ను, రీ క్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్ ప్రయోగం, సస్టేనేబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్మెంట్ ఆల్టర్నేటివ్ టు ప్లాస్టిక్స్, వాటర్ కన్వర్జేషన్ తదితర ప్రయోగాలను మండల స్థాయి లో పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు రూపొందించిన వాటిని ఎంపిక చేసి, వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. మండల విద్యాశాఖాధికారి కె.తాతారావు, సెకండ్ ఎం.ఈ. ఓ.కె.విజయ్ కుమార్ మండల స్థాయి పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా రుద్రాభి షేకం



**ముమ్మిడివరం(మనసులో మాట) డిసెంబరు 18:** ముమ్మిడివరం శ్రీ ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో గురువారం మార్గశిర-ధనుర్మాసం మాసశివరాత్రి రోజును పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆధ్వర్యంలో ఆలయ ప్రదక్షణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, మహన్యాసం, శ్రీ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ, రుద్ర హెూమం, అలాగే సూర్య నమస్కారములు, నవగ్రహ అర్చనలు, హెూమాలు, ధూప సేవ, శాంతి కళ్యాణం, స్వస్తి, మహదాశీర్వచనం, పండిత సత్కారం, మహా అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు



# ప్రజాదర్బార్ లో పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య



**కోటనందూరు (మనసులో మాట) డిసెంబర్ 18..** కోటనందూరు మండలం కాకరాపల్లి లో ప్రభుత్వ విప్ యనమల దివ్య నిర్వహించిన ప్రజాదర్బార్ కు విశేష స్పందన లభించింది. అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజా దర్బార్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే యనమల దివ్య చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. శాఖా పరమైన సమస్యలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సమస్యల చిక్కుముడి విప్పి పరిష్కరించిన ప్రభుత్వ విప్ యనమల దివ్య కు కాకరాపల్లి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు, పోతల సూరిబాబు, అంకంరెడ్డి రమేష్, పెనుమచ్చ నాగేశ్వరరావు, వెలగా వెంకట కృష్ణారావు, దంతులూరి చిరంజీవి రాజు బంటుపల్లి వెంకటేశ్వర రావు, సామినీడు కృష్ణార్జునులు, వాసం నాగేశ్వరరావు, కనిగిరి త్రిమూర్తులు, షేక్ నవాబ్ జానీ, పెనుమచ్చ ప్రవీణ్, పెదపాత్రుని శ్రీనివాస్, అంకారెడ్డి రాజశేషు, సుర్ల సావిత్రి, అంకంరెడ్డి బుల్లిబాబు, బోడపాటి సత్యనారాయణ, నెమ్మాది సత్యనారాయణ, గంటా అమ్మాజీ, బైలపూడి శ్రీరామ్మూర్తి, ఎర్రా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఈట్ స్ట్రీట్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

**- కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** కాకినాడ నగరంలోని ఈట్ స్ట్రీట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం ఆయన ఈట్ స్ట్రీట్‌ను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈట్ స్ట్రీట్‌కు సంబంధించిన వ్యాపారస్తులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఇంచార్జ్ కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. డ్రైనేజ్ ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం కల్పించడం, సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని,అలాగే ఆదివారం రోజున ఈట్ స్ట్రీట్‌లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. వ్యాపారస్తుల సమస్యలపై ఇంచార్జ్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈట్ స్ట్రీట్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, ఈఈ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక బాట

**- ఇది చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య - మెడికల్ కళాశాలలో పిపిపి రద్దు చేసే వరకు సీపీఐ ఉద్యమం ఆగదు**

**- అప్పులు ప్రజలకా? సంపద కార్పొరేట్ వ్యక్తులకా - మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ కాకినాడలో సీపీఐ ధర్నా**




**కాకినాడ(మనసులో మాట) డిసెంబరు 18:** ఎన్నికల ముందు టి డి పి అధినేతలు నారా చంద్రబాబు నాయుడు , నారా లోకేష్ లు మెడికల్ కాలేజీ సీట్లు పై అనేక మాటలు ప్రజలకి చెప్పారని జగన్ మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నారని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆరోపించారని నేడు అధికారం లోకి రాగానే మొత్తం మెడికల్ కాలేజీలనే అమ్మి వేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు ఆక్షేపించారు .గురువారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మెడికల్ కళాశాల ల ప్రవేటు కరణ ను నిరసిస్తూ సీపీఐ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటుచేసే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించు కోవాలని ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) విధానంలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం: 590 తక్షణమే ఉపసంహరించు కోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలు మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాలలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) విధానంలో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ ఆపాలి వైద్య విద్య కళాశాలలను పిపిపి విధానంలో ఏర్పాటు చేయడం ద్వారా 3,700 కోట్ల రూపాయలు అభివృద్ధి ఖర్చు, ఏటా రూ.500 కోట్ల రూపాయలు నిర్వహణావ్యయం ఆదా అవుతుందంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవానికి ఈ విధానం దీర్ఘకాలికంగా రాష్ట్రానికి నష్టం కలిగిస్తుంది. సుమారు 60 ఏళ్లపాటు ప్రభుత్వ భూమి,వనరులు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లి, వారికి ఆదాయవనరులుగా మారతాయి. వైద్య విద్య పూర్తిగా వ్యాపార పరమవుతుంది. మేనేజ్మెంట్ కోటా ద్వారా ఇచ్చే 25 శాతం సీట్లు (375) ఒక్కో సీటుకు దాదాపు 50 నుండి 60 లక్షల వరకు వసూలు చేసే అవకాశం ఉంది. ఈ అధిక ఫీజు కారణంగా పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు పూర్తిగా దూరమవుతారు. ప్రైవేటు సంస్థల లాభాపేక్ష వల్ల వైద్య సేవల్లో నాణ్యత తగ్గడంతోపాటు, పేదవారికి ఉచిత వైద్య సేవలు అందని ద్రాక్షగా మారతాయని విమర్శించారు. పిపిపి విధానం కారణంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యు ఎస్ వర్గాలు సుమారు 55 శాతం వైద్య విద్య సీట్లను కోల్పోవడమే కాకుండా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు రిజర్వేషన్ వర్తించేటువంటి 3,675 ప్రభుత్వ ఉద్యోగాలను కోల్పోయే పరిస్థితి ఎదురవుతుంది. నాబార్డ్ నిధులను వినియోగించి నిర్మించే వైద్య విద్య కళాశాలలను పిపిపి విధానంలో కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా కట్టబెట్టడంనీ ఉపసంహరించుకోవాలి. విద్య, వైద్యం అనేవి ప్రభుత్వ ఆధీనంలో కొనసాగితేనే ప్రజలకు మేలు జరుగుతుంది, పేదల ఆరోగ్య సంరక్షణపట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా స్పందించి తక్షణమే జివో నెం. 590 రద్దు చేయాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్షిప్ పేరుతో కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించే ప్రక్రియను రద్దు చేయాలి. రాష్ట్రంలోని పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు మేలుచేకూర్చేలా 10 నూతన మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాక రామకృష్ణ , ఏఐటీయూసీ నాయకులు రామయ్య, అనిల్, మధు కాట్ రాజు, కిషోర్ శ్రీను ఆనందరావు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పద్మ అక్క, ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబీ, జిల్లా సమితి సభ్యులు పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

# మేధాసంపత్తికి విద్యార్థులు పదును పెట్టాలి...

**జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన.**





**ఐ. పోలవరం, ( మనసులో మాట) డిసెంబర్ 18..** జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ద్వారా విద్యార్థులు మేధాసంపత్తికి పదును పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జడ్పీహెచ్ఎస్ జి. వేమవరం ఐ. పోలవరం మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు జిల్లా విద్యాశాఖ అధికారి పి నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి జి సుబ్రమణ్యం డి.సి.బి సెక్రెటరీ బి. హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారీ నల్లమిల్లి కొండారెడ్డి మండల విద్యాశాఖ అధికారి. 2 వీధి సురేష్ బాబు , జి. వేమవరం గ్రామ సొసైటీ అధ్యక్షులు పెంట రవి ప్రసాద్, గ్రామ సర్పంచ్ నల్ల సుదర్శన్ రావు ఎంపీటీసీ సభ్యులు చోడిశెట్టి జ్యోతి నాయుడు గారుపాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బసవ అప్పారావు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు వారణా సుభద్ర లక్ష్మీదేవి, మండల సైన్స్ ఆఫీసర్ వరద శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంనకు మండలం లోని 11 ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల నుండి విద్యార్థులు సుమారుగా 100 ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగినది. ప్రదర్శించిన ప్రాజెక్టులో థీమ్ లవారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించడం జరిగినది. మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంనకు న్యాయం నేతలుగా కీర్తిశేషులు వేగిరాజు వెంకట నారాయణ జూనియర్ కాలేజ్ ఐ పోలవరం లో పి. వెంకటేశ్వరరావు ధనలక్ష్మి న్యాయ నేతలుగా వ్యవహరించడం జరిగినది. అనంతరం జి మూల పాలెం జడ్పీ హైస్కూల్ను విద్యాశాఖ అధికారులు సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ప్రగతిని విద్యా ప్రమాణాలు గురించి అడిగి తెలుసుకున్నారు. 100 రోజులు యాక్షన్ ప్లాన్ అమలు పర్యవేక్షించారు. పదో తరగతి విద్యార్థులకు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతకు సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీ ఎస్ జి మూలపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజన పథకం రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు 75 రోజులు జిఎఫ్ఎల్ ఎన్ యాక్షన్ ప్లాన్ అమలు ను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని అందుకోసం అవసరమైన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు.




**జీవనోపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లే వారికి చట్టబద్ధమైన సురక్షిత**

# ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేస్తాం

**- డిఆర్ఓ మాధవి**

**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 18:** స్థానికంగా సరైన జీవనోపాధి అవ కాశాలు లభించక, మెరుగైన ఉపాధి కోసం, వివిధ కారణాల మూలంగా తమ స్వస్థలాలను వదిలి ఇతర దేశాలకు వెళ్లే వారికి చట్టబద్ధమైన సురక్షిత ఉపాధిని కల్పించేందుకు పూర్తి చర్యలు చేపడతామని డిఆర్ఓ కోనసీమ మైగ్రేషన్ అధికారిని కె మాధవి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నందు అంతర్జా తీయ వలస దారుల దినోత్స వాన్ని సిబ్బందితో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లభించక వెళ్లి తమ కుటుం బాలను పోషించుకోదలచిన వారికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కోనసీమ వలసదారుల కేంద్రం ఒక దిక్సూచిగా నిలిచి విదేశాలలో చట్టబద్ధమైన సురక్షిత ఉపాధిని కల్పించేందుకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. వలసలు వెళ్ళదలచిన వారు తప్పని సరిగా ఈ కేంద్రాన్ని సంప్రదిస్తే విదేశాలలో సుస్థిర జీవనోపా దులు కల్పనకు మార్గ నిర్దేశం చేస్తుందన్నారు.మెరుగైన ఉపాధి కోసం, ఇతర కారణాల వల్ల తమ స్వస్థలాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి హక్కులను రక్షించడం కోసం ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ వలస కార్మికులు వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణ"పై అంతర్జాతీయ ఒడంబడికను ఆమోదించిందన్నారు.వలసదారుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో 2000 డిసెంబర్ 4న ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలస దారుల దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిందన్నారు వలసదారులు ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీ , మానవ హక్కుల ఉల్లంఘనల గురించి ప్ర పంచ దేశాలను అప్రమత్తం చేస్తూ. ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో, సంస్కృతి లో సామాజిక మార్పులో వలస దారులు పోషిస్తున్న కీలక పాత్రను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ 2025 సంవ త్సరానికి గాను సంస్కృతులు అభివృద్ధి అనే ఇతివృత్తాన్ని ప్రాధాన్యతగా తీసుకొని ఆ దిశగా విస్తృత అవగాహనను పెంపొందించామన్నారు. వలసదారుల ప్రయాణాలు కేవలం కదలికలు మాత్రమే కాదని, అవి వివిధ సంస్కృతుల కలయికకు, అభివృద్ధికి దారితీసే గొప్ప కథలను ఈ దినోత్సవం తెలియజేస్తుందన్నారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్య లో ప్రజలు వలసదారులుగా జీవిస్తున్నారన్నారు. వలసదా రులు ఎక్కడ ఉన్నా వారికి గౌర వం సమాన హక్కులు లభించడం నాగరిక సమాజం యొక్క బాధ్యత అన్నారు వలస అనేది కేవలం ప్రయాణం కాదని అది వలసదారుల ఆశ, ధైర్యం, కొత్త జీవనానికి వేసే ముందు అడుగు అన్నారు. ప్రపంచాన్ని ముందుకు నడిపించే వారి శ్రమను గుర్తిస్తూ ప్రతి వలసదా రుడికి గౌరవం, భద్రత, సమాన అవకాశాలు అందాలని ఆమె అభిలాషించారు. వలసదారులు తమ కృషి, ప్రతిభతో స్వదేశానికి విలువైన విదేశీ మారకద్రవ్యాల ను అందించడమే కాకుండా, దేశ గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పెంపొందిస్తున్నారన్నారు. వలసదారుల హక్కుల పరి రక్షణకు, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సమాజంలోని ప్రతి ఒక్కరి మద్దతుతో విజయ వంతం కావాలన్నారు. ఆత్మా భిమానాన్ని,సాంస్కృతిక మూలా లను కాపాడుకుంటూ, తమ స్వదేశ అభివృద్ధికి చేయూతనిస్తూ ముందుకు సాగే వలస దారులందరికీ ఈ దినం ప్రేరణాత్మకంగా నిలుస్తుంద న్నారు.వలసదారుల శ్రమ, త్యాగం, ప్రతిభ దేశఆర్థికా భివృద్ధికి మూల స్తంభాలనీ. వారికి శుభాకాంక్షలు తెలియ జేస్తూ, వారు ఎక్కడ ఉన్నా మన భారతీయ సమాజపు విలువలను ప్రతిబింబించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేసీఎం మేనేజర్ గోళ్ళ రమేష్, రెవెన్యూ సిబ్బంది కే సీఎం సిబ్బంది సఫియా దుర్గా సత్తిబాబు పాల్గొ న్నారు.

# పర్యవరణ పరిరక్షణకు చిన్నారుల కృషి



**అనపర్తి (మనసులో మాట) డిసెంబర్ 18:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు గ్రామంలో పర్యవరణ పరిరక్షణ చిన్నారులు కృషి చేశారని, ఏజీఎస్ ఐటీసీ వావ్ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ఎస్ ఆనందరావు అన్నారు. గురువారం మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని విద్యార్థులు, పర్యావరణ పరిరక్షణ తమ వంతు సాయం మందించాడనికి వారు సేకరించిన పాత పేపర్లు, పనికిరాని వస్తువులను ఏజిఎస్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ ఒక టన్ను పేపరు తయారు కావాలంటే 17 చెట్లు అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ రీసైక్లింగ్ కు సహకరిస్తే చెట్లు కాపాడుకోవచ్చన్నారు. అనంతరం కొమరిపాలెంలో సుమారు ఒక టన్ను వరకు విద్యార్థులు పేపర్లు సేకరించారు. అనంతరం వివిధ అంశాల్లో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోని కొమరిపాలెం శ్రీరామ ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ కర్రి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు నగదు, పుస్తకాల బహూకరణ

**- కాపునాడు ఆధ్వర్యంలో..**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** రాజమహేంద్రవరం నగరంలోని ఇరువురు విద్యార్థినులకు విద్యాభ్యాసం నిమిత్తం ప్రోత్సాహకంగా 'కాపునాడు' ఆధ్వర్యంలో నగదు, పుస్తకాలు బహూకరించారు. స్థానిక 49 వ వార్డు సుబ్బారావు నగర్ రామాలయం వీధిలో మూడవ తరగతి, ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు ముచ్చర్ల శివన్య, ముచ్చర్ల వాత్సల్యకు కాపునాడు అధ్యక్షుడు గుదే రఘు నరేష్, కార్యవర్గం నగదు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా గుదే రఘు నరేష్ మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు. మీరు బాగా చదువుకుంటే తాము మరింత ప్రోత్సహిస్తామని అన్నారు. కాపునాడు గౌరవ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావు సౌజన్యంతో విద్యార్థినులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపునాడు నాయకులు ముమ్మిడి వీరబాబు, దేశినీడి రాంబాబు, పిల్లా దుర్గాప్రసాద్, ర్యాలీ రామకృష్ణ, సోడా సాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏసీబీ డిఎస్పి గా కృష్ణారావు

**ఏలూరు,డిశంబరు,18: (మనసులో మాట)..** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) డీఎస్పీగా జి.వి. కృష్ణారావు ది.17.12.2025 ఏలూరు లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1991 బ్యాచ్ ఎస్ఐ గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో పనిచేశారు. తదనంతరం పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, పెరవలి పోలీస్ స్టేషన్లో పనిచేశారు. తరువాత సిఐగా పదోన్నతి పొంది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు, ఏలూరు ఇంటెలిజెన్స్ ఆఫీసులో,జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరోలోపనిచేశారు. 2020 సంవత్సరంలో డిఎస్పీగా పదోన్నతి పొంది ఏలూరు ఇంటెలిజెన్స్ ఆఫీసులో డిఎస్పీగా పనిచేసి తరువాత పాలకొండ SDPO గా, APSP 8th బెటాలియన్ లో DSP గాపనిచేసి అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) డీఎస్పీగా, ఏలూరు కార్యాలయములో బాధ్యతలు స్వీకరించినారు. అవినీతి సమాచారం పై ప్రజలు నిర్భయముగా ఫోన్ ద్వారా కానీ, ఆఫీసుకు వచ్చిగాని తెలియజేయవచ్చని కోరినారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1064 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని అంతే కాకుండా DSP మొబైల్ నెంబర్ 9440441657 కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతాము అని తెలియజేసినారు.

## రైల్వే అధికారులను కలిసిన కోనసీమ జేఏసి కన్వీనర్ బండారు రామమోహన్ రావు



**అమలాపురం( మనసులో మాట) డిసెంబర్ 18:** కోనసీమ ప్రజల చిరకాల కోరిక కోటిపల్లి -నరసాపురం రైల్వే నిర్మాణం. ప్రస్తుతం రైల్వే నిర్మాణ పనులు జరగకపోవడంతో కోనసీమ జేఏసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .ఈ సందర్భంగా కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహన్ రావు గురువారం గుంటూరు లో రైల్వే డిప్యూటీ సీఈ(కన్స్ట్రక్షన్) కార్యాలయం ను సందర్శించి కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ ప్రగతి పై ఆరా తీశారు.గత సంత్సరకాలంగా ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి ఎటువంటి పనులు జరగకపోవడం పై ఆందోళన వ్యక్తం చేశారు.కోటిపల్లి - నర్సాపురం ప్రాజెక్ట్ సంబంధిత అధికారి గోవిందు స్పందిస్తూ..కన్వీనర్ అడిగిన అంశాలకు సంబంధించి ఈ క్రింది విధంగా వివరణ ఇచ్చారు. కోటిపల్లి గౌతమీ నది పిల్లర్స్ పై గడ్డర్లు వేయడానికి టెండర్ దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు, రైల్వేవర్గాలు మధ్య కోర్టు కేసు నడుస్తున్న కారణంగా అక్కడ పనులు ప్రారంభంకాలేదు. అక్కడ గడ్డర్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ఇంకా కొంత సమయం పడుతుందన్నారు. దిండి వశిష్ఠ నది వద్ద మునిగిపోయిన ఒక పిల్లర్ ను నిలబెట్టే పనులు లేదా ప్రత్యామ్నాయ పనులు సంక్రాంతి తర్వాత ప్రారంభం అవుతాయని, బోడసకుర్రు వైనతేయ,చించినాడ వశిష్ఠ నదుల పిల్లర్స్ పై వేసే గడ్డర్లు నిర్మాణ పనులు ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల రైల్వే వర్క్ షాప్ లో ప్రారంభం అయ్యాయన్నారు. రైల్వే ట్రాక్ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి ఎప్పుడు భూమిని రైల్వే శాఅప్పగిస్తే అప్పటినుండు పనులు ప్రారంభం చేయడానికి రైల్వే వర్గాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## మీసాల వెంకన్నకు భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



**యానాం (మనసులో మాట), డిసెంబరు 18:** కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి లక్ష తులసి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ, సాలిగ్రామ అభిషేకము లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, మండపారాధన, స్వామి వారి మూల విరాట్కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. అనంతరం నీరాజనం మంత్రపుష్పం, ప్రసాద వితరణ, లక్ష తులసి పూజ, కుంకుమార్చన, గంగా సింధూర అర్చన, నిర్వహించి తదనంతరం పూర్ణాహుతి, శాంతి కళ్యాణము అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో ఈ పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ ఆచార్యులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

# ఏలూరు జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన సీఎం





**ఏలూరు, డిసెంబర్, 18 :(మనసులో మాట)** ఒక్కరోజులోనే 22ఎ భూ సమస్యలకు సంబంధించి 1147 దరఖాస్తులను పరిష్కరించి, 142. 04 ఎకరాల భూమిని 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించదానికి తీసుకున్న చర్యలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, అందుకు కృషి చేసిన జిల్లా యంత్రాగాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన మంగళవారం రెండో రోజు జిల్లా కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర పౌర సరఫరాలు శాఖ, మరియు ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ఏలూరు లో 22ఎ భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన 'మెగా 22ఎ భూ సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అందిన 1199 ధరఖాస్తులలో అదేరోజు 1147 దరఖాస్తులకు సంబందించిన భూ రికార్డులను పరిష్కరించి 142. 04 ఎకరాల భూములను 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించడం జరిగిందని ముఖ్యమంత్రికి తెలియజేసారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఏలూరు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలలో 22ఎ భూ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్, ఏలూరు జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యాన్ని అరికట్టి, నాటుసారా రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను రూపొందించేందుకు తీసుకున్న చర్యలను సవివరంగా ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలోని 15 మండలాలలోని 140 గ్రామాలలో నాటుసారా, అక్రమమద్యం తయారీని గుర్తించి , నాటు సారా, అక్రమ మద్యం తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపి, అక్రమ మద్యం సరఫరాను కట్టడి చేయడంతోపాటు, ఏలూరు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా రూపొందించామన్నారు. నాటుసారా ను అరికట్టడమే కాకుండా, నాటుసారా తయారీదారులు మరల అక్రమ మద్యం తయారీ జోలికి వెళ్లకుండా వారికి 'నవోదయం..' 'మార్పు' కార్యక్రమాల ద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధికి వారికి స్వయం ఉపాధికి రుణాలు అందజేసామని, అంతేకాక మహిళలలకు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి, వారికి కూడా రుణాలు అందించి చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు, పాడిపశువుల పెంపకం వంటి యూనిట్ల ఏర్పాటుచేసి, వారికాళ్లపై వారు నిలబడే విధంగా పునరావాస చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, చేయూతతో జిల్లాలో ఎక్కడా కూడా అక్రమ మద్యం, నాటు సారా తయారీదార్లు వాటి జోలికి వెళ్లకుండా గౌరప్రదమైన జీవితం సాగిస్తున్నారని తెలిపారు. సమస్య మూల కారణాన్ని తొలగించేందుకు, సమస్య మళ్ళీ తలెత్తకుండా ఉండేలా జిల్లా యంత్రాంగం తీసుకుని చర్యలతో సత్ఫలితాలను సాధించామని కలెక్టర్ ముఖ్యమంత్రికి తెలియజేసారు. అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి లపై ఉక్కుపాదం మోపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయానికి తగినవిధంగా ఏలూరు జిల్లా లో యంత్రాంగం తీసుకున్న చర్యలు మంచి సత్ఫలితాలను ఇచ్చాయని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ని ముఖ్యమంత్రి అభినందించారు.

### కొల్లేరు అభయఅరణ్య భూములు హద్దులు నిర్ధారణ (ఉమ్మడి తనిఖీ) పురోగతిపై

# మంచి ఫలితాలు సాధించాలి





**ఏలూరు, డిసెంబరు 18:(మనసులో మాట)..** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో గురువారం కొల్లేరు అభయ అరణ్య భూములు హద్దులు నిర్ధారణ (ఉమ్మడి తనిఖీపై) అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, సర్వే విభాగాలు, పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం కొల్లేరు గ్రామాలు సంఖ్య 55 ఉమ్మడి తనిఖీపై గ్రామాల వారీగా సుదీర్ఘంగా జిల్లా జాయింటు కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ కొల్లేరు అభయ అరణ్యపరిధి ఏలూరు జిల్లాలో 8 మండలాలు, పశ్చిమగోదావరి జిల్లా 1 మండలం మొత్తం 09 గ్రామాల్లో మొత్తం 55 గ్రామాలలో 77 వేల ఎకరాలు భూమి ఉందని అన్నారు. కొల్లేరు ఉమ్మడి తనిఖీ హద్దులు నిర్ధారణ అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, సర్వే విభాగాలు, సంబంధిత శాఖలు పురోగతిపై మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. మొత్తం కొల్లేరు గ్రామాలు సంఖ్య 55 ఉమ్మడి తనిఖీ హద్దులు నిర్ధారణ చేయవలసి ఉండగా 44 గ్రామాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 11 గ్రామాలు 20 రోజుల్లో పూర్తి చెయ్యాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు పాత మ్యాప్ ప్రకారం అభయ అరణ్య పరిధి సరిహద్దులు నిర్ధారణ గుర్తించుట జరుగుతుందని అన్నారు. నిబంధనల ననుసరించి కొల్లేరు హద్దులు నిర్ధారణ (ఉమ్మడి తనిఖీకి) పూర్తి చెయ్యాలన్నారు.

### ఈ నెల 20 తేదినజిల్లా లోని ప్రతి గ్రామంలో

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించండి

### - అధికారులను ఆదేశించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** కాకినాడ జిల్లాలో ఈ నెల 20 తేది న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర -స్వఛ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 3వ శనివారం, డిసెంబర్ 20 తేది న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల పర్యావరణంలో అవకాశాలు -స్వయం ఉపాధి, వ్యవస్థాపకత పర్యావరణ రంగాలలో అవకాశాలు అనే థీమ్ తో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా అంతట నిర్వహించాలని ఆయన ఆదేశించారు.


స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం సంబంధించి ముందు రోజు శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాం టాం, మైక్ అనౌన్స్మెంట్ లు ద్వారా ప్రచారం చేయించి, శనివారం రోజున ఏ జరిగే కార్యక్రమాల ప్రదేశాల వివరాలు ప్రజలందరూ అందరికీ తెలిసేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో శుభ్రపరచడం చేయాలని, వేస్ట్ కు సంబంధించిన వస్తువులను సేకరించి ఒక చోట ఉంచాలన్నారు. అన్ని మేజర్ హెడ్ క్వార్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలు సంస్థలు మరియు ప్రజల నుండి వేస్టును సేకరించాలన్నారు.

పర్యావరణంలో అవకాశాలు స్వయం ఉపాధి వ్యవస్థాపకత పర్యావరణ రంగాలలో అవకాశాలు అనే థీమ్ పోస్టర్ లను జన సమర్థం గల ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు వివిధ సంస్థలు ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పెంచుకోవడమే కాకుండా తమ బాధ్యతగా స్వీకరించి ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణకై క ృషి చేయవలెను. వెస్ట్ వల్ల ఆరోగ్యం పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. వెస్ట్ కు సంబంధించిన ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు మానవహారం ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రతి స్వర్ణాంధ్ర -స్వఛ్ఛ ఆంధ్ర డిసెంబర్ నెల థీమ్ పై ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలన్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ద ృష్టి సారించాయన్నారు. ఈనెల 20 వ తేదీన జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛతే కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు ప్రభుత్వ వసతి గ ృహాలు పరిశ్రమలు ఆర్టీసీ బస్టాండ్ మార్కెట్ యార్డు రైతు బజార్లు దేవాలయాలు పర్యాటక ప్రాంతాలు ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాల ద్వారా పర్యావరణానికి , ప్రజలకు కలిగే మేలు పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టే ఈ కార్యక్రమాలను ఆన్ లైన్ లో పొందు పరచాలన్నారు. వారు నిర్వహించే కార్యక్రమాలకు ఫోటోలు తీసి స్వచ్ఛాంధ్ర వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయిలోనూ పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. శ్రద్ధతో నిక్కచ్చిగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు.

# నూతన ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసిన జనసైనికులు



**పల్నాడు,డిసెంబర్ 16, (మనసులో మాట):** బెల్లంకొండ మండలంలో నూతన ఎస్సై పి గోపిని జనసైనికులు ఎస్సై కి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎస్సై ని కలిసిన వారిలో పగడాల కన్స్ట్రక్షన్స్ చైర్మన్ పగడాల శ్రీనివాస్, నామాల బ్రహ్మ నాయుడు, బైసు వెంకట్రావు, సయ్యద్ సుభాని, సయ్యద్ అల్లా బక్షు, సయ్యద్ సైపుల్ల, సయ్యద్ మౌలాలి, మందలనేని వెంకటేశ్వరరావు, బిట్రగుంట నరేష్, గాండ్ల పూర్ణచంద్రరావు, ముల్లా శీను ఉన్నారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించేలా సహకారం అందిస్తామని ఎస్సై సూచించారు.



### సొంత స్థలాల్లో బిల్డింగ్ లు, మున్సిపాలిటీ స్థలాల్లో

# విద్యుత్ టాన్స్ ఫార్మర్లు

- **శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానం పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయానికి మూల కారణం రోడ్డుపై అమర్చిన ట్రాన్స్ ఫార్మర్ లే.**
- **సొంత స్థలంలో ఇంచు కూడా వదలకుండా రోడ్డుపై అడ్డంగా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారంటూ సిపిఐ నేతల ఆందోళన**

**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబర్ 18:** సాధారణ విద్యుత్ వినియోగదారుడికి నూతన కనెక్షన్ మంజూరు చేయాలంటే విద్యుత్ శాఖ అధికారులు ఎన్నో తిప్పలు పెడుతున్నారని అలా కాకుండా కాసులు ముట్ట చెప్పితే రూల్స్ అన్ని బ్రేక్ చేస్తారంటూ సిపిఐ పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి సాక రామకృష్ణ ఆరోపించారు. పిఠాపురం పట్టణంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానం వద్ద పదుల సంఖ్యలో భవంతులు మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం లోని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారన్నారు. తమ సొంత స్థలంలో ఉండవలసిన ప్రైవేటు భవంతుల ట్రాన్స్ఫార్మర్లు మున్సిపల్ స్థలంలో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల ఆ ప్రాంగణంలో తరచు ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం పరిసర ప్రాంతాలలో రోడ్లపై ఉన్న ట్రాన్స్ఫార్మర్లను తక్షణమే తొలగించి ఎవరైతే భవన యజమానులు ఉన్నారో వారి ప్రాంతాలలోనే అమర్చేలా చర్యలు తీసుకోవాలని పిఠాపురం విద్యుత్ శాఖ అధికారులకు సాకా రామకృష్ణ గురువారం ఫిర్యాదు చేశారు. పౌరులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆయా ప్రాంతాల్లో చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అధికారులు డిమాండ్ చేసినట్లు తెలిపారు.

### మొండి బకాయిదారులపై

# మున్సిపల్ అధికారులు కొరడా

- **పదులు ఏళ్లగా పన్ను చెల్లించకుండా ఉన్న పలు మంచినీటి కొళాయిల కనెక్షన్లు తొలగింపు**
- **పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలంటూ పలుమార్లు ప్రకటనలు జారీ చేసిన ఉపయోగం లేకపోవడంతో విసుగెత్తిన అధికారులు**



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 18 :** పురపాలక సంఘ కార్యాలయానికి చెల్లించవలసిన ఇంటి పన్నులు కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, షాపు రెంటల్స్ చెల్లించవలసిన మొండి బకాయిదారులపై మున్సిపల్ అధికారులు కొరడా జులిపిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, చెల్లించలేని బకాయి దారుల ఇంటి కుళాయిలు కట్ చేస్తున్నారు. మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో బకాయిదారులైన క్రిస్టియన్ మెడికల్ సెంటర్ సిఎంసి ఆసుపత్రి వారు3.5 కోట్లు, షుగర్ ఫ్యాక్టరీ వారు 2.14 కోట్లు బకాయిలు ఉండడంతో వారికి ఆక్యుఫెన్సీ నోటీసు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారి వైవి మోహనరంగా తెలిపారు. మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పిఠాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో మొండి బకాయి దారుల ఇంటి కుళాయిలు కట్ చేశారు. మున్సిపల్ కమిషనర్ బి రాజు సూచన మేరకు బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేసి స్పందించిన వారిపై కొరడా జులిపిస్తూ ఆదేశాలు అందజేశారు. నవంబర్ డిసెంబర్ నెలలో ఖాళీ స్థలం పన్నులు 25 లక్షలు, ఇంటి పన్నులు 79 లక్షలు, షాపు అద్దిబకాయిలు 47 లక్షలు, కుళాయి పన్నులు 85 లక్షలు, వసూలు చేసినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి చెల్లించవలసిన అన్ని రకాల బకాయిలు తక్షణం చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. బకాయిలు చెల్లించ లేని వారి కుళాయిలు తొలగించే కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ బి తిరుమల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎన్నో సంవత్సరాల కళ - రైతులు, గ్రామస్తులు హర్షం

### కలవర్ట్ పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు



**ఎటపాక (మనసులో మాట ), డిసెంబరు 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని మురుమూరు గ్రామంలో మండల పరిషత్ నిధులతో మంజూరైన కల్వర్టు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎన్నో సంవత్సరాల నుండి రైతులు గ్రామస్తులు పొలాలకు వెళ్లాలంటే మోకాటిలోకి బురదలో వెళ్లే వాళ్ళమని అయితే గత ప్రభుత్వం లో నాయకులకు ఎన్నో సార్లు మొరపెట్టుకున్న పటించుకోలేదు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపీటీసీ గా పోటీచేసిన టీడీపీ నాయకుడు ప్రస్తుత వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు తమ గ్రామానికి వచ్చి ఎన్నికల్లో గెలిపించిన మరుక్షణమే రైతుల ఇబ్బందులను అలాగే కలవర్ట్ పనులను పూర్తి చేస్తాను అని హామీ ఇచ్చారు. మాట మరవకుండా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే పట్టుబట్టి మండల పరిషత్ నిధులతో వంతెన మంజూరు చేసి తానే స్వయంగా దగ్గరుండి పనులను పరిశీలించుతున్నారు. రైతులు తాము పండించిన ధాన్యన్ని కిలోమీటర్లు మేర మోసుకుంటూ వెళ్ళేవాళ్ళమని కానీ ఇప్పుడు ఏ కష్టం లేకుండా పొలం గట్టువద్దకే నేరుగా వెళ్ళగలుగుతామణి వారియొక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు. వైస్ఎంపీపీ ఆధ్వర్యంలో తమ కళ నెరవేరినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెనుబల్లి సూర్యనారాయణ, సర్పంచ్ పాయం నాగమణి, విద్యా కమిటీ చైర్మన్ కొత్తపల్లి రమేష్, పడాల సత్యనారాయణ, సూరిబాబు, రాంబాబు, వెంకటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.



## 45 వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్

### సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు

కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18.. ఇటీవల గుంటూరు జిల్లాలోని పెద నందిపాడు మండలం పల్లపర్రు ఎన్. ఎస్. ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఈ నెల 13 14 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో యాతం నాగబాబు ఘనవిజయం సాధించాడు. ఈ గ్రౌండ్ నందు జరిగిన 45వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ 2025 లో పాల్గొని కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం నకు చెందిన యాతం నాగబాబు ని కాకినాడ జిల్లా కలెక్టరు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఎ. శ్రీవిద్య గురువారం అభినందించారు. పరుగు పందెం పోటీల నందు పాల్గొని 100 మీటర్లు(1వ స్థానం) బంగారు పతకం మరియు %200 800 మీటర్లు (2వ స్థానం) వెండి పతకం 1500 మీటర్ల్ లో (1వ స్థానం)పరుగు పందెం బంగారు పతకం, విభాగాల నందు పాల్గొని 2 బంగారు పతకాలు 1 వెండి పతకం సాధించితిని 2026 ఫిబ్రవరి 13 తేదీ నుండి 2026 సంవత్సరం ఫిబ్రవరి 15 తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జబల్పూర్ వద్ద జరుగు 45 జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ కి ఎంపికయ్యాను. నాగబాబు ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు జిల్లా మలేరియా విభాగం నందు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ అధికారిగా పని చేయుచున్నారు. 2013 సంవత్సరం నుండి 2025 లో వరకు జరిగిన వివిధ జాతీయ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ నందు పరుగు పందెం 100.200, 400, 800.1500 మీటర్ల అండ్ రిలే వివిధ విభాగములు నందు పాల్గొని ఇప్పటి వరకు మొత్తం 68పతకాలు సాధించితిని (బంగారు 20వెండి 23, క్యాంస్య 25పతకాలు సాధించినట్లు తెలిపారు.

## కబ్జా దారులు పై చర్యలు చేపట్టండి

- కోట్ల రూపాయలు భూమి కబ్జా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపణ.
- ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో రోజు రోజుకి కబ్జాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పై పలు అనుమానాలు..



పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 18: దున్నే వాడిదే భూమి అనేది కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అయితే దోచుకొనేవాడిదే భూమి అనేది కబ్జా దారులు పిఠాపురంలో పెట్రేగిపోతున్నారంటూ సిపిఐ నేతలు ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం లో సాగుతుందని కళ్ళముందు జరిగే కబ్జా లు అధికారులు అపలేకపోతున్నారన్నారు. అదే పేదవారికి ఇవ్వమంటే ప్రభుత్వ కార్యాలయాలు కదతామని సమాధానాలు వస్తున్నాయని అధికారులు కబ్జా దారులు పై చర్యలు చేపట్టాలని గురువారం సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ,కార్యకర్తలు తహసీల్దార్ వేణుగోపాల్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ. గతంలో ప్రభుత్వ భూములు పరిరక్షించి పేద ప్రజలకు ఇండ్లస్థలాలుగా మున్సిపల్ కార్మికులకు కాలని ఇవ్వాలని మూడురోజులు నిరోధానికి దీక్ష మూడురోజులు ఆమరణ నిరాహార దీక్షలు చేసామని అధికారులు దిగివచ్చి డిమాండ్లకు ఆమోదం తెలిపి దీక్ష విరమణచేసినట్లుగా తెలిపారు. ఆ హామీ మరచిపోయి 257 సర్వే నెంబర్ భూమి కాకినాడ రోడ్డులో62సెంట్లుభూమిని ప్రభుత్వ కార్యాలయాలు కడతామని చెప్పడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఖచ్చితంగా దీక్ష హామీలు అమలుచేయాలని కబ్జా దారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు మర్రి సత్తిబాబు,కేత రమణ, చెరుకూరి గణపతి,మేకల నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పడాల శీను (కందకం శీను) కుటుంబం నుంచి రక్షణ కల్పించండి

రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18: తన కుమారుడికి పడాల శ్రీను, పడాల నాగరాజు కుటుంబం నుంచి రక్షణ కల్పించాలని మధురబోయిన నాగమణి విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను జాంపేట మార్కెట్లో చేపల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నానని, జాంపేట మార్కెట్ లో చేపల వ్యాపారం జీవనాధారంగా జీవిస్తూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుని జీవిస్తున్నామని తెలిపారు. తన కుమారుడు సాయి దుర్గ (మట్టసాయి) ముత్తూట్ ఫైనాన్స్ లో టీం లీడర్ గా గత నాలుగు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాడని, అతను ఉద్యోగ రీత్యా గత నెల 28న ఉదయం 11 గంటలకు తన కుమారుడు సాయి దుర్గ, అతని అసిస్టెంట్ రాహుల్ ఇరువురు కలిసి కోట గుమ్మం వద్ద పొన్నాడ వారి వీధిలో పడాల రమణమ్మ అలియాస్ చిన్ని రమణమ్మ అనే ఖాతాదారుని ఇంటికి ఈఎంఐ వసూలు నిమిత్తం వెళ్ళారని తెలిపారు. "గత ఆరు నెలలుగా వస్తున్నారు. కట్టనని చెప్పాను కదా..మా తమ్ముడు పడాల శీను (కందకం శీను), మా అన్నయ్య పడాల నాగరాజు



.. పేరు ఉన్న వారు, తన భర్త చిన్ని లక్ష్మణరావు హెూం గార్డుగా పనిచేస్తున్నారు. వాళ్ళు నీ సంగతి చూస్తారు నువ్వు తక్షణం వెళ్ళిపో, వెళ్ళకపోతే నీ అంత చూస్తాము" అని నా కుమారుడు సాయిని, అతని అసిస్టెంట్ రాహుల్ ని నానా బూతులు తిట్టిందని నాగమణి తెలిపారు. ఈ లోగా పడాల శీను, పడాల నాగరాజు, పడాల దుర్గేషులను ఫోను చేసి పిలిపించిందని,. అప్పటికే అక్కడ ఉన్న చిన్ని నవీన్ యాదవ్, పడాల దర్గమ్మ, శంకర్ తదితరులు తన కుమారుడు సాయి, రాహుల్ ల పై దాడి చేసి చొక్కా చించి ముఖం మీద పిడుగులు గుద్ది రోడ్డు మీద ఈడ్చుకుంటూ జాంపేట హెూటల్ వరకు తీసుకుని వచ్చి ఇష్టానుసారంగా కొట్టారని ఆమె తెలిపారు. అప్పటికే తన కుమారుడు సాయి వద్ద కలెక్షన్స్ సొమ్ము లక్ష రూపాయలను గుంజుకుని మెడలో ఉన్న 10 గ్రాముల బంగారపు గొలుసును కూడా గుంజుకున్నారని నాగమణి ఆరోపించారు. తన కుమారుడు సాయిపై జరిగిన దాడి విషయం ఫోను ద్వారా తెలుసుకుని జాంపేట హెూటలు దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లారని తెలుసుకుని గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్ళి చికిత్స చేయించి పోలీస్ కంప్లెంట్ చేశామని ఆమె తెలిపారు. దీంతో.. వారు తర్వాత కొంత మంది రౌడీలను తీసుకుని అన్యాయపూర్వక పేటలో తమ ఇల్లు ఉన్న ప్రాంతంలో కత్తులు, ఇనుప రాడ్లు, సోడా సీసాలు వంటి మారణాయుధాలతో వచ్చి భయ భ్రాంతులకు గురిచేశారని, మట్టా సాయిని కొట్టిన విషయమై కేసులు పెడితేఁ చంపేస్తామని గట్టిగా అరుచుకుంటూ నానా రభస చేశారని నాగమణి ఆరోపించారు. పడాల బ్రదర్స్ అండ్ సిస్టర్స్ నుంచి తమకు తన కుమారుడికి ప్రాణ హాని ఉందని, వారిపై కఠిన చర్యలు తీసుకుని తమ దగ్గర దొంగిలించిన బంగారం గొలుసు, లక్ష రూపాయలు నగదు ఇప్పించి న్యాయం చేయాలని నాగమణి కోరారు. విలేకరుల సమావేశంలో యాళ్ల సత్యవతి, లోయ దుర్గాభవాని, వడ్డే ధనలక్ష్మి, గొల్ల శాంతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లెక్చరర్ల సంఘ కోశాధికారిగా లక్ష్మీనారాయణ

పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 18: ఆర్ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఓ. లక్ష్మీనారాయణ ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ల సంఘం కాకినాడ జిల్లా ఖజానాదారు గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కళాశాలకు అత్యంత గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపాల్ శ్రీ వి. కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓ. లక్ష్మీనారాయణ విద్యా బోధనలో అత్యంత నిబద్ధతతో, అంకితభావంతో పనిచేస్తూ అత్యుత్తమ విషయ నిపుణుడిగా విద్యార్థుల మన్ననలను పొందారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. భౌతిక శాస్త్రం బోధనలో వారి స్పష్టత, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధానం, పరీక్షలలో మంచి ఫలితాలను సాధించడంలో



కీలక పాత్ర పోషించిందన్నారు.కళాశాలలోని విద్యా కార్యక్రమాలతో పాటు సిబ్బంది సంక్షేమం, యూనియన్ కార్యకలాపాలు, సంఘటిత ఉద్యమాలు, పరిపాలనా సమస్యల పరిష్కారంలో లక్ష్మీనారాయణ ఎప్పుడూ ముందుండి చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. యూనియన్ వ్యవహారాలలో వారి లోతైన అవగాహన, సమన్వయ దృష్టి, నాయకత్వ లక్షణాలు జిల్లా స్థాయిలోనూ గుర్తింపుని పొందాయని అన్నారు. వారి ఎన్నిక కళాశాలలోని అధ్యాపక బృందానికి మాత్రమే కాకుండా, మొత్తం విద్యార్థి లోకానికి కూడా స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి లక్ష్మీనారాయణ గారిని అభినందించి, దుస్సాలువా, పూలదండ, పుష్పగుచ్చాలతో సత్కరించారు. భవిష్యత్తులో కూడా ఆయన మరింత ఉన్నత స్థాయిలకు ఎదిగి, అధ్యాపక వర్గ సంక్షేమానికి, విద్యా వ్యవస్థ అభివృద్ధికి విలువైన సేవలు అందించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

# రాష్ట్ర బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశం

### ముఖ్య అతిథి పాల్గొన్న హీరో సుమన్ - స్వాగతం పలికిన బీసీ నాయకులు

కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18.. రాష్ట్రంలో ఉన్న అన్ని బి.సి. కులాల అభ్యున్నతికి ప్రభుత్వాలు పనిచేయాలని వారికి విద్యా ఉద్యోగ రాజకీయాలలో రిజర్వేషన్ కల్పించడం తోపాటుగా ఉభయ తెలుగురాష్ట్రాలలో బి.సి. కులాల కు ఉపముఖ్యమంత్రి పదవిని కేటాయించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. స్థానిక కర్ణంగారి సెంటర్లోగల వీర కమల్ థియేటర్ ప్రాంగణంలో రాష్ట్ర బి.సి. సంఘం ఆధ్వర్యంలో సంకల్ప సభ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు విచ్చేసిన ప్రముఖ సినీనటుడు సినీ హీరో సుమన్ రాష్ట్ర బి.సి. సంఘం నాయకు లు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి రాష్ట్ర బి.సి. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి అధ్యక్షత వహించగా ప్రముఖ సినీ నటుడు సుమన్ ముఖ్యఅతిథిగాను, రాష్ట్ర బి.సి. సంఘం ప్రెసిడెంట్ శౌంటి నాగరాజు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్



మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో బాబాసాహేబ్ అంబేద్కర్ బి.సి. కులాలకు రిజర్వేషన్ కల్పించిన స్వాతంత్రం వచ్చి 78 గడుస్తున్న బి.సి.లలో కొన్ని కులాలకు రాజ్యాధికారం దక్కలేదని అటువంటి కులాలను గుర్తించి వారికి రాజకీయ ప్రాధాన్యతను కల్పించేందుకు అన్ని రాజకీయపార్టీలు కృషి చేయాలన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో బి.సి.ల అభ్యున్నతికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలని కోరారు. రాష్ట్ర బి.సి. సంఘం ప్రెసిడెంట్ శౌంటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రం లో అన్ని కులాలను కలుపుకుని బిసి కులాలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ దక్కే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం యనమదల రవి శౌంటి నాగరాజు బి.సి. సంఘం నాయకులు సుమన్ కి సాలువాలు కప్పి భారీ గజమాలలు వేసి ఘనంగా సత్కరించి బి.సి. రత్న అవార్డును ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో బి.సి. సంఘం నాయకులు కర్రి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకే రాజు సర్పవరం గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు చిన్నా మాజీ ఎం.పి.టి.సి. కొండా వినాయక్ ఆవుపాటి ఉమాశంకర్ అనసూరి సతీష్ శివాజీ బి.సి. సంఘం నాయకులు పెంకే వెంకటలక్ష్మి అనసూరి రాజకుమారి శాంతి, కోటా నాగలక్ష్మి పెంకే శివప్రసాద్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యకుమార్ కాకినాడ జిల్లా అధ్యక్షులు విస్సకోట వెంకటేష్ గౌరవ అధ్యక్షులు అలయన్స్ కొమ్మన తాతారావు పెద్ద సంఖ్యలో బి.సి. సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు లో పట్టు వదలని హిందువులు.. అయోమయంలో అధికారులు

- అనధికారిక చర్చిలపై పెద్ద ఎత్తున హిందూ సంఘాలు, ప్రజల ఆందోళన
- గంటల తరబడి రోడ్లపైనే నిరసన తెలియజేస్తున్న వైనం
- గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం ముందు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి.
- ఆర్జిఓ మల్లిబాబు తీరును ప్రశ్నిస్తున్న హిందువులు అనధికారకంగా నిర్వహిస్తున్న చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నిస్తున్న వైనం

పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 18: తమ ప్రాంతంలో అనధికారకంగా నిర్వహిస్తున్న రెండు చర్చిలను మూయించాలంటూ గొల్లప్రోలు పట్టణానికి చెందిన కొత్తపేట కాలనీ ప్రజలంతా రోడ్డు ఎక్కారు . గురువారం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి వరకు రోడ్డుపైనే బైఠాయించి తమ నిరసనను తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు భజనలు కీర్తనలతో ఆందోళనలు కొనసాగిస్తున్న వైనం. కాకినాడ ఆర్జిఓ మల్లిబాబు గతంలో చర్చిల అనుమతుల పై సమగ్ర విచారణ జరిపి నిర్ణయం తీసుకుం టామని హిందూ సంఘాలతో చర్చల్లో వెల్లడిం చారన్నారు. నిర్ణయం తీసుకోకుండా కాలం సాగదీస్తున్నారని , పోలీసు బందోబస్తు మధ్య చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించుకునేందుకు



అనుమతులు ఇవ్వడంపై ప్రజలంతా తీవ్రంగా మండిపడుతున్నారు. నియోజకవర్గస్థాయి అధికా రులు సర్ది చెప్పే ప్రయత్నం చేయగా హిందూ సంఘాలు, అక్కడి ప్రజలంతా ససేమిరా అనడం తో అధికారులు అయోమయంలో పడ్డారు. ఆర్జిఓ రావాలంటూ నిరసనకారులు ఆందోళన చేస్తున్న వైనం. హిందువుల మనోభావాలు అక్కర్లే ని ప్రభుత్వాలు మాకు అక్కర్లేదు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలియజేస్తున్న కొత్తపేట ప్రజలు.

**అధికారుల అలసత్వం వల్లే సమస్య తీవ్రత పెరిగిన వైనం**

నిబంధనలకు విరుద్ధంగా చర్చిలు నిర్వహిస్తున్నారు అంటూ కొత్తపేట కాలనీవాసులు పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వలన నేడు సమస్య తీవ్రత విపరీతమైంది. ఇరు వర్గాలను సర్ది చేసే ప్రయత్నం చేయకపోగా చర్చిలకు బందోబస్తు ఇచ్చి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వడంపై పలు అనుమానాలు.. ఎవరి ఒత్తిడిలకు అధికారులు లొంగుతున్నారంటూ ఆశ్చర్యపోతు సరదు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి.



## రైతు సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 18: అయినవిల్లి మండలం అయినవిల్లి గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు ఏరువాక కేంద్రం అధికారులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అయినవిల్లి పుల్లేటికుర్రు గ్రామాల్లో వ్యవసాయ విద్యార్థులు రెడీ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఈ రైతు సదస్సులో వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల డీన్ డి శ్రీనివాస్ వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన స్టాల్స్ సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జరిగిన రైతు సదస్సు కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు శాస్త్రవేత్తలు పాల్గొని వరి ,కొబ్బరి రైతులకు పండించే పంటపై మెళకువలు తెలిపారు. విత్తనం మొలకెత్తిన పుటినుండి పంట దశకు వచ్చేవరకు మెళకువలు వారికి వివరించారు. అనంతరం ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ నందకిషోర్ గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమాలు విద్యార్థులు రైతులనుండి నేర్చుకున్న అనుభవాలు వివిధ కార్యక్రమాల సర్వేలను సభకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు రైతుల వారి అనుభవాలను సభలో మాట్లాడారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలు వివరించారు. వ్యవసాయ అధికారి శోభ సచివాలయ సహాయకులు పాల్గొన్నారు.

## రేపు పెరవలిలో పర్యటించనున్న డిప్యూటీ సీఎం పవన్



తూర్పు గోదావరి (మనసులో మాట), డిసెంబరు 18: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్- టెక్నాలజీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 20న తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజక వర్గం పెరవలి మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన గోదావరి తీర ప్రాంతాల్లో గ్రామాలకు తాగునీటి సరఫరా కల్పించేందుకు చేపట్టనున్న పనుల శంకుస్థాపన, అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ పెరవలి మండలంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ మేరకు జాతీయ రహదారి మార్గంలో లే అవుట్లో సభ ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, నిరంతర విద్యుత్తు సరఫరా, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత చర్యలు తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవ కుమార్, ఎస్ఈ (ఆర్‌డబ్ల్యుఎస్) బీవీ గిరి, ఎస్ఈ (ఎలక్ట్రికల్) కే తిలక్ కుమార్, ఎస్ఈ (ఆర్ అండ్ బి) ఎవిఎల్ వీ రెడ్డి, ఎస్ఈ (పీఆర్) టీ బాలకృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం మార్టిన్ లూథర్ కింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న ప్రైవేట్ లెక్చరర్ కుటుంబానికి బాసట..

### 50 వేల ఆర్థిక సాయం అందజేసిన ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ బృందం



పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 18 : కష్టాల్లో ఉన్న తోటి ఉపాధ్యాయుడికి అండగా నిలిచి పిఠాపురం ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ (పి టి ఎల్ యూ) తమ మానవత్వాన్ని చాటుకుంది. స్థానిక పిఠాపురంలో నివసిస్తున్న ప్రైవేట్ కళాశాల లెక్చరర్ కాలే యేసు రత్నం ఇటీవల గుండెపోటుకు గురై కాకినాడలోని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పి టి ఎల్ యు సభ్యులు వెంటనే స్పందించి బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి మేమున్నామనే ధైర్యాన్ని ఇస్తూ, యూనియన్ సభ్యులు సేకరించిన రూ. 50,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తంలో కొంత భాగంతో ఆ కుటుంబానికి ఐదు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి, మిగిలిన రూ. 32,000/- నగదును నేరుగా అందజేశారు.

**ప్రభుత్వానికి డిమాండ్:** ఈ సందర్భంగా పి టి ఎల్ యు నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస ఆరోగ్య భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఉద్యోగ, ఆరోగ్య భద్రత కోసం ప్రతి ఒక్కరికీ పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించేలా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.



## దేశంలో క్యాన్సర్ ఆసుపత్రుల విస్తరణ కు కేంద్రం చర్యలు

**- విశాఖ హెూమి భాభా క్యాన్సర్ ఆసుపత్రి విస్తరణకు ప్రతిపాదనలు**

**- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం**

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** భారత దేశంలో నానాటికి పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దేశంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో దశలవారీగా క్యాన్సర్ ఆసుపత్రులను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పబ్లిక్ గ్రీవెన్స్, ప్రధాని కార్యాలయ శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్ తెలిపారు. దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో క్యాన్సర్ ఆసుపత్రుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై గురువారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ ) భాగస్వామ్యంతో దేశంలో పలు ప్రాంతాల్లో క్యాన్సర్ ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో విశాఖ లో హెూమి భాభా కేన్సర్ హాస్పిటల్ %డ%రీసెర్చ్ సెంటర్ ఇప్పటికే పూర్తిస్థాయి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా సేవలందిస్తుందని తెలిపారు. 2022 సంవత్సరంలో 556.58 కోట్లరూపాయల వ్యయంతో అణుశక్తి శాఖ ఆధ్వర్యంలో టాటా మెమోరియల్ సెంటర్ నెలకొల్పిన ఈ ఆసుపత్రిలో అదునాతన క్యాన్సర్ వైద్య సేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో ఆసుపత్రిని మరింత విస్తరించే ప్రతిపాదన ఉందన్నారు. ఏపీ లో రంగరాయ వైద్య కళాశాల తో పాటు మరో 18 ప్రభుత్వ, ప్రైవేటు కేన్సర్ ఆసుపత్రులు నేషనల్ కేన్సర్ గ్రిడ్(ఎన్ సి జి ) కింద రిజిస్టర్ అయ్యాయని కేంద్ర మంత్రి వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## మిషన్ మౌసమ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత

**- తుఫాన్లపై ముందస్తు హెచ్చరికల బలోపేతానికి కేంద్రం చర్యలు**

**- ఎం. పీ. సానా సతీష్ బాబు**



**కాకినాడ (మనసులో మాట ) డిసెంబర్ 18** రాజ్యసభలో సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర భూవిజ్ఞానశాస్త్రాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఇచ్చిన సమాధానంలో మిషన్ మౌసమ్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 47 డాప్లర్ వాతావరణ రాడార్లు ( డిడబ్ల్యూఆర్ ఎస్ ) పనిచేస్తున్నాయని వాటిలో మచిలీపట్నం విశాఖపట్నం శ్రీహరికోట (ఇస్రో )లలో మూడు రాడార్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇవి తుఫానులు భారీ వర్షాలు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ముందుగా గుర్తించి హెచ్చరికలు జారీ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని రాడార్లను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా తుఫాన్లకు గురయ్యే తీర ప్రాంతాలు అధిక జనాభా గల నగరాలు వాతావరణ ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ వంటి తీర రాష్ట్రాల భూభౌగోళిక ప్రమాద ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇంకా రేడియోమీటర్లు విండ్ ప్రొఫైలర్లు వంటి పరికరాలను కూడా భవిష్యత్తులో ముఖ్య విమానాశ్రయాలు మరియు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

ప్రస్తుతం దేశ భూభాగంలో సుమారు 87 శాతం ప్రాంతాన్ని రాడార్ కవరేజ్ కిందకి తీసుకువచ్చినట్లు కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాలను కవర్ చేయడానికి గ్యాప్ అనాలిసిస్ చేపట్టినట్లు తెలిపింది.

**ఆంధ్రప్రదేశ్ ప్రజలకు లాభాలు**

**తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు మెరుగవుతాయి**

ప్రకృతి విపత్తులపై ప్రభుత్వ స్పందన వేగవంతం అవుతుంది తీర ప్రాంత ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణకు తోడ్పాటు రైతులకు మత్స్యకారులకు వాతావరణ సమాచారం అందుబాటులోకి వస్తుంది ఈ చర్యలు ఆంధ్రప్రదేశ్‌ను వాతావరణ ప్రమాదాల నుంచి రక్షించడంలో కీలకంగా నిలుస్తాయని కేంద్రం స్పష్టం చేసింది.

# అదిత్య లో విద్యార్థుల ప్రతిభకు వేదిక - థండర్ థర్స్‌డే





**గండేపల్లి మనసులో మాట డిసెంబర్ 18..** గండేపల్లి మండలం సూరంపాలేం : అదిత్య విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (ఎస్ఎసి) ఆధ్వర్యంలో, అభినయ క్లబ్ నిర్వహిస్తున్న 'థండర్ థర్స్‌డే' విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోంది అని డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రతి వారం నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక వ్యక్తీకరణ వేడుకలా మారింది. థండర్ థర్స్‌డే వేదికపై విద్యార్థులు పాటలు, నృత్యం, నాటకం, కవిత్వం, కథనాలు, మిమిక్రీ, స్టాండ్-అప్ కామెడీ, యాంకరింగ్, కళలు లేదా తాము కలిగిన ఏదైనా ప్రత్యేక ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించవచ్చు. "ప్రతిభకు పరిమితులు ఉండవు" అన్న ఆలోచనతో ఈ వేదిక విద్యార్థులను ముందుకు నడిపిస్తుంది. ఈ కార్యక్రమం విద్యార్థులలో స్టేజ్ భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ విభాగాలు, సంవత్సరాల విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా స్నేహభావం, సమన్వయం, సాంస్కృతిక వైవిధ్యం పెరుగుతుంది. అభినయ క్లబ్ ఈ కార్యక్రమాన్ని అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తోంది. ఈ క్లబ్ క్లబ్ కోఆర్డినేటర్ డా. నీలిమ సమర్థవంతమైన నాయకత్వం లో పనిచేస్తుంది. ఆమె దృష్టి విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై కేంద్రీకృతమై ఉండటంతో, థండర్ థర్స్‌డే ఒక సాధారణ కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల స్వరానికి ప్రతీకగా మారింది. థండర్ థర్స్‌డే ప్రతి గురువారం క్యాంపస్‌ను ఉత్సాహంతో నింపుతూ, విద్యార్థుల జీవితాల్లో చిరస్మరణీయ అనుభవాలను అందిస్తోంది. ఈ వారం విదేశీ విద్యార్థుల నృత్యాలు ఎంతగానో విద్యార్థులను ఉర్రూతలూగించాయి. .శాంటా క్లాస్ వేషధారణతో విద్యార్థుల విచిత్ర వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాల ద్వారా ఆదిత్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సాంస్కృతిక కళా రంగాల్లో కూడా ప్రాధాన్యం ఇస్తోంది అనే విషయాన్ని మరోసారి నిరూపిస్తోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్. డా. డి. కిషోర్, డైరెక్టర్ . ఇంటర్నేషనల్ రిలేషన్స్ పరంజీత్ సింగ్, సౌత్ కొరియా ప్రతినిధి డా. యూ టాక్ లీ, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కులపై అవగాహన



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర లీగల్ మెట్రాలజీ శాఖ, సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గల రిలయన్స్ మార్ట్‌లో వినియోగదారుల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు గోదావరి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మోసపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ధర్మకాటా, ఎలక్ట్రానిక్ కాటా, తూనికల రాళ్లను చూపిస్తూ వివరించారు. వస్తువులపై తయారీ తేదీ, యూజ్ బై డేట్, తయారీదారు పేరు, చిరునామా తదితర వివరాలు తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా మోసం జరిగితే ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫుడ్ లైసెన్స్, ఐఎస్ఐ మార్క్, హాల్‌మార్క్ ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. 1915 టోల్ ఫ్రీ నెంబర్, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) యాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తూనికలు, కొలతల్లో ఏవైనా లోపాలు ఉంటే 1967 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వినియోగదారులు ధైర్యంగా ప్రశ్నించి అన్యాయాన్ని అడ్డుకోవాలని, మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ మార్ట్ స్టోర్ మేనేజర్ వెంకట్, స్టోర్ సిబ్బంది , లీగల్ మెట్రాలజీ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## యానాంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్



**యానాం (మనసులో మాట), డిసెంబరు 18:** యానాంలో క్రిస్మస్ వేడుకలు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ శాంతియుత సమాజానికి, సహృద్భావానికి క్రీస్తు బోధనలు ఎంతగానో దోహదపడ తాయని ఆయన మార్గం అనుసరణీయమని అన్నారు. అనంతరం సివిఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, రెవరెండ్ హెచ్చి మూర్తి రాజు క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తుబోధించిన శాంతి, దయ, కరుణ, ప్రేమ తత్వాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆవిధంగా జీవితంలో వాటిని అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాల, బాలికలు వేసిన క్రిస్మస్ గీతాలతో వేసిన నృత్యాలు అందరిని అలరించాయి. క్రిస్మస్ వేడుకలకు యానాం పరిసర ప్రాంతాల భక్తులు వందలాదిమంది హాజరయ్యారు.

# పబ్లిక్ పరీక్షలంటే భయం అవసరం లేదు

**- ప్రణాళికా ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం**

**- బొమ్మూరు ప్రభుత్వ గిరి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు ప్రత్యేక మోటివేషన్ తరగతులు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 18:** పదవ తరగతి విద్యార్థినుల్లో పరీక్షలపై అవగాహన పెంపొందించి, ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గురువారం బొమ్మూరులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో "పరీక్షలకు సిద్ధమవుదాం - భవితను గెలుచుకుందాం" అనే అంశంపై ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లి భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లి భాస్కర్ మాట్లాడుతూ పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక దశ మాత్రమేనని, సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసంతో చదివితే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించగలడని తెలిపారు. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే పద్ధతులు, సమయ నిర్వహణ, స్మరణశక్తి పెంపు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కేఎన్ జ్యోతి మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులు విద్యను ఆయుధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల (బొమ్మూరు) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



**ముమ్మిడివరం (మనసులో మాట)** ముమ్మిడివరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల 252 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం 5G స్మార్ట్ ఫోన్లను అంగన్వాడీ కార్యకర్తలకు అందజేశారు. అంగన్వాడి కేంద్రాలు ద్వారా అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను సాంకేతికతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాగిరాజు సాయిబాబా రాజు, ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ పి సుబ్బరాయుడు, సూపర్వైజర్లు పల్లవి, దేవి, మీనాక్షి, కుమారి,రమణ, రమాదేవి, నాగలక్ష్మి కార్యకర్తలు పాల్గొన్నారు.



## టెన్త్ విద్యార్థుల విహారయాత్ర

**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 18:** పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతోన్న విద్యార్థులను ఆటవిడుపుగా గురువారం విహారయాత్రకు తీసుకువెళ్లారు. మండల కేంద్రమైన తాళ్లరేవు నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సుమారు 180 మంది విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ప్రసాదరావు, స్టాఫ్ సెక్రటరీ వాకపల్లి అప్పారావు ఆధ్వర్యంలో యానాం రాజీవ్లోచ్, ఈఫిల్ టవర్ తదితర పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ విశేషాలను వివరించారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు విద్యాసాగర్, వరలక్ష్మి, నాగేంద్ర, బానుమతి, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంపై ఏసీబీ దాడి

**లంచం తీసుకుంటూ దొరికిన డిడి, సీనియర్ అసిస్టెంట్, రిటైర్డ్ ఉద్యోగి**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 18..** కాకినాడలోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం మెరుపుదాడి నిర్వహించారు. కారుణ్య నియామకం, పెన్షన్ సెటిల్‌మెంట్ పనుల నిమిత్తం 40 వేల లంచం తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్ ఎం లల్లి, సీనియర్ అసిస్టెంట్ కారెపు సూర్య శివప్రసాద్‌లు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. కాట్రేనికోన మండలం అడవిపేటకు చెందిన గెద్దాడ చక్రవర్తి నుంచి ఈ మొత్తం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. లంచం వ్యవహారంలో మాజీ ఉద్యోగి యాదల సత్యనారాయణను మధ్యవర్తిగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. బాధితుడు చక్రవర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ కిషోర్ నేతృత్వంలో అధికారులు ఉచ్చు బిగించారు. లంచం తీసుకుంటున్న సమయంలో నిందితులను పట్టుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, వారిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

## రామవరం ఎస్ సి కాలనీలో గత 20 యేళ్ళ నుండి నివాసం ఉంటూ ఇంటి పట్టా మిస్సయిన వారికి నూతన పట్టా మంజూరు



**అనపర్తి ( మనసులో మాట) డిసెంబరు 18:** మాజీ ఎమ్మెల్యేనల్లమిల్లి మూలారెడ్డి హయాంలో, రామవరం ఎస్ సి కాలనీలో ఇళ్ళ పట్టాలు ఇవ్వడం జరిగింది. అయితే కాలక్రమంలో కొంతమంది ఆ ఇంటిపట్టాలు పోగొట్టుకుని ఇబ్బందులు పడుతుండటం, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిదృష్టికి వచ్చింది, దాంతో వారికి ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే నల్లమిల్లి, ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయితీరాజ్ తదితర అన్ని శాఖల నుండి సమగ్ర సర్వే నిర్వహించి పరిశీలన చేసి, గడచిన 20-25 యేళ్ళుగా నివాసం ఉంటూ పట్టాలు మిస్ అయిన వారు ఎవరైతే ఉన్నారో, వారికి నివేశన స్వాధీన ధృవీకరణ పత్రాలను నేడు రామవరంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఏవో సుధా మాధురి ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



**కిర్లంపూడి (మనసులోమాట) డిసెంబరు 18..** భూసార పరీక్షలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సామర్లకోట భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి ఎన్ విజయ్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపిక చేసిన కొన్ని పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) - వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో మట్టి నమూనా సేకరణ, పరీక్షా విధానాలపై కిర్లంపూడి మండలం తామరాడ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధా మాధురి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు దిగుబడులు బాగా రావాలంటే ఖచ్చితంగా భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషకాల ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆత్మ బి. టి. యం. నీలి బాబురావు సేకరించిన మట్టి నమూనా వివరాలను మొబైల్ యాప్లో ఆన్లైన్ చేసే విధానమును విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏ డి ఏ ఎన్ దైవ కుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు పలువురు ఉపాధ్యాయులు గ్రామ వ్యవసాయ నాయకుడు ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప

శుక్రవారం 19 డిసెంబర్ 2025




## మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిసిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే



**పలమనేరు డిసెంబర్ 18 (మనసులో మాట):** విజయవాడతాడేపల్లి లోని వైయస్సార్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన పలమనేరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ తెలియజేశారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయండి

### - పోస్టర్ల ఆవిష్కరణలో పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



**పలమనేరు డిసెంబర్ 18( మనసులో మాట):** ఈనెల 21న ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో పోస్టర్లను వైద్యశాఖ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. పోలియో రహిత సమాజానికి ప్రజలందరూ సహకరించాలని ఈ మహమ్మారి నుంచి ఇప్పటికే నిరంతరాయంగా విజయం సాధించామని అయితే భవిష్యత్తులోనూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ జయశంకర్, ఏఎంసీ చైర్మన్ రాజన్న,మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, నాయకులు సోమశేఖర్ గౌడ్, రంగనాథ్, రాంబాబు, ప్రతాప్ రెడ్డి, గిరిధర్ గోపాల్, సుబ్బ నాగయ్య,తదితరులు పాల్గొన్నారు.



## వీధి కుక్కల నియంత్రణకు కమిషనర్ చర్యలు

**పలమనేరు డిసెంబర్ 18( మనసులో మాట) :** సుప్రీంకోర్టు మరియు ఏపీ ప్రభుత్వాల ఆదేశాల మేరకు పలమనేరు పురపాలక సంఘం నందు గురువారం వీధి కుక్కల ఏ బి సి, ఏ ఆర్ వి నియంత్రణ చర్యలో భాగంగా ప్రత్యేక డ్రైవను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ... పురపాలక సంఘ పరిధిలో వీధి కుక్కల నియంత్రణ చర్యలో భాగంగా వాటికి వ్యాక్సినేషన్ చేస్తున్నామని వారంలో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పట్టణంలో గల వీధి కుక్కలను చిత్తూరు నగరపాలక సంస్థ నందు గల స్టెరిలైజేషన్ సెంటర్ నందు వాక్సినేషన్ కొరకు పంపుతూ వాటి నియంత్రణ చర్యలకై మరింత కృషి చేస్తున్నామని పట్టణ ప్రజలంతా వీధి కుక్కల బెడద నుండి విముక్తికై తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణ ప్రజలను వీధి కుక్కల ద్వారా జరుగు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాబోవు రోజుల యందు వీధి కుక్కల సంఖ్య మరింత తగ్గించుటకై తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుద్ధ కార్మికులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ్ తల్లూరిని కలసిన జిల్లా జనరల్ సెక్రెటరీ చైతన్య మోహన్



**పలమనేరు డిసెంబర్ 18 ( మనసులో మాట):** కాకినాడ లోని పిఠాపురం చెందిన రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రామ్ తల్లూరిని చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ చెందిన జనసేన పార్టీ నాయకుడు జిల్లా జనరల్ సెక్రెటరీ, రాష్ట్ర యువ కాపునాడు అధ్యక్షులు పూల చైతన్య మోహన్ గురువారం ఆయనకు సెలువా కప్పి పూల బొకే అందించి మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు.

## సఖి సురక్ష హెల్త్ కేర్



పలమనేరు డిసెంబర్ 18( మనసులో మాట): పలమనేరు పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరిక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. ఇందులో సఖి సురక్ష హెల్త్ కేర్ స్కానింగ్ మదనపల్లె రోడ్డు లోనిఏ వి సి కళ్యాణ మండపం నందు గురువారం ఉదయం డాక్టర్ ఆయుష్ ఆధ్వర్యంలో ఉచితంగా మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 526 సఖి సురక్ష పథకం ద్వారా మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత రక్తహీనత, విటమిన్ లోపము, పోషకాహార లోపాలతో పాటు మూడు రకాల క్యాన్సర్స్, నాలుగు రకాల మానసిక ఆరోగ్య సమస్యలు 16 రకాల పరీక్షలు నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మెప్మా సి ఎం ఎం బాబా, సీవోలు ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో కూటమి ప్రభుత్వ లక్ష్యాలను

# ముందుకు తీసుకువెళ్లాలి

- గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ప్రాధాన్యంగా తీసుకున్నాము
- పంచాయతీరాజ్ సిబ్బంది శిక్షణలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాము
- కలెక్టర్ల చొరవతో పల్లె పండుగ 1.0ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేశాము
- 5వ కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు






**అమరావతి డిసెంబర్ 18( మనసులో మాట) :** జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పని చేస్తూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశా నిర్దేశం చేశారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ప్రాధాన్యంగా తీసుకున్నామనీ, అడవి తల్లి బాట పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టును సంబంధిత జిల్లాల కలెక్టర్లు సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. బుధవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో5వ కలెక్టర్ల సదస్సులో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "రాష్ట్ర అభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న కలెక్టర్లకు అభినందనలు. భవిష్యత్తులోనూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సేవలందించాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పల్లె పండగ 1.0 పనులను గడువులోపు పూర్తి చేయగలిగామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నరేగా నిధులతో గత ఏడాది చేపట్టిన పల్లె పండుగ 1.0 ద్వారా గ్రామాల్లో 4 వేల కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు నిర్ణీత సమయానికి పూర్తి చేయగలిగాం. రైతులకి అండగా 22,500 మినీ గోకులాలు, 15 వేల నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్ నిర్మించాం. సకాలంలో పనులు పూర్తి చేయగలిగాము. 2025 %-% 2026 ఆర్థిక సంవత్సరానికి 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించాం. మొత్తం 15.95 కోట్ల పని దినాల ద్వారా రూ. 4,330 కోట్ల వేతనాల రూపంలో చెల్లించాం. మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ. 1,056.85 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించాం. ఇది గ్రామీణ ప్రజలకు ఆర్థిక చేయూతను ఇచ్చింది.

**స్వచ్ఛ రథం సత్ఫలితాలనిస్తోంది**

గ్రామ పంచాయతీల స్వయం ఆదాయార్జన మార్గాలపై కూడా దృష్టి సారిస్తాం. టాక్స్, నాన్ టాక్స్ అసైన్మెంట్లు డిజిటలైజ్ చేసే కార్యక్రమంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలి. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణ కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచాం. ఉద్యోగుల సామర్థ్యం పెంపుకి ఈ శిక్షణా తరగతులు ఎంతగానో తోడ్పడ్డాయి. గ్రామ స్థాయిలో ఎప్పటికప్పుడు పాలనా సామర్థ్యాల పెంపు కోసం కలెక్టర్లు కృషి చేయాలి. జూన్ నెలలో తీసుకువచ్చిన స్వచ్ఛ రథం కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. జూన్ లో ఒక యూనిట్ తో ప్రారంభించగా నేటికి ఆ సంఖ్య 25కి చేరింది. పీఎం జన్మన్ పథకం, నరేగా సాయంతో మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టాం. రహదారుల నిర్మాణానికి అవసరం అయిన అటవీ అనుమతుల వ్యవహారంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ 9కి 9 అనుమతులు పూర్తి చేసి 100 శాతం స్ట్రయిక్ సాధించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ 88కి 79 పనులకు అనుమతులు క్లియర్ చేశారు. అడవి తల్లి బాట పనులపై కలెక్టర్లు శ్రద్ధ చూపుతున్నారనడానికి ఇది నిదర్శనం. మరింత ఉత్సాహంగా పని చేస్తూ నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించాలి" అన్నారు.

# 'పలమనేరు రైతు బజార్' కేంద్రాన్ని సందర్శించిన కె.రాజన్న..



**పలమనేరు డిసెంబర్ 18 (మనసులో మాట) :** పలమనేరు శాసనసభ్యులు శ్రీ ఎన్.అమర్నాథరెడ్డి గారి ఆదేశాల మేరకు పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రాజన్న తో పాటు కార్యదర్శి వి.సంజీవ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పలమనేరు-రైతు బజారును సందర్శించడమైనది. ఈ సందర్భంగా కె.రాజన్న అక్కడ వ్యాపారం నిర్వహించుకుంటున్న కూరగాయలు మరియు పూల వ్యాపారస్థులతో మాట్లాడుతున్నపుడు... కొంతమంది పూల వ్యాపారస్థులు తాము ఎన్నో సంవత్సరాలుగా పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తాము పదిమంది పూల వ్యాపారం చేసుకుంటున్నామని తమకు రైతు బజార్ ప్రాంగాణం నందు ఖాళీగా ఉన్న స్థలములో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొనుటకు స్థలం కేటాయించాలని వారు కోరారు. అందుకు స్పందిస్తూ మీరు ఎంతమంది పూల వ్యాపారస్తులు ఉన్నారో అర్జీలు సమర్పించాలని తెలిపారు. మీరు ఇచ్చిన అర్జీలను ఏ.డి మార్కెటింగ్,చిత్తూరు వారి ద్వారా పంపి అనుమతులు తీసుకుంటామని పూల వ్యాపారస్తులకు భరోసా కల్పించారు. రైతు బజార్ అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.జ్ఞానాంబ, పి.లోకేష్, ఆర్.భార్గవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ రాజు మృతికి ఎమ్మెల్యే సంతాపం

**పలమనేరు డిసెంబర్ 18( మనసులో మాట):** ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు బి.రామచంద్ర రాజు,ఎన్టీఆర్ రాజు మృతికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సంతాపాన్ని తెలియజేశారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు గారికి వీరాభిమానిగా, అఖిలభారత ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేసిన ఎన్టీఆర్ రాజు బుధవారం మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తండ్రి ఎన్టీఆర్ రాజు స్వస్థలం తిరుమల కావడంతో వారి స్వగృహానికి పలమనేరు టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే అమర్ కలసి వెళ్ళి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు..తెలుగుదేశం పార్టీకి రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సంతాప కార్యక్రమంలో నందమూరి తారక రామారావు తనయుడు రామకృష్ణ, పూతలపట్టు శాసన సభ్యులు మురళీ మోహన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతో పాటు పలమనేరు కో ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, నాయకులు కిషోర్ గౌడ్, ఖాజా, నాగరాజు,బెజవాడ భరత్ గిరిధర్ గోపాల్, నదీమ్, శ్రీనివాసులు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## 22వ తేదీ చలో కలెక్టరేట్ ను

# జయప్రదం చేయండి

### - మామిడి రైతులకు పిలుపు ఉమాపతి నాయుడు



పలమనేరు డిసెంబర్ 18 ( మనసులో మాట) :చిత్తూరు జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం మామిడి రైతులకు చెల్లించాల్సిన ఎనిమిది రూపాయల ధరను వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఉమాపతి నాయుడు డిమాండ్ చేశారు. మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం మామిడి రైతులకు చెల్లించాల్సిన డబ్బులను నెలలు గడుస్తున్నా ఇంతవరకూ చెల్లించలేని కారణంగా ఈనెల 22 న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.16 వ తేదీన చిత్తూరు ఓంకార్ బిల్డింగ్ సిఐటియు కార్యాలయం నందు మామిడి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులతో విస్తృతస్థాయి సమావేశం జరిగిందని ఈ సమావేశంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది మామిడి రైతులకు చెల్లించాల్సిన సుమారు 360 కోట్లు రూపాయలు వెంటనే చెల్లించాలని కలెక్టర్.వ్యవసాయ శాఖ మంత్రి.ముఖ్య మంత్రి. ఇద్దరు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉమాపతి నాయుడు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న మామిడి రైతులందరూ ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి అందరూ తప్పక రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇకపై భవిష్యత్తులో మనం పండిస్తున్న మామిడి పంటను ఉంచాలా లేక తీసివేయాలా అని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేని సమయంలో వేరే పంటలపైన ఆధారపడలేక రైతులు మామిడి సాగును ఎంచు కున్నారని. పండించడానికి సంవత్సరం పొడవున పంటపెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేసి అష్టకష్టాలు పడి పండించిన మామిడికి ఒకవైపు గిట్టుబాటు ధర లేక మరోవైపు సిండికేట్ వలన ఆశించిన ధరకు అమ్ముకోలేక.రైతులు ఫ్యాక్టరీలకు తరళించి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ డబ్బులు రాకపోవడంతో రైతులు నిరుత్సాహా పడుతున్నారని.మళ్ళీ జనవరిలో మందులు పిచికారీ ఇతర పెట్టుబడి ఖర్చులకు డబ్బులు లేక సతమతమౌతున్నారని ఆయన తెలిపారు.ఈ విషయాన్ని ప్రభుత్వం.కలెక్టర్ వారు చొరవచూపి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే చెల్లించడానికి తగు చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపారు.

## పెన్షనర్ ల సమస్యలు పరిష్కరించాలని

# ఆర్డీవోకు వినతిపత్రం



పలమనేరు డిసెంబర్ 18 ( మనసులో మాట): పెన్షనర్ల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయాలని పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారిని భవానికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యన్. సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ... 2024 తదుపరి పదవీ విరమణ పొందిన వారికి ఇంతవరకు గ్రాట్యుటీ చెల్లంచలేదన్నారు.చరిత్రలో గ్రాట్యుటీ నిలిపి వేసిన సందర్భాలు యింత వరకు ఎప్పుడూ లేదన్నారు.అలాగే 2022 పి.ఆర్.సి. బకాయిలు నాలుగు సమాన వాయిదాలలో చెల్లిస్తామని జి.ఓ. నెం. 106 తేది 11.05. 2002న విడుదలజేశారని, అది ఇంత వరకు అమలు కాలేదన్నారు. కరువు భత్యం బకాయిలు చాలా కాలంగా పెండింగ్ లో ఉన్నాయన్నారు. అంతేకాక జూలై 2024 సంవత్సరం నుండి మూడు డి.ఎ.లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డులు సక్రమంగా అమలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం 12వ పిఆర్సి కమిటీని నియమిస్తే దానిని ప్రస్తుత ప్రభుత్వం రద్దు, ఇంత వరకు నూతన కమిటీ నియమించలేదన్నారు.ఇప్పటికే 12 వ పిఆర్సి గడువు రెండున్నర సంవత్సరాలుదాటిపోయిందన్నారు. వీటి అన్నింటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెన్షన ర్ ల సంఘం నాయకులు నాగభూషణం, గోవింద రెడ్డి, పుష్పరాజు,రామప్ప,తులసి రెడ్డి, చంద్రశేఖర్,పరుశు రాం, విజయ్ కుమార్,రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

శుక్రవారం 19 డిసెంబర్ 2025



# ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

## నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ నాయకత్వం



**హైదరాబాద్, డిసెంబర్ 18:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో సిట్ విచారణ చేస్తుండగా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు. వీరు ఏంచేస్తారన్నది విధి విధానాలు రాలవాల్సి ఉంది.

# దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

**నదీ జలాలలపై బీఆర్ఎస్ ద్రోహం**

**అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం**

**మీడియా ముందుకు వచ్చినా వివరిస్తాం**

**కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

**హైదరాబాద్, డిసెంబర్ 18 (మనసులో మాట):** నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సీఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసి రారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమా వేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవ డం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరా రు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారా లతో సహా నిరూపిస్తాం అని రేవంత్ అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోంద న్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం మరోమారు స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.

# స్థానిక, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

**అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం**

**ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు**

**హైదరాబాద్, డిసెంబర్ 18 (మనసులో మాట):** రాష్ట్రంలో గ్రామ పంచాయ తీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజా స్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుం డా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసన సభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే రిపీట్



- పంచాయతీ ఫలితాలు మా పాలనకు గీటురాయి
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో సైతం ఆదరించారు
- బీఆర్ఎస్, బీజేపీకి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు
- ఇప్పటికైనా బీఆర్ఎస్ బుద్ధిగా మసలుకోవాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 18 (మనసులో మాట):** మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృత మవుతాయని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశా రు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలం దరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి ప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి సీఎం మాట్లాడారు. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. 12,702 పంచా యతీలకు 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్, 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎ న్నికలు జరిగాయని.. 87 నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు 3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమతి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

# కోర్టు సమయం వృథా చేస్తారా?

**హీరా గ్రూప్‌నకు భారీ జరిమానా**

**5కోట్ల జరిమానా విధించిన హైకోర్టు**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# సర్కార్‌కు భారీ ఊరట

**102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం**

**స్వాధీనం చేసుకుని నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశం**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.సుదీర్ఘ విచారణ తర్వాత ద్విసభ్య ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. అది పూ ర్తిగా అటవీ భూమి అని.. దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉన్నాయని తేల్చి చెప్పింది. భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది. దీంతో 2 దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది.

# ఇద్దరు అవినీతి ఉద్యోగుల పట్టివేత

**లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. నిర్మల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలంలో తానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి భీమన్న గురువారం మధ్యాహ్నం బాధితుడి నుంచి రూ. 9వేలు ఫోన్ పే చేయించుకున్నందుకు ఆధారాలతో సహ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భైంసా ఎన్‌బీ నగర్‌లో నివాసముండే ఒకరు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్, ఎఫ్‌టీఏ బిల్లు కోసం సీనియర్ అసిసెంట్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం దాడులు చేసి భీమనన్ను పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న ఉషా శుభ కామేశ్వరి రూ. 10 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. ల్యాండ్ మ్యుటేషన్ కోసం అవసరమైన ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్‌కు ఆర్ఐను సంప్రదించారు. దీంతో లంచం డిమాండ్ చేసిన ఆమెకు రూ.10 వేలు బాధితులు అందిస్తుండగా మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేసుకుని ఏసీబీ కేసులను విచారిస్తున్న వరంగల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.



# స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

## బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

**యాదాద్రిభువనగిరి, డిసెంబర్ 18:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలోభాగంగా ఆయన మాట్లాడుతూ.. ' యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ. బీఆర్ఎస్ పార్టీనే ఫిరాయింపుల మొదటి ప్రోత్సహించింది. ప్రభుత్వం ఒత్తిడితో స్పీకర్ రాజ్యాంగం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ వారి వారి కేసులలో బెయిల్ పై ఉన్నారు. బీజేపీ వారిపై కేసు పెట్టలేదు దర్యాప్తు సంస్థలు కేసు పెట్టాయి. మా పార్టీ కార్యాలయంలపై దాడి చేస్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తే కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత' అని రామచంద్రరావు పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిర్వాకం

## రెండుసార్లు రైతుభరోసాకు ఎగనామం

### మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు



**మెదక్, డిసెంబర్ 18:** రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వ్యవసాయానికి కరెంట్, నీళ్లు అవసరం అయితే కాంగ్రెస్ మాత్రం యాప్‌లు, మ్యాప్‌లు కావాలి అంటుందన్నారు. తాజాగా మెదక్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి వచ్చాక బస్ ఛార్జీలు రెండేళ్లలో రెండింతలు పెరిగాయి.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని ఆరోపించారు. రైతులకు యూరియా సరిపడ రెండు ప్రభుత్వాలు ఇవ్వట్లేదు.. కాంగ్రెస్ చేసే తుగ్లక్ పనులతో కౌలు రైతులు, రైతుల మధ్య పంచాయితీ జరుగుతుందని విమర్శించారు. ఎరువుల కోసం యాప్ తెచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది.. సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతులకు క్లారిటీ ఇవ్వాలన్నారు. ఒక వేళ నీళ్లు ఇవ్వకుంటే ప్రకటన విడుదల చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే.. ఈ రోజు వరకు కూడా 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు అంశాల్లో ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. 'యాసంగి 1200 కోట్ల బోనస్, వర్షాకాలం రూ. 600 కోట్ల బోనస్ నగదు ఇప్పటి వరకు ఇవ్వలేదు.. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదు.. మెదక్ రైతులు అగమ్యగోచరంగా ఉన్నారు.. ఘనపురం అనకట్ట నుంచి యాసంగి పంటకు నీళ్లు ఇస్తారా లేదా క్లారిటీ లేదు.. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీళ్లు ఖాళీ చేస్తున్నారు.. గత వేసవిలో ప్రాజెక్టు మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా చేయలేదు.. ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.. సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి జీవనాధారం.. పదేళ్ల ఃఖా పాలనలో బోరు బండ్లు లేవు.. ఇప్పుడు మళ్ళీ బోరు బండ్లు వచ్చాయి..' అని వ్యాఖ్యానించారు.

# బెళగావి రైలు బోగీలో మంటలు

## రైలును నిలిపి మంటలను ఆర్పిన సిబ్బంది

**హైదరాబాద్, డిసెంబర్ 18:** హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టులో బాంబు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ రోజు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్‌ను పంపారు. నేడు రెండు గంటల సమయంలో కోర్టును పేల్చివేస్తామంటూ దుండగులు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులో ఉన్న వారిని పోలీసులు బయటకు పంపిస్తున్నారు. కోర్టు హాల్స్ మొత్తం కాళీ చేపిస్తున్నారు. బాంబు బెదిరింపుతో ఒక్కసారిగా అలర్ట్ అయిన పోలీసులు. వెంటనే బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీం రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. కోర్టు ఆవరణలో అణువణువూ గాలిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించినట్లు అధికారిక సమాచారం లేదు.

# జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

- భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలి
- సర్పంచ్ ఎన్నిక లఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే మనదే విజయం
- యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్



**యాదాద్రి భువనగరి, డిసెంబర్ 18:** జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే ప్లేటులో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కిపైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని, అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేడని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాధించిన అభివృద్ధిని కేటీఆర్ వివరించారు.

# కార్మికుల షెడ్డులో అగ్నిప్రమాదం

- సిలిండర్లు పేలడంతో భారీగా ఎగిసిపడ్డ మంటలు
- కార్మికులు పనుల్లో ఉండడంతో తప్పిన ముప్పు



**హైదరాబాద్, డిసెంబర్ 18:** షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగి మంటలు ప్రమాదకరంగా మారిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లిలో కొనసాగుతున్న క్యాండూర్ భారీ బహుళ అంతస్థుల నిర్మాణానికి పనులు చేసే కార్మికుల షెడ్లలో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో షెడ్లలో ఉండే కార్మికులు వంట గ్యాస్ భారీ శబ్దాలు చేస్తూ పేలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో అధిక సంఖ్యలో కార్మికులు విధుల్లో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. నిర్మాణ సంస్థ ఉద్యోగుల సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్, పటాన్‌చెరువు ఫైర్ అధికారులు 3 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో కార్మికులకు సంబంధించిన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శేరిలింగంపల్లిలో అత్యధిక అంతస్థులతో నిర్మాణాన్ని చేపట్టిన క్యాండూర్ నిర్మాణ సంస్థ, తమ వద్ద పని చేస్తున్న కార్మికుల జాగ్రత్తను గాలికొదిలేసిందని, ఒకే చోట రేకుల షెడ్లను నిర్మించి వందలాది మందిని ఇరుకు గదులలో ఉంచిందని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే చందానగర్‌లో నిర్మాణ కార్మికుల షెడ్లు అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సంఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరిగితే తప్ప అధికారులు నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రంజాన్ ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష నిర్వహించాలి

## పండుగ వేళ ఇబ్బందులు కలగకుండా చూడాలి

### ప్రభుత్వానికి అమ్జెద్ ఉల్లా ఖాన్ విజ్ఞప్తి



**హైదరాబాద్, డిసెంబర్ 18:** రాబోయే రంజాన్ పండుగ, పవిత్ర రాత్రులైన షబ్బే మెహ్రాజ్, షబ్బే బరాత్ ఏర్పాట్లపై ప్రభుత్వం ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎం బి టీ) స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ కోరారు. 2026 ఫిబ్రవరి 19న రంజాన్ మాసం ప్రారంభం కానుండగా, దానికి ముందు జనవరి 16న షబ్బే మెహ్రాజ్ మరియు ఫిబ్రవరి 3న షబ్బే బరాత్ పర్వదినాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, పండుగ పనులు సకాలంలో పూర్తి కావాలంటే జనవరి మొదటి వారంలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సాధారణంగా ప్రభుత్వం రంజాన్ ప్రారంభానికి వారం ముందు సమీక్ష నిర్వహిస్తుందని, అయితే ఆ సమయంలో మంజూరైన సివిల్ పనులు పండుగ ముగిసే వరకు పూర్తి కావడం లేదని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిని నివారించడానికి ముఖ్యమంత్రి స్వయంగా అన్ని విభాగాల అధిపతులతో సమావేశమై పనులను పర్యవేక్షించాలని కోరారు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం మైనారిటీల పండుగ ఏర్పాట్లను తీవ్రంగా పరిగణిస్తుందనే బలమైన సందేశం వెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఈ సమీక్షా సమావేశాలకు కేవలం అధికారిక అనుబంధ పార్టీలనే కాకుండా, అన్ని రాజకీయ పక్షాలను, రాజకీయేతర మతపరమైన సంస్థలను ఆహ్వానించి వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఫిబ్రవరి 3న జరగనున్న షబ్బే బరాత్ సందర్భంగా ముస్లింలు పెద్ద సంఖ్యలో స్మశానవాటికలను సందర్శిస్తారని, అందువల్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జిహెచ్ఎం ) ఇతర జిల్లాల మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. స్మశానవాటికలలో అడవి చెట్ల తొలగింపు, గోడలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులు పర్వదినానికి ముందే పూర్తి కావాలని స్పష్టం చేశారు. గతంలో పనులు ఆలస్యంగా జరగడం వల్ల భక్తులు ఇబ్బంది పడ్డారని, ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేని ,ఇతర ఉన్నతాధికారులకు ఆయన లేఖలు పంపారు.

### బీబీ కా ఆలం ఊరేగింపు కోసం సొంత ఏనుగులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మొహ్రం ఊరేగింపు నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వమే సొంతంగా రెండు ఏనుగులను కొనుగోలు చేయాలని ఎం బి టీ స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ ముఖ్యమంత్రికు విజ్ఞప్తి చేశారు.

ఇతర రాష్ట్రాల నుండి ఏనుగులను తీసుకురావడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారుతోంది. రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, బయటి నుండి వచ్చే ఏనుగులకు స్థానిక వాతావరణం మరియు భారీ జనం మధ్య నడవడంలో తగిన శిక్షణ ఉండటం లేదన్నారు. దీనివల్ల ఊరేగింపు సమయంలో ఏనుగులు అదుపు తప్పే అవకాశం ఉందని, ఇది పోలీసు శాఖకు శాంతిభద్రతల నిర్వహణలో పెద్ద సమస్యగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# క్రీడలతో నూతనోత్సాహం

- డీజీపీ బి. శివధర్ రెడ్డి
- ముగిసిన 8వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 18 (మనసులో మాట):**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో మూడురోజులుగా జరుగుతున్న 8వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2025. ఘనంగా ముగిసింది. ఈ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి హాజరయ్యారు. వివిధ జోన్లు, విభాగాల నుంచి పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా డీజీపీ శివధర్ రెడ్డి రెనవేటెడ్/ పునర్నిర్మించిన పోలీస్ ఫుడ్ క్యాంటీన్ "ద కాప్ కేఫ్"ను ప్రారంభించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్న డీజీపీకి పోలీసు జాగిలం మౌని పూలబుట్ట అందించడం అందరినీ ఆకట్టుకుంది. పురుషులు, మహిళల 100 మీటర్ల పరుగు పందెం డీజీపీ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. పరేడ్ కమాండర్ నాగరాజు రెడ్డి నేతృత్వంలో సలామీ శస్త్ర స్వీకరించిన డీజీపీ. నిత్యం శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసుల బాధ్యతలు ఒత్తిడితో కూడినవైనప్పటికీ క్రీడల్లో పాల్గొనడం నూతన ఉత్సాహాన్ని అందిస్తుందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. క్రీడలు మానసిక స్థైర్యం, టీం స్పిరిట్, ఓర్పు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐక్యత వంటి గుణాలను తట్టి లేపుతాయన్నారు. పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యం కోసం కృషి చేస్తున్న సైబరాబాద్ సీపీ, జాయింట్ సీపీ, అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు. క్రీడల్లో గెలుపు–ఓటములనేవి సహజమని, స్పోర్టివ్ గా తీసుకోవాలన్నారు. మెడల్స్ గెలిచినా గెలవకున్నా ప్రజల మనసులు గెలుచుకున్న పోలీసులే నిజమైన విజేతలని డీజీపీ అన్నారు. 2014 నుంచి తెలంగాణ పోలీసులు సాధిస్తున్న విజయాలను ఉదాహరిస్తూ, ఆ స్ఫూర్తిని విధి నిర్వహణలోనూ కొనసాగించాలని సూచించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు 1,022 మంది పోలీస్ సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. పోలీసుల ఆరోగ్యం కోసం బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్ ను విజయవంతానికి కృషి చేసిన జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బందికి సీపీ కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను డీజీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్, మాదాపూర్ డీసీపీ రితిరాజ్, మేడ్చల్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్, రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కర్ణం, మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## బిహార్ సీఎంపై ఏసీపీకి ఫిర్యాదు



**కరీంనగర్, డిసెంబర్ 18 (మనసులో మాట):**

ముస్లిం మహిళా డాక్టర్పై అనుచితంగా వ్యవహరించిన బిహార్ సీఎం నితీష్ కుమార్పై గురువారం కరీంనగర్‌ఏసీపీ, టూటౌన్ సీఐకి మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) నాయకులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎంపీజే కరీంనగర్ బాధ్యుడు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ సీఎం హోదాలో ఉన్నారనే సోయి మరిచి, నితీష్ కుమార్ చేసిన దౌర్భాగ్యపు పనికి ముస్లిం సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న సమయంలో ఆయుష్ డాక్టర్ గా నియమకమైన నుస్రత్ పర్వీన్ బురఖాను తొలగించడం హేయమైన చర్యగా చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ముస్లిం మహిళల రక్షణకు ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంపీజే మహిళా విభాగం సీఎం నితీష్ కుమార్ పై ఫిర్యాదులు చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నితీష్ కుమార్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. సీఎం నితీష్ కుమార్, ముస్లిం మహిళలకు తక్షణమే క్షమాపణలు చెప్పకపోతే దేశవ్యాప్త ఆందోళనకు ఎంపీజే శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే నగర బాధ్యుడు అమ్మార్ లతీఫీ, వసీమ్ అహ్మద్, సలీం, అల్తాఫ్, ఎంపీజే మహిళా విభాగం నాయకురాళ్లు అయేషా సమ్రీన్, జరీనా తబస్సుమ్, ఆయేషా సిద్ధిఖ, జీనత్ ఫాతిమా, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ అభివృద్ధికి బాటలు

**రూ. 2.68 కోట్ల పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన!**

**నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపు..**

**జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన!**



**వరంగల్, డిసెంబర్ 18 (మనసులో మాట):**

వరంగల్ (తూర్పు) నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ స్పష్టం చేశారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని 38, 39 డివిజన్లలో రూ. 2 కోట్ల 68 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా మంత్రి పలు పనులను ప్రారంభించారు. 38వ డివిజన్‌లో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి డ్రైన్లు, కొత్త సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానికుల సామాజిక అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈద్గా అభివృద్ధికి గతంలోనే తాను కోటి రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, నీరు నిలవకుండా ఫ్లోరింగ్ పనులు చేపట్టి, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రజా పాలనలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నెరవేరుస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. 37వ డివిజన్ ఎం ఎం నగర్‌లో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును మంత్రి ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇళ్లలో అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సొంత స్థలం లేని నిరుపేదలకు ఇప్పటికే నిర్మించబడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తామని, వాటికి అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. నగర అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలను మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. నగరవాసుల చిరకాల స్వప్నమైన ఎయిర్‌పోర్టు సమస్య దాదాపు పరిష్కారమైందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జనవరి మొదటి లేదా రెండో వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరానికి రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలు అందజేసే ప్రతి ఫిర్యాదును మేయర్, కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్‌లతో చర్చించి తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. నిధుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, స్థానిక కార్పొరేటర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని తెలిపారు.



## మార్కెట్ లైన్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం ఆలస్యం

**విద్యార్థుల ఆకలిపై అధికారుల నిర్లక్ష్యం!**

**ఆగ్రహం వ్యక్తం చేసిన పీడీఎస్ యూ నాయకులు**

**12:45 అవుతున్నా అన్నం పొయ్యి మీదనేనా?**

**నారాయణపేట, డిసెంబర్ 18 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ లైన్ హైస్కూల్‌లో నెలకొన్న సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం మండిపడింది. గురువారం పాఠశాలను సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు, అక్కడి పరిస్థితులను చూసి విస్మయం వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థులు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు బీ వెంకటేష్ మాట్లాడుతూ, మధ్యాహ్నం 12:45 గంటలు దాటినా ఇంకా అన్నం పొయ్యి మీదనే ఉండటం గమనార్హం. నిర్ణీత సమయానికి భోజనం అందించకపోవడం వల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుందని, ఇది అధికారుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని ఆయన ఖండించారు. విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామన్న ప్రభుత్వ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా, నేటికీ స్కూళ్లలో కనీస సమస్యలు పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం మరియు అధికారులు తమ నిర్లక్ష్య వైఖరిని వీడాలని పీడీఎస్ యూ డిమాండ్ చేసింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందేలా చూడాలని, ఆర్టీసీ బస్సు సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించని పక్షంలో, జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున రోడ్డు దిగ్బంధనం (రస్తా రోకో) చేస్తామని హెచ్చరించారు.



కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా నాయకులు మహిపాల్, సురేష్‌తో పాటు పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమైతే ఉద్యమం తప్పదని వారు స్పష్టం చేశారు.





## శేరిలింగంపల్లి భారీ అగ్నిప్రమాదం!

**52 అంతస్తుల క్యాండియర్ హైరైజ్ అపార్ట్ మెంట్ లో పేలిన సిలిండర్**

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 18 (మనసులో మాట):**

శేరిలింగంపల్లి లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లింగంపల్లి రైల్వే స్టేషన్ పక్కనే ఉన్న 52 అంతస్తుల క్యాండియర్ హైరైజ్ అపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న కార్మికుల షెడ్లలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్లు ఒక్కసారిగా పేలడంతో ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగతో నిండిపోయింది. ఘటన జరిగిన సమయంలో గుడిసెల్లో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి మంటలను అదుపు చేశారు. ఘటన జరిగిన సమయంలో దట్టమైన పొగ పరిసరాలను కమ్మేసింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న చందనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మల్లన్నపేటలో చండీ యాగం

**వైభవంగా ముగిసిన ఏడు వారాల జాతర**



**గొల్లపెల్లి, డిసెంబర్ 18 (మనసులో మాట):**

గొల్లపెల్లి మండలం మల్లన్నపేట గ్రామములోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయము ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. గత ఏడు వారాలుగా కొనసాగుతున్న మల్లన్న షష్ఠి జాతర ఉత్సవాలు గురువారం నాటి 'చండీ యాగం'తో అత్యంత వైభవంగా ముగిశాయి. జాతర ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాజేందర్ ఆధ్వర్యంలో చండీ యాగం శాస్త్రోక్తంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ హోమ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. లోక కల్యాణం కోసం నిర్వహించిన ఈ యాగంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. ఏడు వారాల జాతర ఉత్సవాలు సంపూర్ణమయ్యాయి. ఈ ముగింపు వేడుకలలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఈఓ విక్రమ్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. జాతర విజయవంతంగా పూర్తి కావడంతో భక్తులు, ఆలయ కమిటీ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

# అక్రమ నల్లా కనెక్షన్లపై జలమండలి ఉక్కుపాదం

**9 మందిపై క్రిమినల్ కేసులు నమోదు!**

**సీతారాం బాగ్ ప్రాంతంలో 15 అక్రమ కనెక్షన్ల తొలగింపు**

**ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో విజిలెన్స్ చర్యలు**




**హైదరాబాద్, డిసెంబర్ 18 (మనసులో మాట):**

హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి (జలమండలి) అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెడ్ హిల్స్ పరిధిలోని సీతారాం బాగ్ ప్రాంతంలో ఈ ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల ఈ ప్రాంతంలో జీహెచ్ఎంసీ నూతన రోడ్డు పనులు చేపట్టింది. ఈ నిర్మాణ సమయాన్ని అదునుగా తీసుకున్న కొందరు నివాసితులు అధికారుల అనుమతి లేకుండా జలమండలి ప్రధాన పైపులైన్ నుంచి అక్రమంగా కనెక్షన్లు తీసుకున్నారు. ఇక్కడ నివసించే తొమ్మిది మందికి ఇప్పటికే అధికారిక కనెక్షన్లు ఉండగా, అదనంగా మరో 15 అక్రమ నల్లా కనెక్షన్లను స్వయంగా ఏర్పాటు చేసుకున్నట్లు విజిలెన్స్ విభాగం గుర్తించింది. అక్రమ కనెక్షన్ల సమాచారం అందిన వెంటనే జలమండలి విజిలెన్స్ బృందం రంగంలోకి దిగింది. పైపులైన్లకు ఏర్పాటు చేసిన 15 అక్రమ కనెక్షన్లను అధికారులు తక్షణమే తొలగించారు. ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేసినందుకు మరియు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు గాను ఆ తొమ్మిది మందిపై చందానగర్/స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అధికారుల అనుమతి లేకుండా తాగునీటి నల్లా లేదా సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లు తీసుకోవడం నేరమని జలమండలి స్పష్టం చేసింది. నగరవ్యాప్తంగా అక్రమ కనెక్షన్లపై నిరంతరం నిఘా ఉంటుందని, ఉల్లంఘనదారులపై ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండానే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరికైనా కనెక్షన్లు అవసరమైతే జలమండలి వెబ్‌సైట్ ద్వారా లేదా కార్యాలయంలో సంప్రదించి అధికారికంగా పొందాలని సూచించారు. నగరంలో ఎక్కడైనా అక్రమ నల్లా లేదా సీవరేజ్ కనెక్షన్లను గమనిస్తే వెంటనే జలమండలి విజిలెన్స్ బృందానికి సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# ఏఆర్ హెచ్ సీ అమలు తీరుపై ఎంపీ చామల ఆందోళన

**పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ప్రస్తావన**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (మనసులో మాట):**

దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాలకు, వలస కార్మికులకు తక్కువ ధరకే అద్దె ఇళ్లు కల్పించే 'అఫోర్డబుల్ రెంటల్ హౌసింగ్ కాంప్లెక్స్' పథకం తెలంగాణలో ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ స్థాయి సంఘం (ఘ్ఖఅఏఅస్త్ర జశీఎ-ఎఢవవ) సమావేశంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారి అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదలు మరియు వలస కార్మికుల గృహ వసతి సౌకర్యాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ, తెలంగాణలో దీని అమలు అత్యంత పేలవంగా ఉందని ఎంపీ అధికారులను ప్రశ్నించారు. కేంద్రం నుండి రాయితీలు, మినహాయింపులు అందుతున్నా రాష్ట్రంలో ప్రాజెక్టులు వేగవంతం కాకపోవడానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరుపేదల సొంతింటి కల నెరవేరే వరకు, వారికి సురక్షితమైన మరియు సరసమైన అద్దె ఇళ్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు వలస కార్మికులే వెన్నెముక అని ఎంపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుండి వచ్చే కార్మికులకు అద్దె భారం తగ్గించడానికి ఈ కాంప్లెక్స్‌లు ఎంతో దోహదపడతాయని వివరించారు.

# మాయమవుతున్న పాత జ్ఞాపకాలు

- **అరచేతిలో బందీ అవుతున్న బంధాలు!**

**నాగార్జునసాగర్, డిసెంబర్ 18 (మనసులో మాట):**

కాలం మారుతోంది.. కాలంతో పాటు మనుషులూ మారుతున్నారు. కానీ, ఈ మార్పు మనిషిని యంత్రంగా మారుస్తోందన్నది చేదు నిజం. ఒకప్పుడు ఊపిరి పోసుకున్న పల్లె ఆత్మీయతలు, వీధి వీధినా వినిపించిన పిల్లల కేరింతలు నేడు స్మార్ట్ ఫోన్ల తెరల వెనుక కనుమరుగవుతున్నాయి. 'టెక్నాలజీ' మనిషిని ప్రపంచానికి దగ్గర చేస్తోందో లేదో కానీ, పక్కనున్న మనిషికి మాత్రం ఆమడ దూరం తీసుకెళ్తోంది.



## రచ్చబండ ముచ్చట్లు.. అంతా గతం!

ఒకప్పుడు పల్లెల్లో ఉదయం లేవగానే పలకరింపులతో రోజు మొదలయ్యేది. సాయంత్రం వేళల్లో ఊరి మధ్యలోని రచ్చబండ సామాజిక చర్చలకు వేదికగా ఉండేది. అక్కడ పెద్దల అనుభవాలు, కష్టసుఖాల పంపిణీ జరిగేది. ఇప్పుడు రచ్చబండలు వెలవెలబోతున్నాయి. మనుషులు భౌతికంగా దగ్గరగా ఉన్నా, మానసిక ప్రపంచాలు వేరవుతున్నాయి. చేతిలో ఫోన్ ఉంటే చాలు, పక్కన ఎవరున్నారో కూడా పట్టించుకోనంతగా మనిషి ఆ 'మాయా ప్రపంచం'లో మునిగిపోతున్నాడు.



## మైదానాలు ఖాళీ.. మొబైల్ గేమ్స్ ఫుల్!

గతంలో సెలవు వచ్చిందంటే చాలు.. పిల్లలు చెరువుల గట్లు, చెట్ల నీడలు, వీధి చివర మైదానాల్లో సందడి చేసేవారు. గిల్లీ దండ, దాగుడు మూతలు, కబడ్డీ, పోటీలు, తొక్కుడు బిళ్ళ వంటి ఆటలు పిల్లల్లో శారీరక దృఢత్వాన్ని, జట్టు స్ఫూర్తిని నింపేవి. నేడు ఆ సందడి ఎక్కడా కనిపించడం లేదు. పసిపిల్లల నుండి పండు ముసలి వరకు అందరూ స్మార్ట్ ఫోన్లకే పరిమితమవుతున్నారు. శారీరక శ్రమ లేని 'వీడియో గేమ్స్' మోజులో పడి భవిష్యత్ తరం రోగాల బారిన పడుతోంది..

## సోషల్ మీడియా వ్యామోహం - తగ్గుతున్న బంధాలు

ఒకప్పుడు పండుగలు, శుభకార్యాలు అంటే అందరూ కలిసి చేసుకునే వేడుకలు. ఇప్పుడు అవన్నీ 'స్టేటస్' అప్‌డేట్లుగా మారిపోయాయి. ముఖాముఖి పలకరింపులు తగ్గిపోయి, ఎమోజీల ద్వారా పలకరింపులు సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు ఒకే గదిలో కూర్చున్నా, ఎవరి ఫోన్లలో వారు నిమగ్నమై ఉండటం వల్ల మనుషుల మధ్య భావోద్వేగ అనుబంధం సన్నగిల్లుతోంది. సోషల్ మీడియాలో వచ్చే 'లైకుల' కోసం పడే ఆరాటం, నిజ జీవితంలోని ప్రేమానురాగాలపై చూపించలేకపోతున్నారు.

## వింత పరిస్థితి.. అరచేతిలో లోకం..

ఒంటరిగా మనిషి!సాంకేతికత పెరిగిన కొద్దీ సౌకర్యాలు పెరిగాయి కానీ, ప్రశాంతత కరువవుతోంది. చిన్న వయసులోనే మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఈ స్మార్ట్ ఫోన్ వాడకం వల్ల వస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పల్లెల్లో సైతం ఈ పరిస్థితి రావడం విచారకరం.మేలుకోకపోతే అంతే! జ్ఞాపకాలు కనుమరుగు కాకముందే.. బంధాలు పూర్తిగా తెగిపోకముందే మనం మేలుకోవాలి. సాంకేతికతను అవసరానికి మాత్రమే వాడుతూ, మనుషులతో గడిపే సమయాన్ని పెంచుకోవాలి. పాత ఆటలను, నాటి ఆత్మీయ పలకరింపులను మళ్ళీ బతికించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

# రహదారులపై కనిపించని దారి

- **దట్టమైన పొగమంచుతో వాహనదారుల ఇక్కట్లు!**

**రాయికల్, డిసెంబర్ 18 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం ఉదయం రాయికల్ మండలవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కురిసింది. దీంతో రహదారులు మంచు దుప్పటిని కప్పుకున్నట్లుగా మారిపోయాయి. ముఖ్యంగా మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రాయికల్ మండల కేంద్రం నుంచి మేడిపల్లి, కోరుట్ల, రామాజీపేట మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం ఉదయం పొగమంచు భీభత్సం సృష్టించింది. దట్టమైన మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. సాధారణంగా రద్దీగా ఉండే ఈ మార్గాల్లో వాహనాలు నడపడం కష్టతరమవ్వడంతో వాహనదారులు చాలా చోట్ల వాహనాలను నిలిపివేయాల్సి వచ్చింది.



## ప్రమాదాల ముప్పు - అప్రమత్తంగా ఉండాలి!

రహదారి సరిగ్గా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, కారు డ్రైవర్లు తప్పనిసరిగా హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాలని, వేగాన్ని నియంత్రించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మలుపుల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని, పొగమంచు తగ్గే వరకు వేచి చూడటం ఉత్తమమని పలువురు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

## వణికిస్తున్న చలిపులి - గడప దాటని జనం

గత వారం రోజులుగా జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్రమైన చలి కారణంగా ప్రజల జీవనశైలిలో పెను మార్పులు వచ్చాయి. చలి తీవ్రత దృష్ట్యా ఉదయం ఎనిమిది గంటల వరకు కూడా ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావడానికి సాహసించడం లేదు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు చలికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుండే చలి గాలులు మొదలవుతుండటంతో వ్యాపార సముదాయాలు కూడా త్వరగానే ముగుస్తున్నాయి. రహదారులు వెలవెలబోతున్నాయి.

## జాగ్రత్తే రక్ష!

రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాహనదారులు పొగమంచు సమయాల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవడం లేదా అత్యంత జాగ్రత్తగా వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

# బీటీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

- **అప్పిరెడ్డిపల్లి - నిర్జింత రహదారి నిర్మించకుంటే ఆందోళన తప్పదు!**
- **ప్రగతిశీల యువజన సంఘం నాయకులు**

**కొడంగల్/మద్దూరు, డిసెంబర్ 18 (మనసులో మాట):**

కొడంగల్ నియోజకవర్గం, మద్దూరు మండల కేంద్రంలో రహదారి సమస్యపై నిరసన స్వరం వినిపిస్తోంది. అప్పిరెడ్డిపల్లి గేటు నుంచి నిర్జింత (కొత్తపల్లి) వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ప్రగతిశీల యువజన సంఘం మండల నాయకులు కొండ అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఒక విజ్ఞప్తి చేశారు.

## 10 కిలోమీటర్ల అదనపు భారం - ప్రయాణికుల ఇక్కట్లు

అప్పిరెడ్డిపల్లి నుంచి కొత్తపల్లి మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రస్తుతం ప్రజలు సుమారు 10 కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. నేరుగా వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రయాణ సమయం, ఇంధనం వృథా అవుతున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ అప్పిరెడ్డిపల్లి గేటు నుండి నిర్జింత మీదుగా రోడ్డు నిర్మిస్తే, కేవలం 5 కిలోమీటర్ల పరిధిలోనే కొత్తపల్లికి చేరుకోవచ్చని, తద్వారా దూరం సగానికి తగ్గుతుందని విశ్లేషించారు.

## రైతాంగానికి, ప్రభుత్వ పనులకు తప్పని తిప్పలు

అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతుల భూములు అధికంగా కొత్తపల్లి మండల పరిధిలో ఉన్నాయి. దీంతో నిత్యం పొలం పనుల నిమిత్తం వెళ్లే రైతులకు ఈ రహదారి లేకపోవడం పెద్ద శాపంగా మారింది. మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న ఎంఆర్ఓ ఆఫీస్, వ్యవసాయ కార్యాలయం వంటి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు లేదా ఇతర పనులకు వెళ్లడం కష్టతరమవుతోందని వారు పేర్కొన్నారు.

## టెండర్లు వేయాలి - పనులు ప్రారంభించాలి

ఈ రహదారికి సంబంధించి గతంలోనే అనుమతులు లభించినా, ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ రహదారికి టెండర్లు వేసి, యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలని కోరారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తే సహించేది లేదని, వెంటనే స్పందించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పీవైఎల్ నాయకులు హెచ్చరించారు.



## అభివృద్ధి అంటే రహదారులే!

ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి. వందలాది మంది రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అప్పిరెడ్డిపల్లి గేటు - నిర్జింత రహదారిని త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన



**వాంకిడి:** ప్రభుత్వ పాఠశాలలు, సం క్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. గురువారం వాంకిడి మండలం గోయగావ్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, ప్రీప్రైమరీ విభాగం, విద్యార్థుల హాజరు, బోధన ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, వంటశాల, ప్రహరీ, ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులు, హాజరు పట్టికలు, సమగ్ర శిక్ష విధానాలను సమీక్షించారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులపై దృష్టి సారించాలని,. పరీక్షల దృష్ట్యా ప్రత్యేక విద్యా బోధన అందించాలని ఆదేశించారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



# జిల్లా కలెక్టర్‌కు సన్మానం



**ఆసిఫాబాద్:** జిల్లాలో ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు జరగడంలో బాధ్యత వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలను జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రతిఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు ఉమర్ హుస్సేన్, హరిప్రసాద్, పంచాయితీ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం



**గుడిహత్నూర్:** గుడిహత్నూర్ సర్పంచ్‌గా గెలుపొందిన ఆడేశీల రాజేశ్వర్, ఉప సర్పంచ్ నిఖిల్ లాందాడే, వార్డు మెంబర్‌గా గెలుపొందిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవినాష్ లను జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆడే శీల మాట్లాడుతూ గెలుపు ఓటములను ఓర్పుతో స్వీకరించి నిరంతరం ప్రజా క్షేత్రంలో ప్రజల సమస్యలపై పాటు పడే వారికి ప్రజల ఆశీర్వాదం తప్పకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగ్‌నాథ్ అప్ప, ససానే మాధవ్, మహేందర్ మారుతి, పిరాజి, రాహుల్ సారంగాపాని తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సమయంలో మార్పులు

**ఆదిలాబాద్:** జిల్లాలో తీవ్ర చలి దృష్ట్యా పాఠశాల సమయాల్లో మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ మెటీరియాలజికల్ డిపార్ట్‌మెంట్ నివేదిక మేరకు జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు అమలవుతున్న పాఠశాల వేళలను సవరించి ఉదయం 9.40 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగేలా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొన్నారు. అన్ని మండల విద్యా అధికారులకు, ప్రభుత్వ, ఎల్బీ, కేజీబీవీ, మోడల్ హై స్కూళ్లు, అలాగే ప్రైవేట్ విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# హస్తం గూటికి స్వతంత్ర అభ్యర్థి

**ఆసిఫాబాద్ టౌన్:** మండలంలోని రౌటసంకెపల్లి గ్రామ పంచాయతీలోని 6వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఎడ్ల బాపూరావు హస్తం గూటికి చేరారు. గురువారం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆమె పార్టీ కండువా కప్పి సారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇరుకుల్ల మంగ, కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా అధ్యక్షుడు గుండా శ్యాం, నాయకులు ఆరీఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో మరణించిన

# ఉద్యోగులకు సంతాపం



**ఆసిఫాబాద్:** ఎన్నికల విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిజేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ గ్రేషియా చెల్లించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లాలోని ఆసిఫాబాద్ మిషన్ భగీరథ ఏఈ కట్ట రాజు ఎన్నికల విధి నిర్వహణలో మృతి చెందారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇతర జిల్లా అధికారుల నుంచి నేరుగా నివేదికలు పొందేందుకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని, జిల్లా స్థాయిలో ఎన్నికల పరిశీలన కోసం పరిశీలకులను నియమించి పటిష్టంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి తగిన సూచనలు చేసేందుకుగాను రాష్ట్ర స్థాయిలో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వారా అనుకోని ఘటనలు సంభవించిన వెంటనే తక్షణమే పరిష్కరించడం జరిగిందని, మద్యం దుకాణాల మూసివేత, పోలింగ్ కేంద్రాల లోపల, బయట చోటు చేసుకున్న ఘటనలు, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై జోనల్ అధికారుల నుంచి ప్రత్యక్ష సమాచారాన్ని సేకరించి, వాటిని వెంటనే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ప్రవర్తనా నియమావళి సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని వివరించారు.



# జంగుబాయి ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** జంగుబాయి ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం ఆయన ఛాంబర్ లో జంగుబాయి దేవస్థాన కమిటీ ప్రతినిధులతో కలిసి ఉత్సవ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో దీపస్వరూప కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 30న మహాపూజ ఉంటుందని తెలిపారు. వచ్చేనెల 17న ముగింపు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన జంగుబాయి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి దేవస్థాన కమిటీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్‌కు సన్మానం



**నేరడిగొండ:** మండలంలోని కుంటాల(బి) గ్రామ సర్పంచ్ ఆత్రం గంగారాంతో పాటు వార్డు సభ్యులను గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ నూతన సర్పంచ్ ఆత్రం గంగారాం, ఉప సర్పంచ్ తొడసం లక్ష్మణ్ లను శాలువలతో సన్మానించారు.

# పుష్కర ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల:** 2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని నది తీర ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర దేవాదాయ శాఖ, ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ ప్రతినిధులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అధికారి నవీన్ కుమార్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర అధికారులు పలు సూచనలు చేశారని, ఏర్పాట్లు, సమన్వయ చర్యలపై సమీక్షించారని తెలిపారు. గోదావరి పుష్కరాలు 2027, కృష్ణా పుష్కరాలు 2028లను సురక్షితంగా, సవ్యంగా, భక్తులకు అనుకూలంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో పుష్కరాల ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతలను ఆ సంస్థకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు అవసరమైన సమగ్ర వివరాలను అందిస్తామని, పుష్కర ఘాట్లపై క్షేత్ర స్థాయి పరిశీలనలు ఇప్పటికే నిర్వహించామని అన్నారు. పుష్కరాల ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని, పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ను జిల్లా నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలోని 11ప్రాంతాల్లో పుష్కర ఘాట్లు ఉన్నాయని, భక్తుల సందర్శన సంఖ్య ఆధారంగా ఈ ఘాట్లను 3 టియర్స్‌గా విభజించడం జరిగిందని, ఆయా ఘాట్ల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనను పుణ్యక్షేత్రాల అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, స్నానఘాట్ల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు కలెక్టర్ అభినందన



**ఆదిలాబాద్:** జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, మైక్రో అబ్జ ర్వర్లు, ఎస్‌ఎస్టి, వివిస్టి బృందాలకు సమగ్రమైన శిక్షణ అందించిన మా స్టర్ ట్రైనర్ల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. మూడు విడతల్లో నిర్వహించిన ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి కావడానికి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ ఎంతో తోడ్పడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను సన్మానించారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యమై నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా సాగడానికి శిక్షణ కీలకపాత్ర పోషించిందని తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




# అక్రమ కేసులతో గాంధీ కుటుంబాన్ని వేధిస్తోన్న కేంద్రం

## డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఆదిలాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాంధీ కుటుంబ గౌరవం తగ్గించడం కోసం నేషనల్ హెరాల్డ్ పేరుతో అక్రమ కేసులు పెట్టి గత పదేళ్లుగా వేధించే ప్రయత్నం చేస్తోందని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు తప్పు పట్టడంతో కేంద్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసి జిల్లా బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి మావల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పరిపాలించడం చేతకాక, ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలని అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ ఎంపీ సోయం బాపు రావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, నహీద్, ముడుపు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదిలో వంద శాతం ఫలితాలు రావాలి



**నేరడిగొండ:** విద్యార్థులు పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలని జీసీడీఓ మెస్రం ఛాయ సూచించారు. గురువారం మండలంలోని కుంటాల గ్రామ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలతో పాటు దిశ మెడల్ స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత రికార్డులు, విద్యా, వసతి తదితర వాటిని పరిశీలించారు. అనంతరం సిక్ గదిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వార్షిక పరీక్షల కోసం ఇప్పటినుంచే కష్టపడి చదవాలని పేర్కొన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. శుక్రవారం జిల్లా స్థాయిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన లో పాఠశాల నుంచి ఎంపికైన టీఎల్ఎం స్మార్ట్ ఇరిగేషన్ సిస్టం ను పరిశీలించి 9వ తరగతి విద్యార్థి చిట్టతో పాటు హెచ్ఎం, సంబంధిత ఉపాధ్యాయును అభినందించారు. ఆటోమెటెడ్ స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్ అనేది వ్యవసాయంలో ఆధునిక సాంకేతికను ఉపయోగించి రూపొందించిన ఒక నీటి పారుదల వ్యవస్థ అని అన్నారు. నీటి పారుదల ప్రక్రియను ఆటోమేట్ చేయడం ద్వారా మానవ ప్రమేయంతో పాటు శ్రమను తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆమె వెంట ప్రాధానోపాధ్యాయులు అంబారావు, గైడ్ టీచర్లు ఆర్ శశికాంత్, ఆర్ పవన్ ఉన్నారు.

# పత్తి చేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

## తప్పిన పెను ప్రమాదం ● డ్రైవర్ సమయస్ఫూర్తికి హ్యాట్సాఫ్



**కెరమెరి :** పత్తి చేనులోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల పరిధిలోని పరందోలి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్సు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. అకస్మాత్తుగా బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 35 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. బ్రేకులు పని చేయకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా అతి కష్టం మీద రోడ్డు పక్కనే ఉన్న పత్తి పొలంలోకి మళ్లించాడు. ఈ క్రమంలోనే పొలంలో ఉన్న ఓ మహిళకు గాయాలు కాగా, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే స్థానికులు, పోలీసుల సాయంతో ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రాణ నష్టం వాటిల్లలేదని ప్రయాణికులు, స్థానికులు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాల పై పోలీసులు, ఆర్టీసీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆధ్యాత్మిక శోభితం.. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

- కుటుంబ సమేతంగా అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారికి ప్రార్థన



**ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గురువారం భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన కుటుంబ సమేతంగా అయ్యప్ప స్వామి పడిపూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలంటూ కోరుకుంటూ ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అయ్యప్ప స్వాముల భజనలు, కీర్తనలతో క్యాంప్ కార్యాలయం ప్రాంగణం మారుమోగింది. మాలధారులు, భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. లోక కల్యాణం కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ పడిపూజ మహోత్సవంలో స్థానిక గురుస్వాములు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.





# నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయమే గెలిచింది

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

## కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన





**ఆసిఫాబాద్ :** నేషనల్ హెరాల్డ్ కేసులో నిజం గెలిచిందని, కుట్ర ఓడిపోయిందని, రాజకీయ కక్ష తో ఈడీని వాడుకున్న బీజేపీకి ఇది గుణపాఠమని, సోని యా గాంధీ, రాహుల్ గాంధీ నిర్దోషులని, ప్రజాస్వామ్యం గెలిచిందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రహదారి పై బైటయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ కేసులను కోర్టు తప్పు పట్టిన నేపథ్యంలో, బీజేపీ చేసిన అరాచకాలపై నిరసన తెలుపుతున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ చేస్తున్న అరాచకాలు ఓడిపోయాయని, ప్రజాస్వామ్య సంస్థల దుర్వినియోగాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పదేళ్లుగా గాంధీ కుటుంబాన్ని అవమానించిన బీజేపీ ఈ రోజు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని, రాహుల్ గాంధీ దేశంలోని నిరుద్యోగంపై మాట్లాడితే కేసులు, రైతుల కోసం నిలబడితే ఈడీ, ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఇదేనా ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. ఇదేనా బీజేపీ దేశానికి ఇచ్చే పాలన అని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా చేయడం ఒక్క మా నాయకుల కోసమే కాదు అని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భయపడే పార్టీ కాదని, పోరాడే పార్టీ అని జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలతో, ఇందిరాగాంధీ ధైర్యంతో, రాజీవ్ గాంధీ త్యాగంతో, రాహుల్ గాంధీ పోరాటంతో ముందుకు సాగుతున్నమన్నారు. బీజేపీ ఎంత అణచివేయాలని చూసినా నిజాన్ని ఆపలేరని, న్యాయాన్ని , కాంగ్రెస్ పార్టీని ఆపలేరని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

## జిల్లా ఎస్పీ నితిక పంత్



**ఆసిఫాబాద్ :** జిల్లా పరిధిలో మూడు విడతలుగా నిర్వహించిన పంచాయితీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ నుంచి నేటి వరకు జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు, పోలీసు అధికారులకు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆమె తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మొత్తం 800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించామని, ఇతర శాఖలకు చెందిన మరో 200 మంది సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను దిగ్విజయం చేశారని ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే జిల్లావ్యాప్తంగా నిబంధనలను కఠినంగా అమలు చేశామని, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లేదా భయభ్రాంతులకు గురికాకుండా నిరంతర నిఘా కొనసాగించామని ఆమె వివరించారు. ఈ బందోబస్తులో పోలీసులతో పాటు ఫారెస్ట్, సింగరేణి, ఎక్సైజ్, ట్రాన్స్‌కో మరియు ఏసీబీ శాఖల సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వ హించిన విస్తృత తనిఖీలలో నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. తనిఖీలలో భాగంగా 22 వేల రూపాయల నగదు, 1,88,156 రూపాయల విలువైన 324 లీటర్ల మద్యం, అలాగే 1,94,190 రూపాయల విలువైన 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 90 చీరలను పట్టుకున్నట్లు వివరించారు. వీటితో పాటు 2,45,000 రూపాయల విలువ చేసే 18 గంజాయి మొక్కలు, 2.6 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, మొత్తం పట్టుబడిన సొత్తు విలువ 6,49,346 రూపాయలు ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారు, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులు కలిపి మొత్తం 959 మందిని ముందస్తుగా బైండోవర్ చేశామని ఎస్పీ వెల్లడించారు. తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా పగలు, రాత్రి కష్టపడి విధులు నిర్వహించిన ప్రతి ఒక్క అధికారిని, సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# కాగజ్‌నగర్‌లో కలకలం

## ఎస్‌పీఎం క్వార్టర్స్ వద్ద భారీ కొండచిలువ ప్రత్యక్షం..!

**సిర్పూర్ టీ :** కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌పీఎం క్వార్టర్స్ ప్రాంతంలో గురువారం ఒక భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో ఉన్న నివాస ప్రాంతంలో ఈ భారీ సర్పం తిరుగుతుండటాన్ని గమనించిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. జనసంచారం ఉన్న ప్రాంతంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు సమాచారం అందించగా, వారు ఎంతో ధైర్య సాహసాలతో స్పందించారు. ఎవరికీ ఎలాంటి హాని కలగకుండా, అత్యంత చాకచక్యంగా ఆ భారీ కొండచిలువను బంధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువను పట్టుకున్న అనంతరం సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారుల సూచనల మేరకు, ఆ కొండచిలువను పట్టణానికి దూరంగా ఉన్న జనవాసాలు లేని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.



# రోల్ బాల్ వరల్డ్ కప్ విజేతగా భారత్!



రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి.ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి.2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు.రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే.. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు.ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. కానీ గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఏ జట్టు ఎక్కువ గోల్స్ చేస్తే ఆ జట్టు విజేతగా నిలుస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఆడుతున్నారు.



## తెల్లని దుస్తుల్లో మెరిసిపోతున్న స్మృతి మంధాన

భారత మహిళా స్టార్ క్రికెటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సోషల్ మీడియాలో తన తాజా ఫోటోలతో సందడి చేస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్మృతి మంధాన.. తెల్లటి వన్-పీస్ డ్రెస్‌లో ఎంతో అందంగా కనిపించింది. బుగ్గపై డింపుల్, ముఖంలో చిరునవ్వుతో ఉన్న ఆమె ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.గత నెలలో స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకలు ఎదురైన విషయం తెలిసిందే. పలాష్ ముచ్చల్‌తో వివాహం రద్దయిందని స్వయంగా స్మృతి మంధాన సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ వార్త అభిమానులను కొంత ఆందోళనకు గురిచేసింది. అయితే కష్టకాలం నుంచి ఆమె వేగంగా కోలుకుంటోంది. "క్రికెట్టే నా సర్వస్వం, నా మొదటి ప్రేమ" అని ఆమె ఇటీవల పేర్కొంది. తాజా ఫోటోల్లో ఆమె ఉత్సాహంగా ఉండటం చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్ మైదానంలో స్మృతి మంధాన సందడి మళ్లీ మొదలుకానుంది. డిసెంబర్ 21 నుండి భారత్, శ్రీలంక జట్ల మధ్య 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో స్మృతి కీలక పాత్ర పోషించనుంది. జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఇందులో స్మృతి మంధాన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు సారథ్యం వహించనుంది.మహిళల ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లోనే ఆసక్తికర పోరు జరగనుంది. జనవరి 9న యల్ ఛాలెంజర్స్ బెంగళూరు(స్మృతి మంధాన), ఇండియన్స్ (హర్మన్‌ప్రీత్ కౌర్) జట్లు తలపడనున్నాయి. టీమిండియా కెప్టెన్, స్ కెప్టెన్ తలపడనుండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా జోరు

## ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు



ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటిన ఆసీస్.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగింది. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెప్టెన్ బెన్ స్టోక్స్(45 బ్యాటింగ్)తో పాటు జోఫ్రా ఆర్చర్(30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హ్యారీ బ్రూక్(45) పర్వాలేదనిపించగా.. మిగతా బ్యాటర్లు నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు తీసారు. కామెరూన్ గ్రీన్‌కు ఒక వికెట్ దక్కింది.అంతకుముందు 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్.. 91.2 ఓవర్లలో 371 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(106) త్వరగానే ఔటవ్వగా.. మిచెల్ స్టార్క్(54) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాథన్ లయన్(9) విఫలమవ్వగా.. స్కాట్ బోలాండ్(14 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(5/53) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. ఇంగ్లండ్ ఇంకా 158 పరుగుల వెనుకంజలో ఉంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 0-2తో వెనుకంజలో నిలిచింది. మరోవైపు డీఆర్ఎస్ విషయంలో తీవ్ర దుమారం రేగింది. సాంకేతిక లోపం కారణంగా ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్స్ క్యారీ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అతను ఏకంగా శతకంతో చెలరేగాడు. ఇది ఇంగ్లండ్ జట్టుకు తీవ్ర నష్టం చేసింది.అలెక్స్ క్యారీ సెంచరీతో తొలి రోజు ఆటలో ఆసీస్ ఆధిపత్యం చెలాయించింది. మొదటి రోజు ఆట అనంతరం అలెక్స్ క్యారీ డీఆర్ఎస్ వివాదాంపై స్పందించాడు. తాను ఔటయ్యాననే విషయం తెలుసని, అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో బ్యాటింగ్ కొనసాగించి సెంచరీ సాధించానని చెప్పాడు. ఈ వ్యాఖ్యలు మరింత అగ్గిని రాజేసాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 94 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన అలెక్స్ క్యారీతో కలిసి ఉస్మాన్ ఖవాజా జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే జోష్ టంగ్ వేసిన 63వ ఓవర్ తొలి బంతి అలెక్స్ క్యారీ బ్యాట్‌ను తాకుతూ వికెట్ కీపర్ చేతిలో పడింది. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. బ్యాట్‌ను బంతి తాకిన శబ్దం స్పష్టంగా వినిపించింది. దాంతో ఇంగ్లండ్ రివ్యూకి వెళ్లింది. కానీ స్నీకో మీటర్ టెక్నాలజీలో బంతి బ్యాట్‌ను తాకినట్లు తేలలేదు. బంతి బ్యాట్‌కు దూరంగా ఉన్నప్పుడు స్నీకో మీటర్‌లో గీత వచ్చింది. దగ్గరగా ఉన్నప్పుడు మాత్రం ఎలాంటి మార్క్ చూపించలేదు. రిప్లేతో పాటు స్నీకో మీటర్‌లో స్పష్టత లేకపోవడంతో థర్డ్ అంపైర్.. ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడి నాటౌట్ ఇచ్చాడు. అయితే టెక్నాలజీ లోపం కారణంగానే ఈ తప్పిదం జరిగిందని తొలి రోజు ఆట అనంతరం తేలింది. ఈ మ్యాచ్ టెక్నాలజీ విభాగాన్ని నిర్వహిస్తున్న బీబీజీ స్పోర్ట్స్ కంపెనీ తమ తప్పుకు క్షమాపణలు చెప్పింది. 'అలెక్స్ క్యారీ బ్యాట్‌కు బంతి తగిలింది వాస్తవమే. ఆ సమయంలో మా స్నికో ఆపరేటర్ పొరపాటున బ్యాట్స్‌మన్ వైపు ఉన్న స్టంప్ మైక్‌ను కాకుండా బౌలర్ వైపు ఉన్న మైక్‌ను ఎంచుకున్నాడు. దాంతో ఆడియోలో లోపడం ఏర్పడింది. ఈ తప్పిదానికి మేం బాధ్యత వహిస్తాం.'అని స్పష్టం చేసింది.


# గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యింది

## పొగ మంచు కారణం కాదు

## సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖేల్ యాదవ్

భారత్, సౌతాఫ్రికా మధ్య నాలుగో టీ20 రద్దుకు పొగ మంచు కారణం కాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖేల్ యాదవ్ అన్నారు. గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యిందని చెప్పారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా లక్నో వేదికగా బుధవారం జరగాల్సిన మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో పలు మార్లు మైదానాన్ని పరిశీలించి, విజిబిలిటిని పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై స్పందించిన అఖిలేష్ యాదవ్.. బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాలుష్యం లక్నోకు చేరడంతోనే మ్యాచ్ రద్దయ్యిందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. 'ఢిల్లీ కాలుష్యం ఇప్పుడు లక్నోకు చేరుకుంది. అందుకే లక్నోలో జరగాల్సిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ రద్దుకు మంచు కారణం కాదు. విషపూరితమైన గాలి కాలుష్యం.లక్నోలో స్వచ్ఛమైన గాలి కోసం మేం ఏర్పాటు చేసిన పార్కులను కూడా బీజేపీ నాశనం చేసింది. పార్కుల్లో అనవసరమైన కార్యక్రమాలు నిర్వహించి వాటిని దెబ్బతీసింది. మానవులతో పర్యవరణానికి బిజేపీ శ్రేయస్కారం కాదు. లక్నోలో ఉంటే మాస్క్ ధరించండి'అని అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు.పొగమంచుతో పాటు మైదానం గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. కాసేపు మైదానంలో ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదాన్ని పరిశీలించిన అంపైర్లు.. మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ మ్యాచ్ రద్దవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై మండిపడుతున్నారు. పొగమంచు కురిసే ప్రదేశాల్లో మ్యాచ్‌లు ఎందుకని, సౌత్ ఇండియాలో చాలా మైదానాలు అనుకూలంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ టికెట్ డబ్బులు రిటర్న్ చేయాలని ప్రేక్షకులు కోరుతున్నారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో కొనసాగుతుంది. ఆఖరి మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది.





# నార్త్‌లో మ్యాచ్‌లు నిర్వహించొద్దు

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్



ఉత్తర భారతదేశంలో డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు తీవ్ర పొగమంచు సమస్య ఉండటంతో ఆ కాలంలో అక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ బీసీసీఐని కోరారు. ఆ సీజన్‌లో మ్యాచ్‌లు పెడితే అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతారని, ఇది క్రికెట్ ప్రేమికులను మోసం చేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తర్?ప్రదేశ్?లోని లఖ్?నవూలో బుధవారం జరగాల్సిన భారత్ - దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ తీవ్ర పొగమంచు కారణంగా టాస్ కూడా వేయకుండానే రద్దుకావడంపై థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎకానా స్టేడియాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఆట కొనసాగించడం అసాధ్యమైంది. దీనితో ఉత్తర భారతంలో శీతాకాలంలో మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన శశి థరూర్ మాట్లాడుతూ, "డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాల్లో పొగమంచు సాధారణమే. ఆ సమయంలో బంతి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఎలా నిర్వహిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. "నిన్న దేశం మొత్తం నిరాశకు గురైంది. భారత్ - దక్షిణాఫ్రికా మ్యాచ్ చూడాలని ఎదురు చూసిన అభిమానులు తీవ్రంగా బాధపడ్డారు. కాబట్టి నా వాదన ఒక్కటే. ఈ కాలంలో మ్యాచ్‌లను దక్షిణ భారతంలో నిర్వహించాలి" అని థరూర్ సూచించారు. "నా నియోజకవర్గమైన తిరువనంతపురంలో అద్భుతమైన స్టేడియం ఉంది. మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ వాతావరణ పరిస్థితులు చాలా అనుకూలంగా ఉంటాయి. ఇక్కడికి వచ్చి మ్యాచ్‌లు ఆడండి" అని ఆయన అన్నారు. డిసెంబర్ చివర్లో మహిళల క్రికెట్ జట్టు తిరువనంతపురంలో ఆడబోతోందని గుర్తుచేసిన థరూర్, షెడ్యూలింగ్ చేస్తూ వాతావరణ పరిస్థితులను బీసీసీఐ తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు."కేరళతో పాటు దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో ఈ తరహా పొగమంచు సమస్య ఉండదు. కాబట్టి డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలో మ్యాచ్‌లు వద్దు క్రికెట్ అభిమానులను మోసం చేయొద్దు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై బుధవారం రాత్రి సోషల్ మీడియా వేదిక ఎక్స్?లో కూడా థరూర్ పోస్టు చేశారు. లఖ్?నవూలో ఏక్యూఐ 411గా ఉండగా, తిరువనంతపురంలో కేవలం 68 మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. "పొగమంచు కారణంగా మ్యాచ్ ప్రారంభించలేకపోయారు. ముందే తిరువనంతపురంలో షెడ్యూల్ చేసి ఉంటే సమస్యే ఉండేది కాదు" అని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో శశి థరూర్‌తో పాటు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మధ్య ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరిగింది. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 మధ్య మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై మరింత జాగ్రత్త అవసరమని శుక్లా అంగీకరించారు. "ఈ కాలంలో తరచూ వాతావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి షెడ్యూలింగ్‌లో ఎక్కువ శ్రద్ధ పెట్టాలి" అని ఆయన తెలిపారు.దీనికి స్పందించిన థరూర్, జనవరిలో జరిగే మ్యాచ్‌లను కేరళకు మార్చాలని సూచించారు. అయితే ఇది కేవలం కేరళకే సంబంధించిన అంశం కాదని శుక్లా స్పష్టం చేశారు. "బీసీసీఐ రొటేషన్ పాలసీ ప్రకారం కేరళకు ఇప్పటికే మ్యాచ్‌లు వస్తున్నాయి" అని ఆయన చెప్పారు. థరూర్ మళ్లీ తన వాదనను కొనసాగించగా, అయితే అన్ని మ్యాచ్‌లను కేరళకే మార్చేస్తామంటూ శుక్లా సరదాగా వ్యాఖ్యానించారు.



# హద్దుమీరిన అభిమానం


## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్



మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.





# దారుణంగా ట్రీట్ చేశారు.. డబ్బులివ్వలేదు..

సినీరంగంలో నటీనటులుగా గుర్తింపు తెచ్చుకున్న తారలు.. కెరీర్ మొదట్లో ఎన్నో అవమానాలు భరించినవారే. ఇప్పుడు ఓ హీరోయిన్ సైతం తన మొదటి సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తమతో ఎంతో దారుణంగా ప్రవర్తించారని.. అందుకే ఆ సినిమాను తాను మర్చిపోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సినీరంగంలో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ హీరోయిన్ రాధిక ఆప్టే. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో రాణిస్తుంది. 2005లో వాహ్ లైఫ్ ఓతో ఐసీ సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత తెలుగు, హిందీ భాషలలో ఎన్నో సినిమాల్లో నటించింది. తాజాగా తన తొలి చిత్రం రోజులను గుర్తుచేసుకుంది. తన మొదటి సినిమా నిర్మాతలు తనకు డబ్బులు ఇవ్వలేదని అన్నారు. తన తల్లితో కలిసి ఒప్పందంపై సంతకం చేయమని అడిగినప్పుడు.. ఊర్మిళ మటోండ్కర్ వంటి స్టార్ హీరోయిన్ కూడా ఒప్పందంపై సైన్ చేయలేదని అన్నారని.., ఆమె సంతకం చేసిందో లేదో నాకు తెలియదు, కానీ వారు మాతో భయంకరంగా ప్రవర్తించారని అన్నారు. మహేష్ మంజ్రేకర్ గొప్ప వ్యక్తి. అందుకే నా సినిమాను మర్చిపోవడానికి ఇష్టపడతాను. ఆ టీంలో ఉన్న ఆయన నన్ను పిలిచి ఛాన్స్ ఇస్తానని అన్నారు అని గుర్తుచేసుకుంది. మొదటి సినిమాలో నేను బ్రెయిన్ సర్జన్ అనే నాటకం వేస్తున్నాను. అది మంచి నాటకం. మేము రాష్ట్ర పోటీలో అవార్డు గెలుచుకున్నాము. మహేష్ మంజ్రేకర్ న్యాయనిర్ణేతలలో ఒకరు. నాటకం ముగిసిన తర్వాత ఆయన నాకు ఫోన్ చేసి ఛాన్స్ ఇస్తానని అన్నారు అంటూ చెప్పుకొచ్చింది.



# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉ ండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861